శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్ర

రచయిత:
శ్రీ కొండపల్లి రామచంద్రరావు

1957 ఫిబ్రవరి

విశ్వసాహిత్యమాల-రాజమండ్రి

Sri Bhadrachala Kshetra Charitra,

By : Kondapalli Ramachandra Rao,

Published by: VISWA SAHITYAMALA, RAJAHMUNDRY

భారతీ ప్రెస్, రాజమండ్రి.

ప్రథమ ముద్రణ,

కాపీలు – 1000.

Rs. 1/8

Dr. Burgula Rama Krishnarao,
GOVERNOR OF KERALA.

RAJ BHAVAN,
TRIVANDRUM.
1-1-1957.

ఆశీస్సు

"శ్రీ భద్రాచల క్షేత్ర చరిత్రము" యొక్క ప్రతిని కృతజ్ఞతతో నందుకొంటిని. ఉద్యోగరీత్యా భద్రాద్రి రాముని సేవ చేయుచున్న మీరు భక్తిపూర్వకముగా క్షేత్ర మాహాత్మ్యమును రచించి ఆంధ్రలోకమున కందజేయుట మిక్కిలి ప్రశంసార్హము. ఆంధ్రపత్రికలో ప్రకటింపబడినప్పుడు చదివితిని. వానిని పుస్తకరూపముగా ప్రచురించుట సమంజసమే కాక అత్యవసరము. అట్టి కార్యమును పూర్తిచేసిన మీకు నా అభివందనములు. ఆంధ్రదేశము రామభక్తికి ఆలవాలము. కావున మీ గ్రంథ మాంధ్రావనియొక్క ఆదరమును పొందునని విశ్వసించుచున్నాను.

రాజభవన్,
తిరువేంద్రం,
1-1-1957.

ఇట్లు,
బూర్గుల రామకృష్ణారావు,
కేరళ గవర్నరు.

GOVERNMENT OF ANDHRA PRADESH

GRANDHI VENKATA REDDY NAIDU,
B.A., B.L.,
MINISTER FOR LAW.

KHAIRATABAD
HYDERABAD.

Dated 9-1-1957

తొలిపలుకు

భద్రాచల క్షేత్రమును గురించి, శ్రీసీతారామచంద్రుల మహాత్మ్యమును గురించి, భక్తిశ్రద్ధలతో హృద్యముగా రమ్యమైన భాషలో, రచించిన శ్రీ కొండపల్లి రామచంద్రరావుగారిని నే నెంతయో ప్రశంసించుచున్నాను. ఈ గ్రంథమును తొలుత ఆంధ్ర మహాజనులకు అందజేసిన శ్రీ ఆంధ్రపత్రికాధిపతులను అభినందించుచున్నాను.

భక్తిప్రపూరితమైన ఈ గ్రంథము భక్తులందరి ఆదరాభిమానములను హెచ్చుగా పొందగలదని ఆశించుచున్నాను.

శ్రీ రామచంద్రరావుగారికి ఆధ్యాత్మిక ప్రబోధకమైన గ్రంథములను ఇతోధికముగా రచింపగల శక్తిని ఆ శ్రీరామచంద్రమూర్తి యివ్వవలెనని ప్రార్థించుచున్నాను.

హైదరాబాద్,
9-1-1957.

ఇట్లు,
గ్రంధి వెంకట రెడ్డి,
న్యాయశాఖామంత్రి.

GOVERNMENT OF ANDHRA PRADESH

D. SANJIVAYYA,
MINISTER, SOCIAL WELFARE.

HYDERABAD
Dated Jan. 9, 1957.

అభిప్రాయము

శ్రీభద్రాచల క్షేత్ర చరిత్రము చదివే మహావకాశం నాకు గల్గినందులకు సంతోషిస్తున్నాను. రచయిత శ్రీ కొండపల్లి రామచంద్రరావుగారు శ్రీరామభద్రుని పద సాన్నిధ్యమున నిశ్చలభక్తితో వ్రాసియున్నారు. వచన రచనకు వన్నెతెచ్చేవిధంగా యెల్లరకు రుచించేటట్టు రచించినారు. అనేక గ్రంథరాజముల పరిశీలించి విషయసేకరణయందు సమితాసక్తి చూపియున్నారు. సహృదయులు, రసజ్ఞులు యీ గ్రంథమును ప్రశంసనీయమైన రచన యని మన్నించెదరని ఆశిస్తున్నాను. శ్రీ రామచంద్రరావుగారు మరికొన్ని యుత్తమ గ్రంథరచనలకు పూనుకొని ఆంధ్ర వాఙ్మయ చరిత్రయందు సుప్రసిద్ధులైన రచయితగా పేర్గాంచునిమిత్తం, నేను శ్రీభద్రాచల రాములను ప్రార్థిస్తున్నాను.

హైదరాబాద్,
9-1-1957.

ఇట్లు,
డి. సంజీవయ్య,
సోషల్ వెల్ఫేరుశాఖ మంత్రి.

అంకితము

క. నీ కథ నీకే యొసఁగెద
నీ కథ ఆంధ్రావనీ సహృదయానేక
శ్రీకరమగుఁగాఁత ! సమి
ద్భీకర ! కరుణాపయోనిధీ ! దాశరథీ !

STATE CENTRAL LIBRARY
HYDERABAD, A.P.

గ్రంథకర్త:

శ్రీ కొండపల్లి రామచంద్రరావు

పరిచయము

1955 వ సంవత్సరము మార్చి నెలలో నేను సకుటుంబముగ శ్రీ భద్రాద్రిరాముని, భక్తవర్యుడగు శ్రీ రామదాసుగారిని సేవించుటకై భద్రాచలమునకు పోయియుంటిని. శ్రీ రామచంద్రుని యొక్కయు, వారి భక్తులయొక్కయు పాదసేవ నాకు లభించినది. ఈ సందర్భమునందు మా బాల్య మిత్రులగు శ్రీ కొండపల్లి రామచంద్రరావుగారిని చిరకాలమునకు మరల కలిసికొను భాగ్యముకూడ నాకు అబ్బినది. శ్రీ రామచంద్రరావుగారు వయస్సులో పెద్దలు కాకున్నను బుద్ధిసంపదచేతను, భగవత్కార్యములయందు గల శ్రద్ధా భక్తులచేతను వృద్ధులని నాకు తోచినది. నేను భద్రాచలమునందు గడపిన కొలది దినములలో శ్రీ రామచంద్రరావుగారు అప్పటికే తాము రచించి యుంచిన భద్రాచలక్షేత్ర చరిత్రముయొక్క వ్రాతప్రతినుండి కొన్ని ఘట్టములను నాకు చదివి వినిపించిరి. అవి విని నేను చాల ఆనందించితిని. ఏతద్గ్రంథ ప్రచురణమునుగూర్చి శ్రీ రావుగారును నేనును కొంత ముచ్చటించితిమి. తరువాత ఈ పుస్తకమును ప్రకటింపవలసినదిగా నేను కొందరు మిత్రులకు మనవి చేసియుంటిని. కాని తుదకు ఈ గ్రంథమును పుస్తకరూపమున ప్రకటించు గౌరవము విశ్వసాహిత్యమాలవారికి దక్కినది. భద్రాచల

క్షేత్ర చరిత్రమును వ్రాసిన శ్రీ కొండపల్లి రామచంద్ర రావుగారికిని, ఏతత్పుస్తక ప్రకటనభారము వహించిన విశ్వ సాహిత్యమాలా సంపాదకులును, అస్మత్సోదరులు నగు శ్రీ మహీధర జగన్మోహనరావుగారికిని శ్రీరామచంద్రప్రభువు దీర్ఘాయువును, సమస్తైశ్వర్యములను ఇచ్చి రక్షింపగలడని నాకు దృఢవిశ్వాసము కలదు.

ఈ ఉత్తమ కృతికి పరిచయము వ్రాయవలసినదిగా నన్ను శ్రీ రామచంద్రరావుగారు కోరినారు. ఈ పనికై నన్ను నియమించి రావుగారు నాకు చాల గౌరవము కల్గించినారు. వారికి కృతజ్ఞుడను. ఈ చిన్న పుస్తకమునందుగల మాహాత్మ్యము చాల పెద్దది. విషయము శ్రీరామచంద్రు నికి నివాసమగు భద్రాచలక్షేత్రము. విషయప్రకటనము చేయువారు విద్యాధికులును, అంతకుమించి శ్రీరాముని యందు అపారమగు భక్తిశ్రద్ధలుగల శ్రీరామచంద్రరావు గారు. రామభక్తి వారికి వంశపారంపర్యముగ లభించిన ధనము. శ్రీ రావుగారి జనకులు కొండపల్లి నారాయణదాసు గారు అమితమగు విష్ణుభక్తిగలవారు. ఇట్టి రామచంద్రరావు గారు రచించిన పుస్తకములోని ప్రాశస్త్యమును ప్రశంసింప బూనుట సూర్యుని కాగడాతో చూపుట వంటిది. కాని ఈ విషయమై రెండు అంశములు మాత్రము తెల్పెదను. రావు గారు ఆంగ్లము, ఉర్దూ, సంస్కృతాంధ్రములు చక్కగా అలవరచుకొన్న బుద్ధిశాలురు. అనేక గ్రంథములను పరికిం

చినవారు. లోకానుభవమును సంపాదించినవారు. కావునవారు భద్రాచల క్షేత్రమును గూర్చిన చారిత్రిక మతవిషయికాంశములను ఎంతో శ్రమపడి సంపాదించుటయేకాక, విషయములను సవిమర్శముగ విభజించి, పాఠకులకు విజ్ఞానానందములు రెండును లభించు పద్ధతిపై అంశములను వ్యక్తీకరించినారు. రామచంద్రరావుగారికి శ్రీరాముని సేవయందు గల ఉత్సాహము అపారము. ఆ ఉత్సాహమే వారి భాషకొక ఉదాత్తత, అనర్గళధోరణిని కల్పించిన వని నా నమ్మకము. భావ భాషా ప్రాశస్త్యములతో నొప్పుచున్న ఈగ్రంథమును భక్తులును, చారిత్రకులును, స్వరాష్ట్రాభిమానముగల ఆంధ్రులందరును కూడ చదివి ఆనందింపగలరని నా దృఢవిశ్వాసము. శ్రీరాముడే మన కెల్లరకును ఆదర్శము. ఆయనకు జేజేలు అర్పింతము.

హనుమకొండ, ఓరుగల్లు,
31–12–1956.

ఖండవల్లి బాలేందుశేఖరం,
(ఆంగ్లోపన్యాసకుడు, ఓరుగల్లు కళాశాల)

పీఠిక

శ్రీ భద్రాచలమున కైదారు యోజనములలో (బయన్న గూడెం, ఖమ్మంమెట్టుజిల్లా) నివసించుచుండియు ముప్పదేండ్ల వఱకు శ్రీరామదర్శనమే తనివిదీరఁ జేయఁజాలకుంటిని. కీడులో మేలన్నట్లు నైజాము ప్రభుత్వపు తుదిగడియలలో జరిగిన యలజడులలో ప్రవాస మొనరింపవలసి వచ్చిన నాకు, నిచ్చటికి రాగలుగుటయు, నిరంతర శ్రీరామసేవాభాగ్యము క్రీ॥ శ॥ 1950 సంవత్సరపు తొలినాటినుండి లభించుటయు నా జీవితాఖ్యాయికలోని మధురాతిమధుర ఘట్టము. విశేషించి పూజ్యశ్రీ విశ్వనాథవారి యాశీస్సులంది నా స్తోత్ర రామాయణముఁగూడ నప్పుడే వెలువడుటయు, మఱువఁ జాలను.

తొలుదొల్త నేనిచ్చటి యధికారపత్రమును గొని ప్రవేశించునప్పటికి గోదావరి యొడ్డున బూర్గుంపాడు గ్రామమున నే కల్యాణరాముని సేవించి మరలుచున్న నొకానొక భక్తకవిని సందర్శింపఁ గలిగితిని. వారప్పుడు నే నతిథిగాయుండిన గృహస్థు నింటనే శ్రీరామ స్తవమును జేయుచుండిరి. నే వినిన తొలి పద్య మిచట నుదాహరింపక తప్పదు —

మ॥ అలముకోటికి నీదుదర్శనముఁ జేయన్వత్తు నేటేట యం
చలనాఁ డేను ప్రతిజ్ఞఁ జేసితిని, రానైతిన్ నిజాంరాజ్యమం

దలి గస్గోల్పిని, యంతమాత్ర మది కీతబ్బిబ్బుఁగల్గించి నా తలదిమ్మున్వదలింప పుస్తకముఁ జేఁదప్పింతె? రామప్రభూ!

ఇది విని దిగ్భ్రాంతుఁడనై వారి పరిచయభాగ్యము నందఁ గోరితిని. తణుకుతాలూకా కేలంగి గ్రామ నివాసులు శ్రీ తంగిరాల జగన్నాథశాస్త్రిగారుగా నెఱింగించి, నాయుదంతము తెలిసికొనిరి. ఉభయులము సగోత్రీయులమే (శ్రీవత్స)! నేను వినిన పద్య సందర్భము సవిస్తరము దెల్పఁగోరఁగా లభించినంతవఱకు రామాయణముల్లెల్లఁ బరిశీలించి "శ్రీ జగన్నాథరామాయణ" మను పేర కావ్యరచన సాగించుచు నేటేట గృతిపతి శ్రీ భద్రాచలరామునకు వినిపించుచుంటి ననియు, గత సంవత్సరమున రాజాలమికి నొక చిత్రచర్య జరిగెననియు తెలుపుచు, వారొక బండిలో గ్రామాంతర మేగుచుండ నిద్రాముద్రితు లగుటయు, నేకైక వ్రాతప్రతి జారిపోవుటయు, గమ్యస్థానమున వివాహ వేదికవద్ద తమ సంచి వెదకికొనఁగా నిదిమాత్రము లేకపోవుటయు, నంత భద్రగిరి రామునిపై తైలధారావిచ్ఛిన్నంబుగఁ బద్యధార నొలికింప సంకల్పించుటయు, శ్రీరామ కృపచేఁ దుదకొకనాఁ డొక యాగంతుకునివలన కావ్యము పునఃప్రాప్తమగుటయు లోనుగాగల విషయములను కర్ణానందముగ గాన మొనర్చిరి. తమ ప్రయాణమును మానుకొని మరల నా వెంటవచ్చి శ్రీ భద్రగిరి రాముని దర్శింపఁజేసిరి. నేటివఱకును నామైత్రి వర్ధిల్లుచు కావ్యశ్రవణము జరుగుచునే యున్నది. పాఠకలోక

మున కొక సంపుట మందినది. ఇంక నిట్లే మేధావు లెందఱి తోడనో నా కీచట మైత్రి సంఘటిల్లుచున్నది.

నే నీ యాలయ కార్యనిర్వాహకునిగా నియమింపఁబడి నప్పటినుండియు, నిచ్చటి క్షేత్రమాహాత్మ్యము స్థానిక చారిత్రిక విషయములు సమగ్రముగ లభింపకపోవుటచేఁ దగినంత కృషిఁజేసి క్షేత్రచారిత్రక ప్రాముఖ్యతల నాంధ్రలోకమున వ్యాప్తినందించవలెనని యుబలాటపడి పరిశీలింప నారంభించితిని. ఎట్టకేల కిప్పటికిట్లు పూర్తియైనది. ఎంతవఱకు కృతార్థుఁడ నైతినో పాఠకులే నిర్ణయింపవలయును. దాశరథీ శతకమును విడువఁజాలక యనుకరింపఁబూని 'దాశరథీ దయానిధీ' యను మకుటముతో పద్యరూపమున నిది వెలువరింపఁ దలంచి 40 పద్యములు వ్రాసితిని. కాని, యది సరిపడదని తోచి కిట్లు గద్యాత్మకమే యొనర్చితిని —

హైదరాబాదులోని యాంధ్రపత్రికా ప్రత్యేక విలేఖరి శ్రీ పి. వేంకటరామశర్మగా రిచ్చటకు విచ్చేసినప్పుడు నా యీ వ్రాతప్రతిని చదివి మిక్కిలి సంతోషించి నా యందెంతయో నవ్యాజమైన యాదరమును గనుపరచుటయేగాక, దీని నాంధ్రపత్రికకుం బంపఁగా వారును 28–9–56 తేదీ నుండి ప్రతి ఆదివారమున తమ పత్రికలో ప్రచురించిరి. శ్రీ శర్మగారికిని ఆంధ్రపత్రికాధిపతులకును నా హృదయపూర్వకాభివందనములు—నాకిందుఁ దోడ్పడిన గ్రంథములు–

1. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము — ప్రథమ సంపుటము.
2. కృష్ణాజిల్లా మాన్యుయల్ — (ప్రతి నొసంగినవారు— శ్రీ యీచంపాటి అప్పలాచార్యులువారు, మైలవరం)
3. దాశరథీశతకము — కంచర్ల గోపన్న (రామదాసు)
4. భద్రగిరి మాహాత్మ్యము. (భల్లాపేరయ్యకవి)
5. శ్రీరామాభిషేకము. (వెంకటరామకవి—అముద్రితము. మా జనకపాదులు శ్రీ నారాయణరావుగారిచే సంపాదితము.)
6. శ్రీ తూము నరసింహదాసు చరిత్రము. (తూము సీతారామకవి కృతము)
7. భద్రాచల రామచంద్ర మహాత్మ్యము (శ్రీ తూము సీతారామయ్యగారు)
8. శ్రీభద్రాచల క్షేత్ర మహాత్మ్యము (బ్రహ్మాండ పురాణాంతర్గతము— శ్రీ రామావఝ్ఝుల రామశాస్త్రిగారిచే సంకలితము.)
9. భద్రాచల రామదాసు చరిత్రము—పాత్రప్రతి (సింగరదాసు)
10. సనదులు హుకుములు మొదలైనవి. శ్రీరామాలయూర్చకస్వాములు నాకుఁ గనుపరచినవి.
11. శాసనస్తంభములు (భద్రుని కోవెల ఎదుట)
12. వరదరామదాసుగారి హుకుము — చూపించినవారు, శ్రీ అ. రామచంద్రాచార్యులుగారు.

ఈ విధముగ వ్రాయబడిన యేతద్గ్రంథకర్తలకున్ను ప్రచురణకర్తలకున్ను భద్రాచల శ్రీరామాలయార్చకసంఘము నకును మిక్కిలి కృతజ్ఞుఁడను.

పత్రికాముఖమున దీని జదివినంతమాత్రమున మైత్రి పురస్కరించుకొని యీ నా చిన్ని పొత్తమును ముద్రించి పాఠకలోకమున కందింతునని నాతో ముఖపరిచయమైన లేకున్నను 'విశ్వసాహిత్యమాల' వ్యవస్థాపకులు శ్రీ మహీధర జగన్మోహనరావుగారు నాకు వ్రాసి యెంతయో శ్రద్ధ వహించి యచిరకాలమున దీని వెలువరించిరి. వారి కెట్లు కృతజ్ఞత తెల్పవలయునో నాకే తెలియకున్నది. భద్రగిరి శ్రీ సీతారాముల కృపాకటాక్షము నిరంతరము వారియం దుండుగాతమని ప్రార్థింతును.

ఈ కావ్యకన్యకు పరిచయముం గూర్చిన శ్రీ ఖండవల్లి వారికి, ఆశీస్సు లొసగిన పూజ్యపాదులకును ప్రణామములు. సహృదయు లిందలి విషయములపై గమనార్హములగు సూచనలం దెల్పిన పునర్ముద్రణమున సవరించుకొందును.

భద్రాచలం,
5—1—1957.

ఇట్లు,
భాగవత శ్రీపాద పరమాణువు,
కొండపల్లి రామచంద్రరావు.

ఇష్టదైవ ప్రార్థనము

"వామాంకస్థిత జానకీ పరిలసత్ కోదండదండాం కరే
చక్రం చోర్ధ్వకరేణ బాహుయుగళే శంఖం శరం దక్షిణే
బిభ్రాణం జలజాతపత్రనయనం భద్రాద్రిమూర్ధ్నిస్థితం
కేయూరాది విభూషితం రఘుపతిం" సౌమిత్రియుక్తం భజే॥

(ఆదిశంకరులు)

"శ్రీరఘురామ! చారుతులశీదళదామ! శమక్షమాది శృం
గారగుణాభిరామ! త్రిజగన్నుతశౌర్య రమాలలామ! దు
ర్వారకబంధరాక్షసవిరామ! జగజ్జనకల్మషార్ణవో
త్తారకనామ! భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!"

(రామదాసు)

ఎలమిన్ నన్ను విరోధివత్సర వైకుంఠైకాదశీవేళ ను
జ్వాల సాలంకృత వైనతేయ విపులస్కంధోన్నతారూఢ ని
స్తులశోభాపరిణాహముం గనుపటించుం బిల్చుకొన్నావు, నీ
కలముం జేతికొసంగినావు, కరుణా కాకుత్స్థ ! రామప్రభో !

ధరణిని భద్రము బ్రోచుటయు దమ్మక నేలుట రామదాసు సు
స్థిరతర సద్యశోవిభవశీలు నొనర్చుట తూము నారసిం
హు రుచిరసేవ లందికొని యొప్పుగ లీనమొనర్చుకొంట నీ
పరమకృపానుభూతులను బల్కెద నీకృపచేత రాఘవా !

ప్రీతి ముకుందమాలయును శ్రీనరసింహ కరావలంబ వి
ఖ్యాత నుతిం దెనుంగున జగత్ప్రథితంబగు సత్యసువ్రత
స్ఫీతకథాళి గృష్ణనుతి వెండియు స్తోత్రమునైన నీకథఁ
జేతుల నందికొంటి విక జేకొను మియ్యది జానకీపతీ !...

"మ్రొక్కిన నీకు మ్రొక్కవలె మోక్ష మొసంగిన నీవు యీవలెన్
దక్కినమాట లేమిటికి దాశరథీ! కరుణాపయోనిధీ!"

శ్రీభద్రాచలక్షేత్రచరిత్రము

పురాణ ప్రసిద్ధి

నవభారత రాజ్యలక్ష్మికి బంగారు నొడ్డాణం బగు నాంధ్రరాష్ట్రమునఁ దూర్పుగోదావరీమండల కుండలం బన నొప్పు నీ భద్రాచలము వేదకాలము నుండి నేటివరకు సకల పుణ్యముల కాలవాలమై, ముముక్షుజనసేవితంబై, ఐహికాముష్మికఫలప్రదంబై మహాక్షేత్ర మను ప్రశస్తిచే విరాజిల్లు చున్నది. తొలుత మనకీ విషయము బ్రహ్మాండపురాణమున గౌతమీమహాత్మ్యమునం దభివర్ణింపబడిన భద్రాద్రిక్షేత్ర మహాత్మ్యమువలన దెలియుచున్నది. కొద్దిలో జెప్పవలెనన్న పర్వతశ్రేష్ఠుండగు మేరువు మేరుదేవింగూడి (మేనక యని గ్రంథాంతరము) పుత్రార్థియై పరమేష్ఠి నుద్దేశించి యనేక వర్షసహస్రంబులు తపం బొనరించి కృతార్థుండై భద్రుడను పర్వతరాజంబును పుత్రునిగా బడసెను. భద్రుండును దండకారణ్యంబున గౌతమీ తీరమున నెలకొని యుండెను. శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణయుక్తుం డయి దండకలో సంచరించుచు నొకనాడు వాహ్యాళి బయలుదేరి యలసి

యచ్చోటికి వచ్చి, యించుక సేదదేఱ నాసీనుడయ్యెను. ఆగిరి ప్రస్తరసుఖస్పర్శచే ప్రభు డమందానందంబు నొంది,—

"భవిష్యసి మహాత్మా త్వం భక్తోఽసి గిరిరూపభృత్,"

మహాత్మా! అచలరూపభక్తుఁడవు గమ్మని యనుగ్రహించెను. నాటనుండి,—

"రామభద్ర పదాంకత్వాత్ భద్రాద్రి రితి విశ్రుతః."

"రామభద్ర పదచిహ్నితుం డగుటజేసి భద్రాచలమను ఖ్యాతి నొందెను. భద్రుడును ననేకవేల సంవత్సరంబు లుత్సహించి తప మాచరింప శ్రీరాముఁడు ప్రత్యక్షంబగుటయుఁ బ్రణమిల్లి కీర్తించి, దర్శించువారలకు భుక్తి ముక్తి ప్రదుండై తనపై శాశ్వతముగ నెలకొని యుండుటయే తన యభీష్టముగ నెఱింగించెను. జగత్పితయుఁ బ్రీతుండై,—

"వసామి శిఖరే భద్ర! తవ యావద్ధరిష్యతి
భూమి ర్భూతాని కల్పాంతే మత్సాయుజ్య మవాప్స్యసి."

"కల్పాంతమువఱకిట నధివసింపగలను. అనంతరమున నాలో నైక్యమగుదు"వని యానతిచ్చెను. తదాది భద్రాద్రి సర్వలోకపూజితం బయ్యెను.

"సంప్రాప్య రామనవమీం తులసీదళాద్యైః
సంపూజ్య భద్రగిరి వాసిన మాదిదేవం,
కృత్వోపవాస మథ జాగరణం చ కృత్వా
సాక్షాత్పరం రఘుపతేః పరమం ప్రయాతి."

అని యుండుటంజేసి, విశేషించి శ్రీరామనవమినాటి

కల్యాణోత్సవము బహుసహస్రాధిక సంఖ్యాక మగు భక్తతతి కత్యంత సేవ్యంబై వెలయుచున్నది.

స్థలమా, భద్రుడు వేలకొలది వర్షంబులు తపం బొనరించుటచే పవిత్రీకృతమైనది. జలమా, మహర్షియగు గౌతమునిచే పుట్టుక కలిగి గంగయను నామాంతరమున భాసిల్లు గోదావరీ పవిత్రోదకము. దైవమా, కరుణాలవాలమగు శ్రీసీతారామచంద్రమూర్తి. ఇట్లు పావనత్వమున ముమ్మడియగు నిమ్మహాక్షేత్ర మాచంద్రార్కము భక్తజన సేవ్యమగుటలో సందియ మెక్కడిది ? పురాణప్రసిద్ధి బడసిన నీ క్షేత్రదైవతములను జనసామాన్యమున కందజేసినది శ్రీ రామదాసుగారు. కనుక భద్రాచలక్షేత్ర చరిత్రము రామదాస చరిత్రముతోడనే ప్రారంభ మగుచున్నది.

మార్గ సౌకర్యములు

ప్రథమమున భద్రాచలము జేరగల మార్గములం దెలుపవలసి యున్నది. రాజమహేంద్రవరమునుండి వర్షకాల మారు నెలలు నదీమార్గమున రాకపోకలు జరుగును. ఎత్తైన కొండల నడుమ ప్రవహించు నదీయానమున ప్రకృతి సౌందర్య మాకర్షణీయముగ నుండును. చేరుటకు రెండుదినములు, వెళ్లుటకొక దినము పట్టును. ఇదిగాక విజయవాడనుండి హైదరాబాదునకు బోవు రైలుమార్గమున నొకజాము ప్రయాణమున

వోర్నకల్ 'జంక్షను' జేరి యచటనుండి బండిమారి భద్రా చలం రోడ్ (కొత్తగూడెం) యొకజాములో రావచ్చును. వెంటనే "గోమ్మూర్ఘు" అనబడు గోదావరీ తీర మొక గంటలో మోటారుపై వచ్చి, పడవ లేక లాంచివల్ల నదిం దాటి, యావలి యొడ్డునం గల భద్రాచలముం బ్రవేశింప వచ్చును. ఇంకను విజయవాడ, ఏలూరు, వరంగల్లు, ఖమ్మం మెట్టు, ఇల్లందు మొదలగు పట్టణములనుండి కొత్తగూడెము వరకు రోడ్డుమార్గములు, మోటారు సౌకర్యములు కలవు. ఎన్ని యున్నను సరాసరి రైలుమార్గము లేక పోవుటంజేసి "ఏజన్సీ" అని వ్యవహరింపబడు నీ పర్వత ప్రాంతమున రాచ నగరుగా వెలయుచున్న భద్రాచలమునకు ప్రయాణ మొక ప్రయాసతో గూడినదే యగుచున్నది.

నలువ దేండ్లకు పూర్వ మీ ప్రయాణము మిక్కుల నానందకరముగ నుండెడిది. దేశదేశములనుండి ప్రజలు శ్రీరామచంద్రమూర్తిని కల్యాణోత్సవమున దర్శించుటయే తమ జీవిత పరమావధిగా దలంచి తండోప తండములుగ రైళ్ళలో విజయవాడనుంచి, సింగరేణి (ఇల్లందు) వఱకుం గల 'స్టేషను' లలో వీలైన చోటులం దిగి, కాలినడకను, రెండెద్దుల బండ్లపైనను, పయనించుచు వచ్చెడివారు. ఈ మార్గములం దెల్ల మైలు మైలుకు చలివేంద్రలు, ఐదారు మైళ్ళ లోగానే యన్న సత్రములు ద్రవ్యవంతులగు మహా దాతలచే తగినంత ముందుగా నెలకొల్పబడి, సమర్థులును

సేవాకాముకులు నగు భక్తవరులచే నడుపబడు చుండెడివి. ఆయా గ్రామీణులు తామెల్లరు సీతాకల్యాణమున జనక మహారాజు పక్షమువారమనియు యాత్రికులెల్లరు శ్రీ దశరథ మహారాజు పక్షమువారనియు భావించుకొని సంతోషసము ద్రమున నోలలాడుచు దమశక్తికొలందిగ నున్నతస్థాయిలో గ్రామమువెలుపల నెదుర్కొని, సకలోపచారములు జరిపి, తోడ్కొనివచ్చి సత్రమున మజ్జనభోజనాదులచే సంతుష్టులం గావించి, సీమాంతమునకు సాగనంపుచుండెడివారు. ఈ విధ ముగ శ్రీ సీతారామకల్యాణోత్సవమున భద్రాచల మెంత సేత్రపర్వముగ నుండెడిదియో అంత కినుమడిగ దేశమెల్ల జనసామాన్యమున నానందము పరివ్యాప్తమై యుండెడిది. యాత్రికసంచారములు సద్దుమణగగనే గ్రామీణు లెల్లఱును భాగవతసేవారాధనవిశేష మీ వర్షమున నేటితో పూర్తి యైనదనియు, నిట్టి రామదాసభజనకీర్తనల శ్రవణానందముగ విను భాగ్యము, భజనసమాజములలో దాత్కాలికముగ జేరి నామస్మరణ మొనర్చు నదవకాశము, ఎండగొట్టుబడి వచ్చు స్త్రీ బాల వృద్ధ యోగిజనులకు నన్నపానాదులచే దత్కాల సంతృప్తి సేకూర్చి సేవించు పుణ్యములు మఱలనొక సంవత్స రమునకు గదా యని తలపోసికొనుచు, నొకనెల దినము లిట్టి కథలచే బ్రొద్దుపుచ్చుకొను చుండెడివారు. దీనివలనఁ బ్రజలలో నైతికాభివృద్ధి, మానవ సేవాభిలాష, ధర్మరంజకత్వము, త్యాగబుద్ధి, స్త్రీ బాలురలో గూడ వర్ణైకవృద్ధిగ బ్రవర్ధ

మానము లయ్యెడివి. పలుచోట్ల బీదప్రజల కనాయాసముగ హరికథా కాలక్షేపములు, పురాణశ్రవణములు సందర్భము లగుటంబట్టి, విద్యావివేకములు లభించినవని సంతోషించెడి వారు. యాత్రికులును జేబుఖర్చు తగులకయే పక్షముదినము లత్యుత్సాహమున యాత్ర జరుపుకొని, గ్రామీణులతో నూతన పరిచయభాగ్యము కలుగుట మఱచెడివారు కారు. ఈ విధముగ ప్రతివర్షమున దోలిపక్షము ఆంధ్ర దేశ వాసు లెల్లరకు సంతోషదాయకముగ గడచుచుండెడిది. నేటి కాలపు సులభప్రయాణమున వేగముగ వచ్చుటయు బోవు టయు సంభవములగుచున్నవి. కాని వ్యయప్రయాస లధికమై నానాటికి నైతికస్థితి, మానవసేవాభిలాష వెనుకబడుచున్నవో యని ప్రాజ్ఞులకు సందియ మొదవకపోదు.

భద్రుడు

తపోయోగసిద్ధులచే దమ శరీరములు శిలామయము లుగా జేసికొని, శీతాతప క్రూరాసుర బాధల కతీతులుగ నెగడు మహాజీవులే సుప్రసిద్ధములగు కొన్ని పర్వతరాజము లందురు. దేవలోకమునకు జెందిన కైలాస, మేరు, మందర ములు, మానవలోకమున దేవాయతనముల కాలవాలము లైన శ్రీశైల, వేంకటాచల, వేదాచల, సింహాచల, భద్రా చలాదు లిట్టివే. మేరుసుతుం డగు భద్రుండు, గౌతమీతీర

మున ననేకవేల వర్షంబులు దపం బొనరింపఁ శ్రీరాముడు ప్రత్యక్షమై వర మనుగ్రహింప దలచుటయు, దర్శనమాత్ర మున సకలజీవులు మోక్షసామ్రాజ్యము ననుభవింపగల విశేషము కలుగునట్లు శ్రీ సీతాలక్ష్మణసహితుడై తన శిఖరమున నెలకొనవలయునని భద్రుడు వేడుకొనుటయు, దేవు డను గ్రహించి తదీయవాంఛ నీడేర్చుటయు బురాణప్రసిద్ధము. శ్రీరామచంద్రమూర్తి వామాంకమున సీతను వహింపుచు పద్మాసనమున దాను వేంచేసియుండి, వామపార్శ్వమున లక్ష్మణుడు ధనుర్బాణములతో నిలిచియుండ, భద్రాచలమున నధివసించెను. తానిప్పుడు చతుర్భుజుడై వెలసెను. పై రెండు కరంబులందును శ్రీమన్నారాయణునివలె శంఖచక్రములఁ దాల్చెను. గాని విరోధుల, రాక్షసుల మట్టుపెట్టు పని గట్టు కెక్కినది. కనుక నిట్టులమగు ప్రేమతో భక్తుల కభయం బొసంగదలచి కాబోలు పరివర్తనముగా కుడిచేత శంఖమును, నెడమచేత జక్రమును నవధరించెను. రామచిహ్నములగు ధనుర్బాణములను దక్షిణ వామదక్షిణకరంబుల దాల్చెను. కనుక నే వైకుంఠరాముడని, రామనారాయణుఁడనియుఁ బొగ డొందెను. పరమాత్మ జీవాత్మలగు 'అ'కార 'మ'కార వాచ్యులు శ్రీరామలక్ష్మణులకు నడుమ 'ఉ'కార వాచ్య యగు శ్రీసీతామహాలక్ష్మి దృశ్యమాన యగుచుండుటచే, వేదముల తొలిమంత్రము 'ఓం'కార మీ మూర్తిత్రయమున విస్పష్టమగుచున్నది. కనుక నోంకార రాముడనియు కీర్తింప

బడును. ఈ మహాశృంగారమూర్తిని, కరుణారసము వెదజల్లు దేవదేవుని, రామదాసుగారు 'దాశరథి' యని వ్యవహరించి, దాశరథీశతక రచనచే భక్తిప్రవాహమున బాతకుల నోలలాడించి, రామునకు రెండవసాటి దైవమిక లేడని చాటినాడన్న నేతన్మాహాత్మ్యమును వివరించుట సామాన్యుల కలవిగాదు. కుడివైపుగ లక్ష్మణుడుగల శ్రీరాముడు, భోగమోక్షకరుండను శాస్త్రమర్యాద ననుసరించి, ఉత్సవమూర్తులందు సీతాలక్ష్మణు లిరువురు రాముని కిరువైపుల గలరు. ఇట్లున్నని దేవాదిదేవులు మానవులవలన గుర్తింపబడక దండకారణ్యమున దేవఋషిగణములచే ననేకవేల వర్షము లారాధింపబడిరి.

"స్నాత్వా ప్రాతస్సుబోధే దినకరదివసే గౌతమస్యాఘనాశే
ధ్యాత్వా సీతాసమేతం రఘుపతితిలకం భద్రమద్రిం ప్రణమ్య
గత్వా సంపూజ్య రామం గిరివరశిఖరే సీతయా సన్నివిష్టః
భుక్త్వా భోగానభీష్టా నమరవరసుఖం ముక్తి మంతే ప్రయాతి."

అని చెప్పబడుటచే గిరిప్రదక్షిణ మాదివారమున నాచరించుట ఫలప్రదముగ నెన్నబడుచున్నది.

శివస్వరూపులగు నాదిశంకరులు తమ శ్రీరామ కర్ణామృతమున భద్రగిరీశ్వరుని యథాస్వరూపముగ "వామాంకస్థిత జానకీపరిలసత్" అను శ్లోకముచే సన్నుతించుటం జేసి వారిచ్చటికి విజయంచేసి రని భావింపవచ్చును. ఈ శ్లోకమే నిత్య మిచ్చట ననుసంధింపబడుచున్నది.

శ్రీ త్యాగరాజస్వామి తమ కీర్తనలలో 'గిరిపై నెల కొన్న' 'ఎన్నగాను రామభజన' 'క్షీరసాగరశయనా' అను వాటిలో రామదాసుగారిని పేర్కొనిరి.

పోకల దమ్మక్క

భద్రాచలమునకు సమీపమునగల భద్రిరెడ్డిపాలె మను పల్లెలో శబరికుల సంజాతయై పోకలవంశము ముయ్యేడు దరములఁ బరిపూత మొనరించి, ధన్యయై యొక సాధ్వి దమ్మక్క యుదయించెను. పుట్టినదిమొదలీమె రామనామ స్మరణధ్యాన పరాయణురాలు. తన ముదుసలి తనమున నెంతవేడినను రామదర్శనము గాకపోయెనను జింతచే గుంది వలవల యేడ్చు చుండగా నొకనాటిరాత్రి స్వప్నమున స్వామి సాక్షాత్కరించి, తనకు గొద్దిదూరముననే నుంటి ననియు, తాళ్ళద్రుమోపాంతమున వెదకిన గనుగొనవచ్చు ననియు, తనదర్శనసేవనముల గొన్నాళ్ళు తనివి జెందవచ్చు ననియు, అచిరకాలములో తగినవ్యక్తి తన సహాయమునకు రాగలడనియు నానతిచ్చి యదృశ్యుడయ్యెను. దమ్మక్క యుద యముననే లేచి, యూరివారికీ తీరెఱుంగ జెప్పిన, సంభ్రమ మున నందఱును గత్తులు, గొడ్డళ్లు మొదలగు పరికరము లతో దాడిచెట్టు సమీపారణ్యము బయలొనరించిరి. అప్పుడే యవతరించిరో యన్నట్లు పరిశుద్ధములగు శ్రీ సీతారామ చంద్ర లక్ష్మణదేవుల శిలామూర్తులు దృగ్గోచరము లయ్యెను.

అందరు నతిభక్తి జాగిలి మ్రొక్కి పందిరి నిర్మించిరి. తదాది యాతాడిచెట్టున బహుపండ్లనే అనుదినము నైవేద్యము నొసగి దమ్మక్క యర్చించెను. ఒకనాడీ విషయమును సరిగా గుర్తెఱుంగని తన బాలికను నైవేద్యము పెట్టమనిచెప్పి దమ్మక్క గ్రామాంతర మేగెను. పాలికునకువలె జావగాచుకొని యా కూతురు దేవదేవుని త్రాగుమని కోరెను. ప్రభువది యారగింపకుండుటం గాంచి శోకాతురయై యాబాలిక అమ్మజరిపిన విధము గనే పరిశుభ్రముగ జేసికొని తెచ్చితినే! నా యపరాధమేమని యేడ్చుచు కఠినశిలకు తన శిరస్సు మోదుకొన నారంభించెను. ఆమె మాధ్యమునకు జాలింగొని శ్రీ సీతారాములా జావ నారగించిరి. రిత్తకడవలతో నింటికి వచ్చిన కుమార్తెను జూచి మాత యిదేమని ప్రశ్నింప, బాలయు సవిస్తరము నుడివెను. దమ్మక్క పులకాంకితదేహయై కూతురును పున్నెముల పుట్టగా దీవించి, మరునాడు వెంబడించి, మాటునదాగి యంతయుం దిలకించెను. బాలికకువలె మాతకెన్నండును మఱలనట్టి దర్శనభాగ్యము లభింపలేదు. కొంతకాలము జరిగిన వెనుక నా పరగణా పరిపాలనమునకు క్రొత్తగా వచ్చిన యధికారి 'పాలవంచ' యను పురమునకు విజయముచేసి యున్నాడనియు, రైతులనుండి శిస్తుబకాయిలు వసూలు చేయుటలోనే కాక, అనుదినము రామనామ సంకీర్తనములు, భక్తజనులకు సంతర్పణములు జరుపుటలో నిమగ్నుడై యుండునని విని, దమ్మక్క తనకు స్వప్నమున దేవదేవు డానతిచ్చిన

"తగినవ్యక్తి" యితడే యగునని నిశ్చయించి ప్రాకలాడుచు నట కేగి యాతని సందర్శించి, తనయుదంత మాద్యంతమును నెఱింగించెను. సావధానముగ విని, యామె నాదరించి వచ్చి శ్రీరామచంద్రమహా ప్రభువును, దనయిష్టదైవమును, తొలిసారిగా దర్శించి సంతుష్టుడైన యీ మహావ్యక్తియే మన గోపన్నగారు. కొలదికాలమునకే దమ్మక్క కైవల్యము నొందెను. ఆమె పేరున నిప్పటికిని శ్రీరామాలయ పూజాదిక ములలో నొక భాగము 'పోకలవారివంతు' అని వ్యవహరింప బడుచు కొందఱర్చకులచే ననుభవింపబడుచున్నది.

కంచర్ల గోపన్న (రామదాసు)

గోపన్నగారి నెఱింగింప బూనుట చంద్రునిం జూప దీపం బెత్తుటయే యగును. యావదాంధ్ర దేశమున రామదాసు కీర్తనల విననివా రుండరు. దాశరథీశతకము ప్రతి బాల బాలికయు జదివింపబడుదురు. అందే 103 వ పద్యమున,—

ఉ. అల్లన లింగమంత్రిసుతు, డత్రిసగోత్రజు డాదిశాఖి కం
చెర్లకులోద్భవుండనఁ బ్రసిద్ధుడనై భవదంకితంబు గా
నెల్లకవుల్ నుతింప రచియించితి గోపకవీంద్రుడన్ జగ
ద్వల్లభ ! నీకు దాసుడను, దాశరథీ ! కరుణాపయోనిధీ !

అని తెలుపుటచే నాత్రేయగోత్రమున కంచెర్ల వంశో ద్భవుండగు లింగనమంత్రి కుదయించిన ప్రథమశాఖ బ్రాహ్మణుడని విదితము. తల్లి పేరు కామాంబయగుట నన్య

గ్రంథము లెక్కింపబడినది. "పట్టితి భట్టరార్య" యను పద్య మున గోపన్న తన దేవగురుభక్తి, వైష్ణవ మతావలంబ నము వెల్లడించినాడు. సామాన్యముగ ప్రభుత్వాధికారముల సంపాదించి, వ్యవహారస్థిరులగు బ్రాహ్మణులు "నియోగు" లనబడు చుండుటచే నీతని 'నియోగి' యనియు గొంద ఱనిరి. కాని రామదాసుగారి తదనంతరము తద్వంశీయులు గుంటూరు జిల్లా వినుకొండ ప్రాంతమున కేగి స్థిరపడి రని పెదమాళ్ళపల్లి గ్రామమున గలరని యందొకరిటకు వచ్చి నప్పుడు స్వయముగ జెప్పియుండిరి. వారు ప్రథమశాఖీ యుల మని చెప్పుటచే గోపన్నగారు వ్రాసిన ఆదిశాఖ యదియే యనుకొన వచ్చును.

ఖమ్మంమెట్టు జిల్లాలో నేలకొండపల్లి యనబడు గ్రామ మున గోపన్నగారు జన్మించిరి. అట నొకచోటిప్పుడు రామ దాసుగారి గృహమని జూపుదురు. తద్వంశీయు లెవరునూ లేరు. గోపన్నగారికి అక్కన్న మాదన్నగారలు మేనమా మలు. గోలకొండరాజ్యమును 17 వ శతాబ్దములో పాలించిన "అబుల్ హసనుషా" యను నవాబు "తానీషా" యను నామాంతరమున విఖ్యాతుడై, తన వద్ద మాదన్నగారిని ప్రధానమంత్రిగను, అక్కన్నగారిని సేనాపతిగను నియమిం చెను. అక్కన్న మాదన్న లిరువు రత్యధిక మేధోనిధులు, వ్యవహార నిపుణులు, వాక్యచతురులు, ధైర్యసాహసములలో నప్రతిహత వీరులు. ఇరువు రైకమత్యముగ గోలకొండ

రామదాసు.

తానీషా.

STATE CENTRAL LIBRARY HYDERABAD. A.P.

STATE CENTRAL LIBRARY HYDERABAD. A.P.

రాజ్యమును తానీషాచే నిరుపద్రవముగ బాలింపజేసిరి. ఆ కాలమున జిల్లాలు, తాలూకాలు నేర్పడలేదు. రాజ్య మెల్ల గొన్ని సర్కారులుగను, సర్కారులు పరగణాలు గను, పరగణాలు పట్టీలు గను, విభజింపబడి యొక్కొక్క ప్రాంత మొక్కొక్కరి యధీనమం దుంచబడెను. ఖమ్మం మెట్టు సర్కారులోని "హసనాబాదు" పరగణాకు గోపన్న గారు బాధ్యతగల యుద్యోగిగ నియమింపబడెను. ఈ పర గణాయే పాలవంచ యను పేరున తరువాత ప్రఖ్యాతం బగు టం బట్టి, యిందు భద్రాచల ప్రాంతము కూడ చేరి యుం డుటం జేసి, లోకమున రామదాసు పాలవంచ తహశీల్దారని, భద్రాచలము దహశీల్దారనియు జెప్పసాగిరి. 1883 సం॥ న వెలువడిన '*Krishna District Mannual*' లో కృష్ణాజిల్లా చరిత్ర కారుడగు నాంగ్లేయుడు, గోపన్న గారు మాదన్న గారి మేనల్లు డనియు, ఖమ్మంమెట్టు పేష్కా రనియు వ్రాసెను. ఎట్లయినను భద్రాచల ప్రాంతమునకు ప్రధానాధికారిగా గోపన్న విచ్చేసెననుట నిర్వివాదాంశము.

దమ్మక్క పిలుపు నందుకొని గోపన్న భద్రాచలము నకు విచ్చేసి, శ్రీ రామచంద్రప్రభు దర్శనమున దన్మయుండై యమ్మోహనీయ మంజుల మంగళమూర్తిని విడువజాలక తన పాలవంచ మకామును మార్చి భద్రాచలముననే నిలువ సంక ల్పించెను. పరగణా వ్యవహారము లెల్ల జక్క దిద్దుచు, నంత వఱ కెవ్వరును దమ్మడుగక బకాయీలు పెట్టిన రైతుల వద్ద

నుండి శిస్తులు సామరస్యముగ వసూలు పఱచుచు, సకల లోకాధీశ్వరుండగు రామప్రభు మాహాత్మ్య మెల్లఱకుం దెలుపుచు, దేవదేవునకు నిత్యసేవ లొనరించుచు, నిరతాన్నదానమున బ్రజల సంతుష్టులం జేయుచు, "శ్రీరామ నామం మరువాం మరువాం, సిద్ధమూ యమునికి వెఱువాం వెఱువాం" మొదలగు సంకీర్తనములచే భక్తిప్రబోధము గావించి పరమ ధార్మికజీవనము గడుపుచుండెను.

ఇట్లుండ నొకనాడు భాగవతోత్తములు బంతులుదీరి సాపడుచుండ బ్రమాదవశమున తన యేకైక కుమారుడు వేడి గంజిగుంటలో బడి యాసన్నమరణుడగుట తల్లియగు కమలాంబ కనుగొనెను. నిస్సహాయయై యేమియుం జేయజాలక భోజనకార్యమున కడ్డుతగులునని దుఃఖ మెల్ల మ్రింగి భర్తతో జెప్పక మిన్నకుండెను. అతిథిసంతర్పణానంతరము కృతకృత్యుడై యున్న గోపన్న కీ దుస్సంఘటన నెఱింగించి దుఃఖించెను. భాగవత శిఖామణి యగు గోపన్నకు మిన్ను విఱిగి మీద బడినట్లయి, ఖిన్నత నేమియుం దోపనీక కంఠగత ప్రాణుడగు పాపను దన భుజమ్ములం దిడికొని రామసాన్నిధ్యమునకు దెచ్చిపడవైచి, "దేవా! పుత్రశోక మత్యంతదుస్సహమగుట నీ యెఱుంగనిది కాదు కదా? దశరథు నంతవానికి నీ యెడబాటే కదా మరణకారణ మయ్యెను. మున్ను సాకేతమున విప్రకుమారుని బ్రతికించి తలిదండ్రుల నానందింప జేయువఱకు నిదురమైన బోయితివో? ఇంత కరుణామయున కీ

దాసునిపై నేల యనుగ్రహము కలుగకున్నది?" యని పలు విధముల బ్రార్థించి "కోదండరామ కోదండరామ" యను కీర్తనలో "ఏ బుద్ధి నీకు నెఱుగనివాడు, పాపము నీకు బడలి యున్నాడు, పాపను లేపి బాధలు మాన్పి, యాపద బాపి, యట్టు ప్రీతిజూపి," యనియును, "నమ్మినచిన్నవా డెందున్న మమ్మేలగన్న మాయన్న, యన్న! రావయ్య – నీని రక్షించు గాని, సేవ జేసెద నీదు సుతుడగుదు గాని" యనియును వాపోయి సతీపతులు మూర్ఛితులైరి. స్వామి కటాక్షించెను. నిదురించు బాలుడు మేల్కాన్నట్లు పుత్రుడు పునర్జీవితు డయ్యెను.

గోపన్న యానందాశ్రువులు రాల్చుచు, తన యిల వేల్పగు శ్రీరఘురాముని కృపచే చిన్నబాలుడు 'రఘురాముడు' జీవించుట మహాభాగ్య మని భావించి నాటినుండి ప్రభువున కెట్టి కైంకర్యము జేయబోలుదునా యని యోజింప సాగెను. రామునికి దగు నాలయములేదు. వస్తువాహనములు లేవు. అలంకారములు లేవు. మహా భోగోత్సవములు లేవు. వేయేల, అచట నచట చిన్నదేవళములను గల వృత్తులు గూడ నిచటలేవు. మహాదండకారణ్యమున భయంకర మృగములు దిరుగు నిచ్చోటు, నాగరికత బొత్తుగా ప్రబలని యీ ప్రదేశమున నేనొకడను, రిక్తహస్తుడను, నావల్ల నేమికాగల దని విచారించెను. సాధన మార్గము లాలోచింపదొడగెను. తనకొక యధికారబలమే కలదు. రామానుగ్రహ మూతగా

గాని, దాని వెచ్చించి సాధింప దలపోసెను. గ్రామీణులను
భక్తజనులను పలువురను సమావేశపరచి, తన వృత్తాంతము
ను విస్మయకరమైన వారితో నాలయ నిర్మాణాది ప్రశంసల
ఁజర్చింప, వారును మృదుమధుర స్వభావుం డగు నతని
యాదేశమునకు మారు జెప్పనోల్లక తమ తమ యంగీకార
ములం దెల్పి ధనసహాయ మొనరింతుమని ప్రోత్సాహపరచిరి.
తన కార్యమంతయు నెరవేఱినట్లుగనే భావించి, వారి బాసల
నమ్మి, గోపన్న ఆలయ మంటప ప్రాకారనిర్మాణ ప్రారంభ
మయ్యెను. తొలుదొల్తనే ధనాభావము పొడసూపినందున
కాలక్రమమున ప్రభుత్వమువారొత్తిడిసేయువరకు సరిపెట్టలేక
పోవుదునా యని యీ మహానుభావుడు సర్కారు పైకముపై
జేయివైచెను. అనేక విధములగు భోగవిలాస వ్యయము
లంగీకరించు తానీషాప్రభుపు ధర్మమతి యగుటచే తనకు
శాశ్వతకీర్తికరం బగు నీకార్యమున కంగీకరింపడా యనియు,
యంతకు మించి దనయేలిక శ్రీరాముడు లేడా యనియు
విచారించి, యతి త్వరితముగ బొక్కసములోగల రొక్క
మంతయు వెచ్చించి శ్రీ సీతారామచంద్ర మహాప్రభుపు వారి
యాలయ నిర్మాణ మొనరించెను. "ఎంతో మహానుభావు
డవు" "నీవు ఎంతో చక్కని దేవుడవు" అను కీర్తనలలోను
"తక్కువేమి మనకూ రాముం డొక్క డుండువరకు" అను
దానిలోను దన మనోనిశ్చయము వ్యక్తీకరించుచు, దశావ
తారాది వర్ణనలచే రాముని యందు దన విశ్వాసమును వెలి

బుచ్చెను. ఈ ఆలయ నిర్మాణమున రామునికొక గట్టి కట్ట డమే నిలుపదలచెను. గాని గోపన్న కీర్తిప్రతిష్టల నాసించి అనవసర శిల్ప వ్యయాదులకు వశుడు కాలేదనుట దర్శించిన వారికి స్పష్టమగును. భక్తులనెల్ల ప్రోత్సహించి అన్న పానా దులచే సంతృప్తి పరచి కార్యసాధకు డగుచు, వేయబడిన ప్రతిరాయియు రామనామము ప్రతిధ్వనింప భక్తిప్రేరితులై శ్రామికు లొనరించిన ఆలయనిర్మాణమే మనము కనుగొం దుము. కాని శిల్పాచార్యకళావైశిష్ట్యము నిందెందును గాన రావు. ఈ యరణ్య మెల్ల బాగుచేయించి, గుట్ట మిట్టల జదును చేయించి, వాస్తుశాస్త్రానుసరణముగ వాసయోగ్య ముగ పురగోపురాలయనిర్మాణములఁ జేయించెను. తగు మాత్రముగ గరుడ హనుమంత శేష వాహనములు, ముఖ కల్యాణాధ్యయన మంటపములు, రెండు గోపుర ప్రాకార ములు నిర్మించెను. చింతాకుపతకము, పచ్చలపతకము, కలికితురాయి, బిళ్ళల మొలత్రాడు, గజ్జెలందెలు, రవ్వల కుండలములుగల నీలాల చెవిపోగులు, నీలాల ముత్యాల చెవి పోగులు, చిన్న కిరీటములు, గొలుసు, మంగళసూత్రములు, కొప్పుజడ లాదిగాగల కొన్ని యాభరణములు జేయించెను. దీనికై ప్రభుత్వ ద్రవ్యము వ్యయమయ్యెను. అప్పటికి పరిస్థి తులు గమనించి యిక ద్రవ్యసేకరణ జరుగజాలదని తోచి "ఏ తీరున నను దయచూచెదవో యినవంశోత్తమ రామా" యని సర్వము రాముని యధీనమని విన్నవించుకొనెను.

గోపన్నగారు జేయదలచిన దంతయు జేసిరి. నిత్యోత్సవ మాసోత్సవాద్యనే కోత్సవములు, త్రికాలభోగములు, చక్రవర్తి లాంఛనములతో గల్యాణ రథోత్సవము మొదలగు వైభవములు భద్రాచలమున లోకానందదాయకముగ జరుగుచు కలియుగవైకుంఠ మను పేరు బడసెను. కాని కాలపరిస్థితులు తారుమారయ్యెను. తానీషా కొలువున నక్కన్న, మాదన్నలకు వ్యతిరేక ప్రచారములు పొడసూపెను. మొగలు చక్రవర్తియగు ఔరంగజేబు గోలుకొండను కబళింప మాటిమాటికి నుద్యుక్తుడగు చుండెను. హిందూమహమ్మదీయుల సఖ్యత భేదింప దన యనుచరులతో బ్రయత్నములు సాగించెను. అక్కన్నమాదన్నలు విజయవాడకు వచ్చి కనకదుర్గాలయ సమీపమున ధర్మసత్రములు గట్టించి బీదల కన్నదానము లొనర్చుచు మొగలుల బారినుండి తప్పించుటకు తానీషాను కొండపల్లి దుర్గమున జేర్చుటకు బ్రయత్నించిరి. కాని యంతకుముందే గోలకొండలో జీలికలు బయలుదేరెను. మహమ్మదీయులు హిందువుల ద్వేషింపసాగిరి. ఇట్టి కల్లోలపు సుడిగుండములో గోపన్నగారు చిక్కవలసి వచ్చెను. ప్రభుత్వపు గూఢచారులు రామదాసుగారి యెడ విషప్రచార మొనరించి ఆలయనిర్మాణ మొకసాకుగా తానీషాను కంటగింపజేసి గోపన్నను బందీగా గొని తెచ్చుట కాజ్ఞాపత్రికను బంపునట్లు జేసిరి. అంతియేగాక కొంద రనుచరులు దౌష్ట్యమునకు వెన్నుదీయక ఖజానా దోపిడీచేయుటయు, బాకీదారులచే

శిస్తు లెగవేయించుటయు జరిపిరి. తానీషా యాజ్ఞాపత్రిక గోపన్నకు జేరువరకు నిట్టి సకలోపద్రవములచే సంభవించిన ఖజానాలోటు ఆరులక్ష లుండి గోపన్న దానికి బాధ్యుడుగా పరిగణింప బడెను. ఈ ఆలయనిర్మాణము ఆచంద్రార్కము దనకీర్తి వెలయింప గావింప బడెననియు, హుజూరువారు యేటా చేయు యధికవ్యయములో యిది యల్పముగ బరిగణింపబడ దగినదనియు, విశేషఫల మొసంగునదియనియు, దీని కంగీకరింపవలసినదనియు తొలుతనే గోపన్న దాఖలుచేసి కొనిన విన్నప మనాదరింపబడెను. రాజభటులు గోపన్నను బందీగా గొనిపోయిరి. పరిగణా ప్రభులెల్లరు మిక్కిలి యాక్రందించి, వెంటనంటి కొంతదవ్వేగి, తమ ప్రాణతుల్యుడగు గోపన్నగారికి రాజదర్బారులోను పట్టణములోను కొందఱి సహాయసంపత్తితో నీఋణ మీగవలయునని సలహాల నొసంగి క్రమ్మరిల్లిరి. కాని గోపన్నగారు కేవలమానవుల యాచించునో! బందియై వెళ్ళుచూ "నీ సంకల్పం బెటువంటిదో గననెంతవాడ రామ" యను కీర్తనలో, "తోచి తోచకను తోడరి కరంబుల జాచి పరుల నే యాచన సేయను" అని తన మనోనిశ్చయము వెల్లడించెను.

కారాగారమున బంధింపబడి "అన్యథా శరణం నాస్తి"యను శరణాగతి జేయుచు "పరమపురుష యే వెరవు లేక నీ మరుగుజొచ్చితిని యటమట జేయకు" "పాలముంచు నను నీళ్ళముంచు నీపాల బడితి నిక" యనియు "గరుడగమన

రారా” యను కీర్తనలో ముందే విన్నవించు కొనెను. రాముడు వెంటనే స్వప్నమున దర్శన మొసంగి దమ్మక్కకు జెప్పినట్లే తనకును పరిష్కార మార్గము సూచింపడా యని పాపమా గోపన్నయు భావించెను. గాని భక్తులను శాణమున బరీక్షించు జాణ శ్రీరాము డని యెరుంగడయ్యె. కనుకనే “ఏమిరా రామా” యను కీర్తనలో తన నేరము లున్న బయటబెట్టు మని సవాలు జేసెను. అంతేగాక, ‘రక్షింప విది యేమో’యను కీర్తనలో తనకు రామునుదప్ప మఱొక రక్షకు లెవరనియు, ‘కర్తవ్యం మహోదాశ్రయ’మ్మను నీతిననుసరించి “అధికునిచే పడితి” ననియు ‘భయముబాపి బ్రోవు’ మనియు పాడుకొనెను. అందుకు గరుణరాకున్న స్వామిని క్షమాభిక్ష వేడుకొనుచు, ‘నా తప్పులన్ని క్షమించుమిా’ యను కీర్తనలో కాయ తీగకు యెగ్గు గాదనియు, కడుపున బుట్టిన తనయుడు ఎంతో దుడుకుతనము జేసేటప్పుడు, కొడుకా రమ్మని చేకొను గాని నూతిలో పడ ద్రోయునో’ యనియు దేవదేవుని డెంద ములోని లోతులు పరీక్షించు నంతటి దైన్యముం గనబఱ చెను. రోజులు గడచుటయు, పాదుషా పరుషవాక్యము లాడు టయు జరుగుచుండెనే కాని బాకీ పరిష్కారమార్గము గోచ రింపదు. కలడో లేడో యని గజేంద్రుడు డాలపించినట్లు గోపన్నయు “ఏడ నున్నాడో”యను కీర్తనలో శ్రియఃపతిని వెదుకసాగెను; పరితపించెను.

దీక్షవహించి నాకొలది దీనుల నెందఱు గాచితో జగ
ద్రక్షక, మున్ను నా ద్రుపదరాజతనూజ తలంచినంతలో

యాక్షయమైన వల్వలిడితక్కట! నామొఱలాలకించి బ్ర
త్యక్షము గావదేమిటికి దాశరథీ! కరుణాపయోనిధీ!

యని మరిమరి వేడుకొనెను.

అప్పటికిని బాకీ పరిష్కారము కానందున రాజాజ్ఞ కఠినతర మయ్యెను. బందిఖానాలో గోపన్నను వీపువాయ గొట్ట నారంభించిరి. "ఎటుబోతివో రామా యెటుబోతివో" యను కీర్తనలో రాముని వెదుకుకొనుచు, 'అంధకారము వంటి బందికానాలో నున్న నిందల నెడ బాపవేల' యనియు 'తానీషాగారు వచ్చి తరితీర్పు చేసెదరు, పైకము పంపించి వేగ బందిఖానా వదలించ కెటు బోతివో' యనియు 'అప్పుల వారు వచ్చి అరికట్టుచున్నారు, ఒప్పుకోబడు నని చెప్పక దాగినావో' యనియు విలపించెను. బాధలకు తాళజాలక "అబ్బబ్బ దెబ్బలకు తాళలేర" యను కీర్తనచే వరహాలు, మొహరీలు నీ పరిచారకులకు బంచి పెట్టితిగాని, "పరుల కొక రువ్వ యియ్యలేదు గదర" యనెను. దీనినిబట్టి యాలయ నిర్మాణాదు లెంత పొదుపుగ సాగించినది తెల్ల మగుచున్నది. "రక్షించే దొరవని నమ్మితి"యను కీర్తనలో శ్రీవల్లభునిపై తన సంపూర్ణ విశ్వాసమును విదిత మొనర్చెను. "నన్ను శిక్షింప దప్పేమి జేసితి"నని ఖండితముగా నడిగెను. "రామా నీ దయ రాదుగా" యను దానిలో, నిను నే వర ములు భాగ్యము లడుగుట లేదని, "ఆకొన్నవాడనై యనవలసి యంటినిగాని, నీకే దయరాకున్న నేమిసేయువాడ" ననియు

దైన్యమున స్తుతించెను. రాజభటు లంతతో నాగక ఇనుప సీళ్ళతో బిగించి కొట్ట మొదలిడిరి. "అబ్బబ్బ దెబ్బలకు నోర్వలేర"యను కీర్తనలో "అట్టి నిను బూజించినట్టి చేతుల నిదిగో కిట్టి కట్టి కొట్టే రెట్లు తాళుదునయ్యా" యని మిక్కిలి వాపోయెను. "శరధి బంధించిన కార్యమేమాయెరా" యని హెచ్చరించెను. "ఇన్ని గలిగి మీరూరకున్న నే నెవరివాడ నౌదు" నను కీర్తనలో రాముడు కరుణించి తన్ను రక్షింప వలెనన్న నెన్ని సాధనసంపత్తులు కలవో వివరించుచు, శ్రీ మహాలక్ష్మి, కామధేనువు, కల్పతరువు, చింతామణి పరుసవేదుల నేకరువు పెట్టెను.

అతిక్రూరమగు రాజదండనము ననుభవించుచు, నెంత యార్తదశలో నున్నను రామనామ సంకీర్తనము గోపన్న మానలేదు. అతి క్లేశములగు తన యనుభవములను స్వామిని సన్నుతించుటలోనే సంపుటీకరణ మొనర్చి అట్టి సాహిత్య ముచే నప్పటి పరిస్థితులను నేటికిని మన మూహింపగలుగు మహోపకార మొనర్చెను. దాశరధీశతకమువలె రామదాసు కీర్తనలలోను స్వవిషయము నుద్ఘాటింపకున్నచో నింతమాత్రము చరిత్రాంశముకూడ జీకటిలో వెదకికొనవలసి వచ్చెడిది. పాపము సామాన్యశైదీలతో బాటు దుష్టమూకలు గోపన్న గారిచే నుదయమున జావినద్ద పనిచేయించిరి కాబోలు, "మేలైన చిటికెనవ్రేలు ప్రాతఃకాలమందున గుట్టె తేలు" యను కీర్తనలో తేలుబాధ బహు పాపిష్టిది. దానిని భరింప జాలకున్నాను. రక్షణకు రమ్మని రాముని బిలిచెను.

మాసములు సంవత్సరములు క్రమించుచున్నవి గాని దినమొక గండముగా గోపన్న గడుపుచుండెను. విసువు జనించి "పాహి మాం శ్రీ రామా యంటే పలుకనైతివి" యను కీర్తనలో శ్రీరాముని శరణాగతత్రాణ బిరుదమును సూటిగా ప్రశ్నించెను. "చరణములే నమ్మితి" యను దాన శరణాగతిని మరిమరి ధృవీకరించెను. కాని తన బాధోపశమనమునకు దారి తెన్ను గానక "సీతారామస్వామి, నే జేసిన నేరము లేమి" యను కీర్తనలో రాముడు గన్పించినయెడల నొడలి యాభరణములెల్ల నూడబెఱికికొని తన బాకీకి విని యోగించుకొనునేమో యని శంకించి దాగియున్నా డను కొని, నేను తమ దర్శన పాదసేవల గోరుదునే కాని నీ విభూషణముల జోలి నాకేల ననెను. "పలుకే బంగారమాయెనా" యని దీనముగ బ్రతిమాలెను. తన ప్రభువు కరుణింపక ఏల జారవిడుచుచున్నాడో రామదాసున కర్థముకాలేదు. తన బాకీ యన్యాయమని భావించి యుండవచ్చుననియు, దాని లెక్క గూడ విన్నవించుట తన ధర్మమనియు దలంచి, "ఇక్ష్వాకు కులతిలక ఇకనైన బలుకవు రామచంద్రా" యను సుప్రసిద్ధ కీర్తనలో జాబితా నొకదానిని రామునిముందు బెట్టి ప్రాకార మంటప వస్తువాహనాద్యలంకారములకు తా నెట్లు వెచ్చించినది, రాము డెట్లు బాకీ పడినది రూఢీపరచి, "ఏటికి జల్లిన నీళ్ళాయె నా బ్రతుకు, రామచంద్రా! నేను అధమునాలి కంటె నన్యాయమైతి" నని విలపించెను. తన యలంకారము

లలో తన మామగారుగాని, తండ్రిగారుగాని పెట్టిన దేదియు లేదని అప్పులవాం డ్రాయాసపెట్టు దుడుకుపదము లన్నియు ప్రయోగించి మందలించెను. తుదకీ పరుష వాక్యములన్నియు దెబ్బల బాధవల్ల వెలువడినవే కాని యిందు తప్పు గొనవల దని ప్రార్థించెను. ప్రతి యాంధ్రుని డెందమును భక్తిపరిత మొనరించి, కరుణబీజమును నాటు నీచక్కని కీర్తన మిక్కిలి కీర్తింపబడుచున్నది.

అప్పటికిని కరుణ గలుగకున్న రామదాసున కింక చిరాకు జనించెను. అప్పులు వసూలు చేయువాని కడసారి పద్ధతి నవలంబించెను. "నిన్ను బోనిచ్చెదనా, సీతారామ! నిన్ను బోనిచ్చెదనా" యను కీర్తనలో "దిక్కు గలిగితే మొరబెట్టుకోర"యనియు, "తడయక నీ తలిదండ్రు లొచ్చినగాని, విడిచిపెట్టని నీ కొడుకునురా" యనియు "రవ్వసేయుదు" ననియు బెదరించెను. అట నాగక, "అడుగుదాటి కదల నివ్వను", అను కీర్తనలో "నీకు కోపమొచ్చిన భయపడను" అనియు, "రేపు మాపని జరిపిన నేనాప" ననియు, "సాక్షిబెట్టి ఒక దీక్షచే నిన్ను సాధింతు" ననియు హెచ్చరించెను. ఇప్పటికిగూడ మారుపలుకకున్న స్వామిని సాధించుటకు మఱియొక మార్గమును గోపన్న కనుగొనెను.

"కవి గాననిచో కవి గాంచునేకదా!" అది యేమన నమ్మనాశ్రయించుటయే. "రామ నీచే తేమి గాదుగా"యని తుదిసారిగా తన యగచాట్లు సీతాభామకు జెప్పవలసినదని

స్వామినే కోరెను. ఫలవంతము కానప్పుడు తానే స్వయముగ విన్నవింపదలచి "రామచంద్రులు నాతో చలము జేసినారు, సీతమ్మ చెప్పవమ్మ" యని ప్రారంభించెను. రాముని కాఠిన్యమును నిరూపించెను. సీతమ్మనైనను ఒకానొక యనుకూల సమయమున తన దుర్గతిని వినిపించి కార్యసాఫల్యమగునట్లు ప్రేమమాట లాడవలె నని "నను బ్రోవమని చెప్పవే" యను కీర్తనలో నుపాయమును సూచించెను. "జనకతనయ నాదు మనవిగైకొని జగజ్జనకునితో దెల్పవే" యనుదాన తనబాధలు తేటతెల్ల మొనరించెను. 'పన్నెండేండ్లనుండి పగలు రేయి నాపన్నుడనైతి'నని "కన్నీరులేకుండ నున్నతీరు నా కెన్నడును లేదుగదా" యని 'ఇడుములఁ బడలేను నుర్విపై ప్రాణములు విడిచి మిమ్ము జేరెద' ననియు సవిస్తరదీనాలాపములతో బాటు, "అతిభీతి నొంది నేనార్జించితిని విషమాలస్య మిక జేయకు" మనియు, చేతికి మించిపోయిన పని జరుగగలదను రహస్యముం దెల్పెను. చివరికీ యుపాయ మనపాయమై మాతృకటాక్షలాభమంది గోపన్న కృతకృత్యుడయ్యెను. లలితవాగ్విశారద యగు జానకిచే ప్రేరేపింపబడి శ్రీరామచంద్రమూర్తి లక్ష్మణద్వితీయుఁడై గోపన్న యాపదల బాప సంకల్పించెను. గోపన్న ఘోర కారాగార గహనావాసమున మిక్కుటమగు నార్తింగుంది తన జీవితము నారేయి చరమాధ్యాయము నొందింప కృతనిశ్చయుఁ డయ్యెను. అందు తనతప్పేమి లేదనుటకు గడపటి

సారిగా "ముచ్చటైన నాడనేమిరా" యనుకీర్తనలో "చిక్కి కాయదిన్న కోంకి నక్కనలె చిక్కాకరించుకొని ఒక్కడనే" యుంటిగదా యని, పదునేండ్లు వర్షములనుండి చీమలు, నల్లులు, దోమలవలని బాధలు దుర్భరములాయె నని విలపించెను. ఇప్పటికి దాసుడు బరీక్షలో కృతకృత్యుడైనాడు. రాముని శరణాగత ధర్మము కార్యరూపము దాల్చినది. నిశీథసమయమున నిదిరించుచున్న తానీషాకడకు రామదాసు గారి జవానుల రూపముల ధరించి రామలక్ష్మణు లేగి నవాబు ముందు రామరాజ్యమునాటి బంగారు నాణెము లొలక బోసిరి. మాయామనుష్యు లంతర్ధానమయిరి. స్వప్నముగ భావించిన తానీషా యుదయమున నాద్రవ్యమునుగాంచి నిర్విణ్ణుండయ్యెను. క్రమముగా లెక్కింప బడిన యా ధనము రామదాసుగారిపై తేల్చబడిన బాకీమొత్తమునకు నిక్కచ్చిగా సరిపోయెను. అని కృష్ణాజిల్లా చరిత్రకారుడు వ్రాసి యున్నాడు. చీకటికొట్టులోనున్న దాసునుంజూచి వెళ్లుదమని రామలక్ష్మణులు విచ్చేసి ద్వారమునుండి కాంచిరి. రామదాసప్పుడు తన మనఃపద్మమున లోకకల్యాణకరుని ధ్యానించుచు "ఏమయ్యా రామ బ్రహ్మేంద్రాదులకునైన నీమాయ దెలియవశమా" యని సంకీర్తన మొనర్చుచుండెను. లక్ష్మణుని లోనికంపి గిన్నెలోని విషమును మన్నున గలిపించెను. ఆ మరునాడరుణోదయమున ఖిన్నమనస్కుడై తానీషా యేతెంచి రయమున రామదాసుగారి బాకీకి వ్రాయంబడిన

రసీదు సమర్పించి పరిపరివిధముల వేడికొనెను. "తప్పు లెన్న బోకు, ఇక మీయప్పు దీరెమాకు, కుప్పబోసిన ధనమప్పగింప కయే రెప్పపాటునను జెప్పక పోయిరి" యని పరితపించెను. తనకు తానీషాకు నట జరిగిన సంభాషణమును "ధన్యుడవు తానీషా నీవు నన్ను గన్నయ్య పదములు కనుల గన్నావు" యను కీర్తనలో రామదాసు పొందుపఱచెను. అందు, "భద్రాచలము నెప్పటికి మీరామభద్రున కిచ్చితిమి బాగుగ వినుము, ముద్రనిశానీలు చేకొనుము, శ్రీభద్రాద్రి వర రామదాసుడై మనుము," యని తానీషా వ్రాయిచ్చినట్లు వివరింప బడి యున్నది.

చారిత్రకాంశము లికముందు చర్చింప బడనున్నవి. గోపన్న కావ్యకాలాదులిట దెలుపుట ప్రస్తుతమై యుండును. అప్రతిమప్రతిమానుభావులగు మహానుభావు లక్కన్న మాదన్నలకు మేనల్లుండైన గోపన్న వంశక్రమాగత విద్యావిశేష బుద్ధివైశారద్యముల గణన కెక్కుటలో సందియ మేమి? విశేషించి బాల్యముననే రామభక్తిపరుడై, రామానుగ్రహపాత్రుడై, సుప్రసిద్ధాంధ్రకవియై; పూర్వపుణ్యవశమున *కబీరు ప్రత్యక్షమగుటయు రామనామ మంత్రోపాసన

---

* కబీరు రామదాసుగారి కంటె చాల పూర్వుడు. అయినను నిది యసాధ్యము కాదు. తపోజ్ఞానధను లెన్నడు చిరంజీవులై పనిబడిన వేళల గన్పింతురు. రామాయణము నాటి మహర్షులు భారతోద్యోగ పర్వమున ప్రత్యక్షమైరి కదా!

మనుగ్రహింపబడుటయు దెలుపబడుచున్నది. తొలుత మనకు గన్పట్టుచున్నది, గోపన్నగారి దాశరథీ శతకము. అందు,

మసగొని రేగుబండ్లకును మౌక్తికముల్ వెలవోసినట్లు, దు
ర్వ్యసనము జెంది కావ్యము దురాత్ముల కిచ్చి మోసమయ్యె, నా
రసనకుఁ బూతవృత్తి సుపరంబుగఁ జేయుదునట్లు వాక్సుధా
రసములు చిల్కఁగఁ బద్యముఖాంగమునందు నటింపవయ్య, సం
తసమును జెంది భద్రగిరి దాశరథీ! కరుణాపయోనిధీ!

యని కృత్యాదినే ప్రస్తావించెను. గాన గోపన్నగారు రామదర్శనమునకు బూర్వమే యే కావ్యమో వ్రాసి, మానవుల కిచ్చి తరువాత తప్పు జేసితి ననుకొనిరి. కావ్య ముపలబ్ధము కాదు. కృతిభర్త యెవరో యెఱుంగజాలము. కాని ప్రౌఢకవియైన పిదపనే భద్రగిరికి వచ్చెనని విశదమగుచున్నది.

కంటి నదీతటంబు, బొడగంటిని భద్రనగాధివాసముం,
గంటి నిలాతనూజ, సురకార్ముకమార్గణ శంఖచక్రముల్,
గంటిని మిమ్ము లక్ష్మణుని గంటి కృతార్థుడ నైతినో, జగ
త్కంటక దైత్య నిర్దళన! దాశరథీ! కరుణాపయోనిధీ!

యని భద్రగిరిరాము సవిమర్శముగ నుతించిన పద్యము కూడ గ్రంథాది నుండుటచే రామదాసుగా రిటకు రాగానే శతక రచనకుఁ గడంగిరి. రామ సందర్శన పరవశు డగు కవి యూరకుండ నేర్చునా! ఆలయ శతక నిర్మాణములు వెంట వెంట జరిగినవే. శతకము ప్రౌఢకవికి గోష్పదము వంటి దగుట త్వరలో బూర్తియయ్యెను. కాంచీనగర ప్రాంతము నుండి యాయన బిలిపించిన వివిధగోత్రములవారగు నైదు

కుటుంబముల వీర వైష్ణవుల నిట నిల్పి తొలుదొల్త పూజల జరిపించెను. "శ్రీరమ సీతగాగ" యను పద్యమున వీరవైష్ణవాచారజనంబు లున్నట్లు దెల్పబడెను. శతకము భావ ప్రౌఢమును ద్రాక్షాపాకమును నగుటంజేసి రామదాసు ప్రౌఢవయస్సున నీ యుద్యోగమున ప్రతిష్ఠుడగుట యూహాదూరము కాదు.

రెండవ యుపలబ్ధమగు కావ్యము ఖైదుకీర్తనలు. గోపన్నగారి కీర్తనలు, చిగురున రామదాసాంకితములై యొప్పును. ప్రకటన మోసముల దోసము లెఱుంగని యాపున్నెపు కాలమున మరొకటీ పేరున వ్రాసియుండరు. బాధలనుభవింపుచు వ్రాసిన రసోల్బణ భంగిమమే యవి చాటకచాటుచున్నవి. ఇదియునుంగాక శతకములోని భావములు మాటలు గూడ నున్న వున్నట్లు నుప్పతెప్పలుగ కీర్తనలలో కలవు.

"పుడమిలోన నావంటి దురాత్ముడు పుట్టడింక నంటి
విడువకుమయ్యా యని మున్నే విన్నవించుకొంటి" (కీర్తన.)
విన్నపమాలకించు రఘువీర నహి ప్రతి లోకమందు
కన్న దురాత్ముడుం బరమకారుణికోత్తమ వేల్పులందు నీ
కన్న మహాత్ముండుం బతితకల్మషదూరుడు లేడు నాకు వి
ద్వన్నుత నీవె దిక్కుగద! దాశరథీ! కరుణాపయోనిధీ! (శతకము)
'గట్టిగ యమునికి నామము బెట్టినాను' (కీర్తన)
'యమకింకరాళికిం గట్టితి బొమ్మ' (శతకము)

ఈపద్యము శతకాంతమున నున్నది గాన కీర్తనల

కన్న శతకము ముందని తెలిసికొనవచ్చును. ఇట్టి వెన్నెని కలవు. కీర్తనలన్నియు తన విషయము క్వాచిత్కముగ దెల్పు చు ప్రాయికముగ కీర్తించుట కనువుపడినవిగా రచించుటచే భజనకీర్తన లను ఖ్యాతి నొంది, భజనసమాజోపయుక్తము లగుచున్నవి. భక్తుల కింత మహోత్కృష్ట కావ్యముల నం దించి మోక్షసాధకులగుటకు మార్గముంజూపి వినువారుగూడ దరింప ననువు గల్పించిన రామదాసుగా రాంధ్రులకారాధ్య పురుషుడు. "స్వయం తీర్ణః పరాం స్తారయతి" యనుట కాదర్శప్రాయుడు.

'Krishna District Manual' కృష్ణాజిల్లా చరిత్రకారుడు, అబుల్లాకుతుబ్ షా 1669 లో మరణించెననియు అబుల్ హాసన్ గోల్కొండ సింహాసన మధిష్టించెననియు తెలుపుచున్నాడు. కనుక గోపన్న క్రీ. శ. 1670 లో పరగణాధికారపదవి నొంది 1674 వరకు భద్రాచల శ్రీ సీతారామాలయ నిర్మాణము గావించి 1686 వరకు కారాగారబంధితుడై విముక్తినొంది కృతార్థుడై భద్రాచలమునకు తిరిగి వచ్చి కొంతకాలముండె నని యేర్పడుచున్నది. ప్రౌఢవయస్సుననే యుద్యోగమొదవె ననియు తానత్యంత దుఃఖితుడై కారాగారమున నున్నను, క్లిష్టతర రాజకీయసమస్యలడ్డు వచ్చుటచే మేనమామలు ద్రవ్యసహాయముచేసి విడిపింపలేకపోయిరనియు, అది వారు ప్రభుత్వ ద్రవ్యదుర్వినియోగముగ భావించి మిన్నకుండి రనియు తానీషాకు బదులుచెప్ప నుద్యమింప లేదనియు

నూహింపవలసినదే కాని ఖైదులో నన్యాయముగ మరణించి నాడను అసహనపూర్వక మగు కొందఱి కల్పనలు దురూ హ్యములు. అట్టిదే జరిగిన మిగిలిన కొద్దికాలమైనను భద్రా చల రామాలయము నడుపబడుట, ఈ ధర్మాదాయమును వెనుకవారగు నైజాము వంశీయులు పరంపరగా సాగనిచ్చుట పొసగని విషయములగును. ఇక ప్రకృతము తానీషాచే వను జ్ఞాతుండై రామదాసు భద్రాచలమునకు మరలెను. వచ్చి నపుడు రెండు నాణెములు మాత్రమే పూజాదికములకై వెంట దెచ్చుకొని శ్రీరాములక్ష్మణుల నలంకరించెను. నేటికి నవి యట భాసించుచున్నవి. తక్కిన ద్రవ్యము తానీషా గొనిపొమ్మన్నను భక్తుడంగీకరింపలేదు. తన యిష్టదైవముం దర్శించి "బహుకాలమునకు శ్రీ భద్రాచలేశునకు పాదసేవ కుడనైతి" నని యెంతో ఆప్యాయముగ, గానలహరిలో నూగెను.

తరువాత కొంతకాల మిద్దేవుని మహా ప్రభావముల గీర్తింపుచు, తానీషా యొసంగిన 'పాల్వంచ' పరగణా యనబడు నిప్పటి పాలవంచ భద్రాచలప్రాంతముల బాలిం పుచు, శ్రీ సీతారామచంద్ర మహాప్రభువువారి యనంత కల్యాణ భోగోత్సవములకు నెచ్చించి భద్రాచలమున కొక కలియుగ వైకుంఠ మనదగిన ఖ్యాతి గూర్చెను.

అనతికాలమున రోగగ్రస్తుడై "ఎక్కడి కర్మము లడ్డుపడెనో ఏమి సేయుదు రామా" యని ప్రార్థించుచూ

"మూాకు నెలలాయె రాముని ముందు నిలువకా—ఎన్నడిట్లుండి నేను యెఱుగ రాఘవా" యని తెల్పుకొనెను. బాధ కోర్వ జాల ననెను. "అంతా రామమయం బీ జగమంతా రామ మయం" అని భక్తసమూహములందు బాడెను. ఉత్సవము లకు ననేక కీర్తనలను సంధించెను. అంత్యకాలమున నెల్లఱు చూచుచుండగా దేవదేవుడంపిన దివ్యపుష్పకారూఢుండై రామదాసు శ్రీరామసాయుజ్య మొందె నందురు.

నవాబు తానీషా

శ్రీరామ దర్శనమాత్ర సఫలీకృతజన్ముడగు తానీషా పుట్టుపూర్వోత్తరములు వినవలయునను కుతూహలము పాఠ కులకు కలుగకపోదు. గోలకొండ రాజధానిగా దక్షిణభారత మెల్ల నకంటకముగ 175 సంవత్సరములు పాలించిన నవా బులు కుతుబ్ షా వంశమువారు. ఇంచుమించుగ నీ నవాబు లెల్లరు ధార్మికబుద్ధి, సజ్జనాదరణ, కవి పండిత గౌరవాదర ములు, మతసహనము, ప్రజ్ఞానురక్తి, సహృదయత్వము కల వారుగనే కీర్తివడసిరి. క్రీ. శ. 1512 లో ఖులీ కుతుబ్ షా గోలకొండ సింహాసన మధిష్ఠించెను. తరువాత 1543, 1550, 1580, 1611, మరియు 1669 సంవత్సరములలో క్రమముగా నొకరి వెనుక నొకరుగ దద్వంశీయులు 'జమ్షీాద్' 'ఇబ్రహీం' 'మహమ్మద్ ఖులీ', 'అబ్దుల్లా హుస్సేన్' 'కుతుబ్ షాహా'లు మరియు 'అబుల్ హసన్ షా' సింహాసనముల నధిరోహించిరి.

మూడవ వాడగు ఇబ్రహీం కుతుబ్ షా స్వయముగ నాంధ్ర కవుల పరామర్శించి పోషించెడివాడు. కవు లీతని 'మల్కిభరామ'ని వాకొనిరి. ఇది 'మలిక్' 'ఇబ్రహీం' అను రెండు పదముల కలయికచే ఉచ్చారణ సౌలభ్యముగ సమసింపబడిన పదము. ఇబ్రహీం అనురాజు ఆ యర్థము కలిగినదగుచున్నది. ఇతడు కృష్ణదేవరాయల వంశీయులచే బాల్యమున బోషింప బడెననియు, దత్సహాయమున రాజు కాగలిగెననియు, లేనిచో జ్ఞాతిపథమునకు గురికాబడి యుండెడివాడనియు విమర్శకు లుదహరించినారు. మల్కిభరామునకు "తపతీ సంవరణోపాఖ్యానము" అను కావ్యమును, శ్రీ గంగాధర కవివర్యుం డంకిత మొసంగి అతని కొలువుకూటమును మిగుల వర్ణించినాడు. అతని దండనాయకుడగు అమీన్‌ఖానునకు దన అచ్చ తెనుగు "యయాతి చరిత్రము" ను పొన్నగంటి తెలగన్న యంకిత మొనర్చెను. ఈ నవాబు విషయమై చాటుపద్యము లుగూడ పెక్కుగలవు.

ఈయన తరువాతవాడగు కులీ కుతుబ్ షా గోలకొండ సమీపమున తన యుంపుడుగత్తె పేర భాగ్యనగరముం గట్టించి తరువాత దనకుమారుని పేర హైదరాబాదుగా మార్చి రాజధాని సౌకర్యములు కలుగునట్లభివృద్ధి నొందించెను.

అటువెనుక అబ్దుల్లా కుతుబ్ షా చాలకాల మేలెను. కొండపల్లి దుర్గమున బాలా హిస్సర్ అనబడు నవసభాభవ

నమును, నందొక యందమగు సింహాసమును మనోజ్ఞముగ నెలకొల్పజేసెనట.

చివరివాడగు అబుల్ హసను లేక తానీషా మిగుల బ్రాహ్మణభక్తి కలవాడనియు, హిందూమహమ్మదీయ కలహములు లేకుండ సుఖపరిపాలన మొనరించెననియు సుప్రసిద్ధుడయ్యెను. ఢిల్లీనుండి వచ్చి మొగలాయి యువరాజు ఔరంగజేబు, ఔరంగబాదులో గట్టిగ గూరుచొని తన రాజ్యవిస్తరణాశ, హిందూమతద్వేషము, ధనాభిలాష, ముప్పేటలుగా పురిమెల్చుచు, నీ త్రాడెవరి కంఠమున దగిలింతునా యని నిరంతర జాగరూకుడై యుండెను. రెండు మూడు పర్యాయములా యురిత్రాడు తానీషాపై విసరెను. గాని అక్కన్న మాదన్నల యుద్ధతంత్ర నైపుణ్యమువలన తానే లొంగిపోవలసి పలాయితుడయ్యెను. కాని రగిల్చిన మతద్వేషాగ్ని యూరకపోలేదు. క్రమముగా వైషమ్యము లేర్పడి పెఱిగి పెద్దవై తుదకొక తురుష్క సేనానాయకుడు (ఇబ్రహీం) గోలకొండకోట రహస్యముల నౌరంగజేబున కందిచ్చునంతవఱకు పరిణమించి తుట్టతుదకు క్రీ॥ శ॥ 1687 సెప్టెంబరు నెలలో గోలకొండ యతని వశమయిపోయెను. తానీషా బందీగా గొనిపోబడెను. అక్కన్న మాదన్నలు హతులగుటయు జరిగిపోయెను. చక్రవర్తియగు ఔరంగజేబు గోలకొండ రాజ్యమును తనకప్పటికేయున్న 22 రాష్ట్రము లలో చేర్చుకొని హైదరాబాదులో తన ప్రతినిధిగా "గాజి

యుద్దీన్" అనునతనిని తాత్కాలికపరిపాలనాధికారమందుంచెను. ఔరంగజేబు 1707 లో గతించిన పిదప క్రీ. శ. 1724 లో మొగలు సర్దారులలో నొకడగు 'అసఫ్‌జా నిజాముల్ ముల్కు'''' అనునతడు సర్వాధికారములతో దక్కను సుబేదారు (గవర్నరు)గా నియమింపబడి ఢిల్లీనుండి హైదరాబాదునకు వచ్చెను. ఈతడే క్రమముగ యుక్తియుక్తుడై మొగలాయీల క్షీణదశను ఆంగ్లేయుల యున్నతిని సమాలోచించి ఆంగ్లేయులకు సహాయుడై హైదరాబాదు రాజధానిగా నైజాము రాజ్యమును నెలకొల్పినవాడయ్యెను.

పింగళి అక్కన్న మాదన్నలు

గోపన్నగారి మేనమామలును, తానీషా నవాబువద్ద మంత్రులును, సకల రాజ్యతంత్ర నయవిశారదులును, ధైర్య సాహస సంపన్నులును, మహోత్యాగశీలురు నగు అక్కన్న మాదన్నల యుదంతము దెలిసినంతవర కెరుకపఱచవలసియున్నది. ఈ యుభయులలో అక్కన్నగారు పెద్దవారై మాదన్నగారిచే నన్నగారని పిలువబడు చుండెడివారని చరిత్రకారులు నుడివియున్నారు. గోపన్నగారు తెలుచు అక్కన్నగారి మేనల్లుడని చెప్పబడుట కిదియే కారణము కావచ్చును. చెన్నపురి ఓరియంటల్ లైబరీలోని (*Local Record.*) స్థానిక చరిత్ర సంగ్రహామునం దక్కన్న మాదన్నల యింటిపేరు పింగళివారనియు, వారివంశీయులు పింగళి, సిద్ధలూరు వా

రిప్పటికిని కలరనియు వ్రాయబడియున్నది. వరంగలు ప్రాంతమున పింగళివారు విఖ్యాతులు. ఏనుగు లక్ష్మణకవి వ్రాసిన శుల్కా మాహాత్మ్యము నందు "పింగళి మాదన్న భానుజీ వలన సమ్మానమొందె" ననియు సుల్తానబుల్ హసన్ క్షోణీశ్వరునిచేత మాటిమాటికి బహుమానమందె" ననియు నుండుటచే అక్కన్న మాదన్నలు పింగళివారనియు అబుల్ హసన్ తానీషా యనియు తెలియుచున్నది. మాదన్నగారు మాత్రమే తానీషా కొలువున మంత్రిగా నుండినను, నీమంత్రి పుంగవు లిరువురికి సమాన గౌరవాదరములు చెల్లుచుండెడివి. కొంతకాలమునకు ననగా క్రీ. శ. 1682 సంవత్సరమున నంత వరకు తనకు సేనానిగానున్న మహమ్మదు ఇబ్రహీం అనువానిని తొలగించి తానీషా యతని శాహ లష్కరు (సేనాపతి) పదవిని అక్కన్న కిచ్చినారని ప్రభుత్వమువారు సేకరించిన *Letter to Fort St. George* అను రికార్డులలో గలదు.

ఈస్టిండియా కంపెనీ వారప్పట్టున చిన్నవర్తకులుగా ప్రవేశించి జార్జిటవున్‌లో స్థిరపడియుండిరి. తమ వర్తకము గోలకొండ రాజ్యమున నిరాటంకముగ సాగించుకొనుటకై తానీషా యనుజ్ఞ నభిలషించుచు మంత్రిపుంగవులగు అక్కన్న మాదన్నల కెంతయో ఆదరబహుమానములు గనపఱచి ఎన్నో ప్రయత్నములు చేసినట్లు పై రికార్డులలో నుదహరింపబడి యున్నది. అప్పుడా ప్రాంతమెల్ల గోలకొండలోనిదే. 1678 లో తానీషా మాదన్నగారలు మచిలీపట్టణమున కేగ



మాదన్న

అక్కన్న

నచటి ఇంగ్లీషుకంపెనీవారు మిక్కిలి గౌరవించి బహుమతు లొసంగినట్లును 1679 ఫిబ్రవరి నెలలో మైలాపూరు, ఎగ్మోరను స్థలములు తమకు కవులున కిప్పించవలెనని చెన్నపట్టణము ఇంగ్లీషువారు కోరుటయు, 1682 అక్టోబరు నెలలో అక్కన్నగారు మచిలీపట్టణమున కేగ నచ్చటి కంపెనీవారు ఆయనను మిక్కిలి గౌరవించుటయు నందే కలవు. అంతకు ముందు కంపెనీవారి కొసంగబడిన యనుజ్ఞాపత్రిక ననుసరించి విశాఖపట్టణము మొదలగు స్థలములలో వర్తక విషయమైన సదుపాయములు కలుగజేయవలసినదని అక్కన్న మాదన్న గారలకు 1682 సెప్టెంబరులో విజ్ఞాపన మొనర్చి, అక్కన్న గారికిని, దుబాసి వెంకట్రాదిగారికిని (*interpreter*) ఆ నెల 25 తేదీని బహుమతులు పంపిరట. ఇంగ్లీషువారి వర్తకమును ప్రోత్సహించి, ఫ్రాన్సు మొదలగు నన్యదేశస్థుల గోల్కొండ రాజ్యమునుండి తరిమివేసినచో నెన్నియో పుట్లరాగియు, ధనము నొసంగుదుమని 14 ఆగష్టు 1683 సం॥ చెన్నపురిలో ఇంగ్లీషువారు తెలియజేసిరట. గోలకొండ రాజ్యమునం దెల్ల చలామణీ నిమిత్తమై మద్రాసులో ముద్రింపబడు రూపాయీలు, కానుల నుపయోగింప ననుజ్ఞ నొసంగుటకును, ఇంగ్లీషు వస్తువులు బందరునుంచే బయలుదేరుచున్నవి గనుక కర్ణాటకమున నేగుటకు శాయిరి సుంక మదనముగా వేయకుండ నుండుటకును ఏర్పాటు చేసికొనుటకు తానీషా బందరుకు వచ్చినప్పుడు విశేషధనము బహుమతిగ నొసంగవచ్చునని మదరాసు కంపెనీవారు మచిలీపట్టణమునకు వ్రాసిరట.

1682 నవంబరు నెలలో మాదన్నగారి సుతుడు మల్లప్పగారి వివాహ సందర్భమున ఖరీదు నొసంగబోయినను తీసికొనక వీశెడు బంగారు గొలుసులు కానుకగ నొసంగిరట. ఆ సంవత్సరపు ఉగాది కానుక నాల్గువందల వరహాలు మాదన్నగారికి బంపిరట. మాదన్నగారి కుమారుని ఉపనయనమునకు, పెండ్లికి, ఆయన పేష్కారునకు, బిడ్డకు, పినతండ్రికి బహుమతులు పంపి వారియనుగ్రహము బడయుటకు బహుధా ప్రయత్నించుట యందే వివరింపబడెను.

క్రీ.శ. 1680 లో పోడెల లింగప్ప యనువాడు చెన్నపట్టణమునకు వచ్చు సరకు నష్టపెట్టుచున్నందున కంపెనీవారు కోరగా అక్కన్న మాదన్నగార లట్లు జేయవద్దని లింగప్పకాజ్ఞనొసంగి, అతనినే తమ ప్రతినిధిగ నియమించి ఇంగ్లీషులో నుత్తరప్రత్యుత్తరములు జరుపుటకు నాజ్ఞ నొసంగుటయు జరిగెనట. 1682 జూలై నెలలో మదరాసు గవర్నరుకు లింగప్ప లేఖవ్రాయుచు సంవత్సరపు పన్ను 2000 వరహా లీయవలసినదనియు, అక్కన్నగారి యోడలవిషయమై సహాయము చేయవలసినదనియు వ్రాసెనట. అక్కన్నగారికీ యోడల వర్తకము నుండెననియు, నప్పుడు రాజ్యమున * వరహాలు చెల్లుచుండెననియు తెలిసికొనవచ్చును. కనుకనే గోపన్నగారు వరహాలు వెచ్చించితినని పలికిరి.

---

* నలువదేండ్ల క్రిందటికదాక గ్రామసీమలలో లోకవ్యవహారము వరహాలలోనే జరుగుట తెలిసినదే. వరహా రు. 3_8_0 లేక రు. 4/_ గా భావింపబడెను.

ఇట్టి బహుప్రకారములగు వ్రాత నిదర్శనములుండుట వలన అక్కన్న మాదన్నల మంత్రిత్వము తానీషా యొక్క నిరూపిత మగుచున్నది. తానీషా రామదాసును బంధించుట యిదివరకే వ్రాయబడెను. కాన నీ నల్వురి సమకాలికత్వము తెల్లమగుచున్నది.

అక్కన్న మాదన్నల వృత్తాంతము 'ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము' ప్రథమ సంపుటము 177-178 పేజీలలో కలదు. పై విషయములెల్ల *Letters to Fort St. George Vol, II pages 105-109* లోను, *Press List of Ancient Records in Fort St, George* లోను, *Public Cons Vol, VI, VII, VIII* లోను కలవని యం దుదహరింపబడినది.

శ్రీ జయంతి రామయ్యపంతులు బి.ఎ., బి.ఎల్. గారు 27-4-1339 ఫసలీ (1929) గోలకొండ పత్రికలో నొక వ్యాసము వ్రాయుచు, అక్కన్న మాదన్నల నెఱింగినవా డగు హోవర్టు అను డచ్చి (Portugal) దేశస్థుడు తన పేర నడుపుకొన్న యొకపత్రికలో, అక్కన్న మాదన్నలు బీద వారై తొలుత 1666 సం॥ న మీర్జుమ్లా యను బిరుదము గల సయ్యదు ముస్తఫా యొద్ద స్వల్పవేతనమున బ్రవేశించి వృద్ధి నందిరనియు, మాదన్నగారికి సూర్యప్రకాశరా వను నామాంతరము కలదనియు, వీరి యజమాని మీర్జుమ్లా పదవీభ్రష్టు డయ్యెననియు, నవాబుగారు రాజ్యభార మంతయు మాదన్నపై నిడి తాను జీవనార్థము 75000 డాలర్లు

(కోలకు మూడు రూపాయిలు) తీసికొనెననియు వ్రాసెనని తెల్పిరి. దీనివలన మాదన్న మహారాష్ట్రుడు కాడనియు, ఆంధ్రుడే యనియు నిశ్చయము బలీయమగుచున్నది.

వలస వృత్తాంతములు

గోలకొండరాజ్య మంతరింపజేసి మొగలు చక్రవర్తి ఔరంగజేబు హైదరాబాదునకు తన ప్రతినిధిగ "గాజియుద్దీన్" ను నియమించెను. కాని 1707 లో ఔరంగజేబు గతించిన వెనుక ఢిల్లీనుండి "నిజాముల్ ములుక్ అసఫ్‌జా క్రీ. శ. 1724 లో దక్కను సుబేదారుగ నియమింపబడెనని తెలిసికొంటిమి. ఈతడు ఢిల్లీలో మొగలాయీలు క్షీణించుట గమనించుచుండెనేకాని దక్కనులో స్వాయముగ రాజ్యమేలలేదు. 1. ఆర్కాటు 2. కడప 3. కర్నూలు 4. రాజమహేంద్రవరము 5. శ్రీకాకుళము అను 5 రాష్ట్రములుగ నొనర్చి సమర్థులగు అయిదుగురు నవాబుల యధీనమందుంచి రాజ్యతంత్రము నడపెను.

ఇంతటినుంచి శతాధికవర్షములతో దక్షిణభారతమెల్ల కల్లోలితమైపోయెను. ఫ్రెంచివారును ఇంగ్లీషువారును తమ తమ వర్తకప్రాబల్యములతో పాటు పరిపాలనా కేంద్రము లేర్పుచుకొనుటకు ప్రయత్నించుకొనసాగిరి. మరాటీదండులతోను తురుష్కదోపిడీ మూకాలతోను జనపదము లరాజక

భయావహ పరిస్థితులకు లోనయ్యెను. తఱచు యుద్ధములు జరుగుచుండెను. ఆయా సర్కారులలోని ఫౌజుదార్లు లేక భిల్లాదార్లు గ్రామసీమలలో శిస్తులు వసూలుచేయుటకు బాధ్యులుగా పరిగణింపబడిన దేశముఖు దేశపాండ్యాలకు తగు సహాయమందజేయ జాలకపోయిరి. పరిణామముగా తమ తమ యధీనము లందున్న ప్రాంతములకు దామే సర్వాధికారులై జమీందారు లను వ్యవహారనామములతో బలవంతులు కాజొచ్చిరి. కొన్ని సందర్భములలో తిరుగుబాటు లోనర్చుటయు బరిపాటి యయ్యెను.

క్రీ. శ. 1748 లో నిజాముల్ముల్కు దివంగతు డగుటయు, రెండవ కొడుకగు నాసరుజంగు రాజ్యస్థితుఁడాయెను. మనుమడైన 'ముజఫరు జంగును ఫ్రెంచివారు బలపరచుచుండిరి. తత్సహాయమున 1750 లో నాతనిచే నాసరుజంగు హతుడయ్యెను. ముజఫరు జంగుతో "బుస్సీ" యనబడు ఫ్రెంచి సైన్యాధినేత హైదరాబాదుకు తరలిపోవు చుండగా కడపవద్ద నెదుర్కొన వలసివచ్చిన యొక దుస్సంఘటనలో 1751 సంవత్సరమున ముజఫరుజంగు హతుడయ్యెను. వెంటనే నైజాముయొక్క మరియొక కొడుకు సలాజతుజంగును రాజ్యస్థితునొనర్చిరి. ఈతని తమ్ములగు నిజామాలీ, బసాలతు జంగు లిరువురు కాలక్రమమున నొకరు ఔరంగాబాదులోను, మఱొకరు గుంటూరులోను, బలవంతులై యుండిరి. ఇంగ్లీషువారు కాక ఆంగ్లేయులకు మఱొకరు క్రమముగ ఫ్రెంచివారికి అభిమానపాత్రులై యుండిరి.

క్రీ. శ. 1759 లో ఇంగ్లీషువారిచే ఫ్రెంచివారు తరుమ బడిరి. 1763 లో నిజామలీఖాన్ ప్రభుత్వము స్థిరమయ్యెను. 23 ఫిబ్రవరి 1763 నాడు నిజామలీఖాన్‌తో బ్రిటీషువారు సంధి పత్రము నంగీకరించి గుంటూరు సర్కారును బసాలతు జంగుకు వదలివేసి మిగిలిన నాలు గుత్తరసర్కారులను కంపె నీకి కవులుపద్ధతిపై దీసికొన నిర్ణయించుకొనిరి. కాని మరల కలహములేర్పడెను. తుదకు 1823 లో ఉత్తర సర్కారులు నైజామువారిని స్థిరపరచి కంపెనీవారు. రూ 11,56,666–0–0 నైజామునకు చెల్లించిరట.

నిజామల్లీఖాన్ పరిపాలనమున 1789 సంవత్సరము నందే భద్రాచల శ్రీ సీతారామచంద్రమూర్తికి హసనా బాదు పరగణాకుగాను ప్రత్యామ్నాయముగ సంవత్సరపు వ్యయము నలుబదివేల రూపాయీ లివ్వవలసినదని స్థిరపఱుప బడెను.

ఈ యరాజకస్థితిలో భద్రాచలప్రాంతము అశ్వారావు బహద్దరుల యధీనమందున్నటుల తెలియుచున్నది. దేవాలయ భృతులు వారేజరుపుచుండిరి. 1769 ప్రాంతములో "ధంసా" యను తురుష్క సేనానాయకుడు ప్రబలి వరంగలు ప్రాంత మున బలిష్ఠుడై ఖమ్మంమెట్టు మీదుగా నిట్టువైపులకు దండయాత్ర వెడలి యొకరివెనుక నొకరు జమీందారుల దోచుకొనుచు దేవాలయముల కొల్లగొట్టుచు రాసాగెను. "ధంసా" యనునది బిరుదమే. మన కీతని విషయము తొలు

దొర్లి నెఱింగించినది భల్లా పేరయ్య యను నొక కవి. భద్రగిరిపై "ఢంసా" దండయాత్రచేసి జరిపిన దురాగతములు విపులముగ వర్ణించుచు నొక శతకమును వ్రాసి, "భద్రగిరిశతక" మని పేరిడెను. ఇందు చరిత్రాంశములు చాల గలవు. కవి యాకాలమునందే యుండి చూచి వ్రాసినట్టుల శతకము వలన తెలియగలదు. కవి నివాసస్థలము యితరవిషయములు తెలియబడుటలేదు. కాని, "యిద్దరికినవచ్చి" యని యొకచో వ్రాయబడియున్నందున పోలవరము గాని పశ్చిమగోదావరి జిల్లా వాడని గాని యెంచవచ్చును. తురకల దాడికి భయపడి "పోలవరము" గ్రామమునకు శ్రీరామచంద్రుడు వలస వేంచేయుట చెప్పుచు దేవదేవుని భీరుత్వమున కాశ్చర్యపడుచు నిందాస్తుతి యొనర్చెను. ఇట్టి నిందాస్తుతు లాంధ్ర కవిత్వ సాంప్రదాయములై యొప్పుచున్నవి. ఆనాటి పరిస్థితుల గన్నుల గట్టినట్లుగ నభివర్ణించెను.

'ఈపాటివాడవని యెఱుగక మిమునమ్మి
అశ్వరాయుడు (భూ) పలాయనము (చంబు), నొంకె'
'తమగుమాస్తా యనదగు నశ్వరాయని
కరుణమీరంగను గాంచలేక, తొలగిపోతిరి'

అను మాటలచే శ్రీరామసేవాలాలసుడైన అశ్వారావుగారు పలాయనులై చికాకుపడుట తెలుపుచున్నారు. మఱియు నిందువలన శ్రీరామాలయపోషణము వారియందప్పటికే నిరూఢమై యుండుటయు, వారి కశ్వారాయ బిరుదనామము ప్రసిద్ధమగుటయు నేర్పడుచున్నది.

“మదాశ్వగజరథ వరవాహనములచే
నలుగువీథులు క్రిక్కి ప్రబలజెందె,
సత్స్వహంసాదికములు నమరెను గోవ
కేవు లెప్పటికన్న గోకిలనమరె”

అని పలుకుచు భద్రగిరిలోని నాటి హృదయవిదారకస్థితిని దృగ్గోచర మొనరించినాడు. ఇక దేవాలయ రంగము గనుగొనుడు.

వీటిబుచ్చిరిగదా వీరులచే జెన్నొందు ఘనమల్లికా పుష్పవనచయంబు
గాల్చుజేసిరిగదా కళ్యాణమంటపా గారవాహన గృహాంగణము లెల్ల
చూఱగొట్టిరి పురన్నుల్ల జొచ్చి విప్రమందిరములన్ని తురకలు మత్తులగుచు.

నాడు ధ్వంస మొనరింపబడిన పుష్పవన మింతవఱకు బునరుద్ధరింప బడదయ్యెను. ఒండు, రెండుమారు లట్టి ప్రయత్నములు జరిగి ఫలశూన్యము లాయెను. మఱల నిప్పుడందికొని కావింపబడుచున్నది. అతడు విఱుగగొట్టిన శాసన శిలాస్తంభములు మాత్రము 1832-1833 నందన సంవత్సరమున బునరుద్ధరింపబడినది. ఈ దండయాత్ర కాలము,

సర్వధారి పేరి సంవత్సరమునందు
‘ధంసా’ కు వెఱచి యిద్దరికి వచ్చి
పోలవరంబులో బొలుపొంద నయిదేండ్లు
వనవాస మొనరించి వరుసతోడ
విజయ సంవత్సరంబున విజయముగను
భద్రగిరికేగితె నయ్యా భద్రముగను.
శ్రీరామచంద్రులు సీతాసమేతులై
వచ్చిరి భద్రాద్రివాసమునకు

జయనామవత్సర చైత్రశుద్ధాష్టమీ
తరువాతి దినమందు దగవివాహ
మరయ మార్గమునందు నొరయ సత్రముల బల్
చలువపందిరులు వెచ్చని జలములు.

అనియును దెలుపుటం జేసి సర్వధారి మొదలుకొని జయసంవత్సరము వఱకు వలసలోనుండుట విశదమగుచున్నది. నందనసంవత్సరము 1832–33 లో వచ్చుటచే సర్వధారి క్రీ. శ. 1769 సంవత్సరము స్థిరమగుచున్నది. ఈ శతకమున దెలుపఁబడిన రామలదేవు, జోగిపంతులు, విజయరామరాజు, సీతారామరాజు, మొదలగువారి కాలమందే యుండిరి. కాంగ్రేగుల జోగిపంతులు మచిలీపట్టణములో నింగ్లీషుకంపెనీ తరఫున నుద్యోగిగానున్న "పైబస్" దొరకు దుబాసీగా నుండి, వారికి నైజాంనవాబు "నిజామల్లీఖాన్" గారికిని సంప్రదింపులు నవంబరు 1764 నుంచి ఫిబ్రవరి 1765 వఱకు జరిపెనని కృష్ణాజిల్లా చరిత్రకారుడు వ్రాసియున్నాడు. అశ్వారావుగారు భయముచే పలాయితులగుటంబట్టి యేదియుం దోపక తురుష్కులవారినుండి తప్పించుకొనుటయే తత్కాల కర్తవ్యముగా నెంచి బాధ్యతగల యర్చకస్వాములు శ్రీరామదాసుగారి యాభరణములు, నుత్సవమూర్తులను గూడ దీసికొని రెడ్డిపోలవరమునకు వలస నంగీకరించి కొనసాగించిరని తెలిసికొనగలుగుచున్నాము. మూలస్వామికి యర్చకు లొక యడ్డుగోడ నిర్మించి వెడలుటచే నపాయము

తప్పిపోయెను. గాని "ధంసా" వలన రామదాస నిర్మిత శిలా శాసనములు ధ్వంసములయ్యెను. పోలవరమునందు శ్రీ రామలదేవుగారు రప్పుడు జమిందారుగా నుండిరి. వారత్యంత భక్తిశ్రద్ధల దోడ్పడిరి గాబోలు "శబరి విందయ్యెనే సరభసంబున మీకు భావింప రామలదేవు భక్తి" యని కవి పొగడెను. "కారణ జన్ములని తోచి యాతనికి వరమీయబోతివో" యనియు బలికెను. పోలవరమున నిర్భయముగ నుండుటకు కంపెనీవారి సహాయ మవసరమగుటచే రామలదేవుగారు వారి ననుసంధింపజేయుటయు, వారికార్యము నంగీకరించి రాజమహేంద్రవరమున సాధించుటయు "ఘనబుష్యమూకమయ్యెనె రాజమహేంద్రవరము" అనియు "జోగిపంతులకు మెచ్చులువల్క బోతివో యింగిరీజుల ప్రాపు నిచ్చగించి" యనియు "హనుమంతుడయ్యెనే అతిసాహసుండగు జోగిపంతులయుక్తి చూడ మీకు" ననియు విమర్శించి పల్కుచు "నన్ను ధన్యునిజేయ నాచేత పద్యముల్ చెప్పింప బూనుటో యొప్పుమీఱ" నని వ్రాసి యకాలమున దానున్నట్లు వెల్లడించుకున్నాడు.

అశ్వారావుగారు దేశాంతర్గతులగుటచే వలసకాలమునందు వ్యయమెవ్వరు భరింతురను సమస్య యేర్పడియుండును. ఇందుకు దగినవా రకాలమున బలిష్ఠులగు విజయనగర మహారాజులగు పూసపాటివారు తప్ప నొండు సమర్థులు లేరని యూహింపబడి రాయబారము నడుపగల మార్గము

లన్వేషించి బందరు (మచిలీపట్టణము) లో గల "పరాసు" దొర "గోరుందొర" ఆకాలమున వచ్చుట ఫ్రెంచి అధినేత "గోడెహు" నట్లు పలికి యుండును. యాతనికి మిత్రుఁడగుటచే నాతనిని సంప్రదించి కృతకృత్యులైరి కాబోలు. "సుగ్రీవుడయ్యెనే సారిది గోరుందొర కప్తాను ఘనుడు మీ కార్యమునకు" ననియు "పూసపాటి నృపాలుర బ్రోవదలచి, తెచ్చుకుంటివో మీ ఖర్చువెచ్చమునకు" నను వాక్యముల బొందుపరచినాడు. కనుక పూసపాటి విజయరామరాజు, సీతారామరాజుగారలు వలసకాలమున నుండిరి. విజయరామరాజుగారు బొబ్బిలియుద్ధపువారు కారనియు వారి భార్య చంద్రమ్మగారికి దత్తుడనియు పూజ్యశ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారు నందన ఆశ్వయుజ "భారతి" లో వ్యాసమున దెల్పిరి.

ఈ శతకమున "ధంసా" యెవరను దెల్పు పద్యమున కవి, యతడు "ఇబరహీముఖాను" డనియు "ఫాజలుబేగు" "జాల్దుంగు" అతని పర్యాయనామములనియు "ధంసా" యను బిరుదము నొందెననియు నర్థము వచ్చునట్లు నుడివి యున్నారు. పారసీక భాషలో 'ధంసా' యనుట బిరుద మీయదగినంత యర్థముగల పదమని తోపదు. జానపద ధ్వంసచర్యలకుం గడంగిన నితని గ్రామీణులు 'ధంసా' యనుటచే నీ బిరుద ముత్పన్నమై యదియే నిరూఢమైనదని నా యనుభవమున నూహించుచున్నాను. నైజాము తరఫున

ఖమ్మంమెట్టుజిల్లా యధికారిగా నియమితుడైన 'జాఫరు బేగు ఖాన్' అనునతడు ఆజిల్లాను డిశంబరు 1767 సం॥న కర్నలు హోస్టు అను ఇంగ్లీషు దొరకు వశపఱచుటచే నీ కంపెనీ వారా తని కొక జాగీరు నొసంగిరనియు, తదుపరినతడు బందరులోని ఫ్రెంచి అధికారి మాంజిన్ దొరతో రహస్యాలోచనము లొనర్చుచున్నట్లు కనుగొన బడియున్నందున నాతనిబందీగా నొనరించి క్రమ్మఱ విడుదలచేయించి ఉపకార వేతనము మాసమునకు 150 పగోడాలిచ్చిరనియు ఆతడు గతించిన వెనుక నాతని కుమారునికి గూడ నిచ్చిరనియు కృష్ణాజిల్లా చరిత్రకారుడు వివరించి యున్నాడు. ఖమ్మంమెట్టు వ్యవహారమున నైజామునకు విరుద్ధముగ నడచుటయు ఫ్రెంచివారితో మంతనము లొనర్చి కంపెనీవారికి కోపకారణమగుటయు స్వాయముగ హింసాచర్యలకు గడంగుటయు కలుగుటచే జోగిపంతులు మొదలగువారి ప్రయత్నములు అనాయాసముగ త్వరితగతి సఫలీకృతములై పతనముంగన్న యీతడే 'ధంసా'యగునని నా తలంపు. వరంగలు ప్రాంతమున జాఫర్ గడ్ యను గ్రామముండుట ఖమ్మంలో జాఫర్ బావి యను నొకబావి యుండుట యిందుకు ప్రోద్బలము లగుచున్నవి. కంపెనీ వారొసంగిన యీ ప్రాంతమే యతని యల్పకాలపు జాగీరయి యుండెనని తోచెడిని. ఈ భద్రగిరి శతకమును శ్రీ వావిళ్ళవారు తమ భక్తిరస శతకసంపుటములో ముద్రింపించి ఆంధ్రుల కృతజ్ఞతకు పాత్రులైరి.

'ధంసా' విషయమును సాంగోపాంగముగ దెల్పు మఱి యొక కావ్యము 'శ్రీరామాభిషేకము'; దీనినే అశ్వారాయ చరిత్రమనియు జెప్పెదరు; ఆత్రేయసగోత్ర పవిత్ర శ్రీమాధవా మాత్యపుత్ర వెంకటరామనామధేయ ప్రణీతము; ఈ కావ్యము ముద్రితమైనట్లు నాకు దెలియదు. కవి నివాసకాలాదు లెఱుంగను. ఇందు మావంశోన్నతులగు పూర్వులవిషయములు శ్లేషింపబడి యుండుటచే నత్యాసక్తినొంది పూజ్యులగు నా జనక పాదులు వ్రాతప్రతినుండి యెత్తివ్రాసికొని యుంచిన కొన్నిపద్యములు నాకిచ్చుట నాధారభూతములైనవి. వ్రాత ప్రతిగూడ మఱల నాకు లభించుటలేదు. ఇది ముద్రితమై యుండి యేదేని ప్రతి చిక్కినచో క్రొత్త విషయము లగు పడిన ముందు వివరించుకొందును. ఈ వ్రాసి యుంచబడిన 'నోట్సు' లో 'ధంసా' జననము క్రీ. శ. 1710 అని మాత్ర మున్నది. ఇక మిగిలిన వివరములలో మునుముందు 'ధంసా' మరణ విషయ మిట్లున్నది.

సీ. "మెఱసి రాజన్యుల చెరసాల బెట్టిన
  మగధనాథుడు పోరమడిసినట్లు
సౌంభకారూఢుడై జగమెల్ల నేచిన
  సాళ్వమహారాజు సమసినట్లు
పన్నుమీరగ రాచకన్నెల జెఱగొన్న
  నరకాసురుడు మేను దొఱగినట్లు
నమరులవెట్టి కొట్టములుగొన్న దశాస్యు
  డడలుచు గాయంబు విడిచినట్లు

గీ. ఘోరవీర ప్రతాపముల్ నూఱుప్రచ్చి
తనదు పుత్రులు భార్యయు తల్లడిల్ల
తనువు ధంసాదొరంగెన్ను తనదు ధనము
దేశమును సంపదల బాసి యాశలుడిగి.

కం. సుకరముగ శాలివాహన
శకవర్షము లబ్ధి గగన శైలేందువు లు
త్సుక ప్లవవత్సర మధుశుచి
వికసిత పంచమిని మేనువిడిచెన్ ధంసా."

(శా.శ. 1704 కు సరియగు క్రీ.శ. 1782 ప్లవ సంవత్సర చైత్రశుద్ధ పంచమిని ధంసా మరణ మొందెనని తెల్పెను.)

ధంసాకు జిక్కక పలాయనమైన యశ్వారావుల గు ర్తెటి గింపవలయునని శ్రీ కొండపల్లి కృష్ణారావుగారిని (మా పూర్వులలో నొకరు) గోరినట్లు క్రింది పద్యమువలన దెలియు చున్నది.

* .సీ చామీకరాచలోద్ధామ దేశాధీశు
డార్య సన్నుతుడు వేదాంతవిదుడు
నిరతాన్నదాన విస్ఫురకీర్తిసాంద్రుండు
భూసురాశీర్వాదభాసురుండు
ప్రత్యర్థిమంత్రి ప్రభంజనోపాయుండు
మండిత కాంచనకుండలుండు
మహనీయ కారుణ్య మంజులస్వాంతుండు
సకల విద్వత్కవిప్రకర హితుడు

* కనగిరిపరగణా కధీశ్వరుడు. కల్లూరు మధిర తాలూకాలో గలదు.

గీ. భూరిసామ్రాజ్య వైభవ పూరితుండు
కొండపల్లి కులాంబుధి కువలయాప్తు
డనగ బొగడొందు కృష్ణరాయాగ్రగణ్యు
నెలమి బిలిపించి మన్నించి పలికె ధంస.

“నీయందు న్నపకారము న్నడచి తా నీదేశముం బోసికో
పాయుండోలిన మన్నెరాయ నృపతిన్ బ్రాపించి యున్నావు నీ
వీయాయం బెఱిగింపు నాకు మఱల న్నిప్పింతు నీ దేశమున్
దాయంబీసి సమస్త సంపదలు పొందం జేత నీ కీర్తనన్”

ఇట్లు భేదోపాయముం బ్రయోగించె గాని “ధంసా” కృతకృత్యుడు కాజాలక దేశము పాడొనరించి తానువూ పాడయ్యెను.

ధంసా యనంతర మాతని కొడుకుగూడ నధికారము వహించెనట.

శా॥ ధంసాసూనుడు షర్ఫుమీర్జ యను నాతండున్ నిజామల్లిచే
తనస్సన్మానము గుంగి తాబు బొలుపొందన్ హేతిరాజంగు స్వే
చ్ఛ న్సంపాదన జేసి తండ్రిపగిడిన్ రోషంబుతో యావనో
త్తంసాగ్రేసరుడై యఖండమహిమన్ ధాత్రీతలం బేలుచున్.

ఇందు ధంసా వెనుక నాతని కొడుకు ‘నిజాపులీఖాన్’ నైజాము నవాబుచే మన్ననల నంది ఈప్రాంతముల కధికారియై వచ్చినట్లు స్పష్టమగుచున్నది. శ్రీ రామచంద్రాశ్వారావుగారు పాలవంచ సంస్థానమును మరల పొందుట కనేక ప్రయత్నములు రాయబారములు జరిపించినట్లే గ్రంథమున

విస్తృతీకరింపబడినది. తుదకు గృతకృత్యుడై తగినవారి సహాయమున పునః ప్రతిష్ఠుడయ్యెను.

మ॥ అనఘన్ వారల కొండపల్లి కులజుండై యొప్పు చంద్రప్రభున్
ఘనుఁడన్ గంటకు దేవ్వరించి పనుపన్, వారేగి స్తంభాద్రిలో
వెలినొప్పన్ నివసించు 'నాయబును' ప్రావీణ్యంబుతో గాంచి హృ
ద్వనజీజంబులు పల్లవింప 'నజరుల్' సంప్రీతిమై నిచ్చినన్.

చ॥ కలువల రామచంద్రుడును గారవమొప్పఁగ మీరలున్ మహా
బలియుడు దేవినేని కులభవ్యుడనంబగు పాపరాయుడున్
సలలిత కొండపల్లి కులజన్ముడు చంద్రపమంత్రియున్ సము
జ్జ్వలగతి నశ్వరాయునకు చాలఁగ నమ్మిక సేయగా దగున్.

తే॥గీ॥ పండితాగధగీతముల్ సంపడింప
సకలజనములు గొనియాడ సంభ్రమమున
మిత్రజనములు నత్యంత మైత్రి నెఱప
రామచంద్రాశ్వరాయుండు ప్రేమ నొందె.

ఇట్లు పునః ప్రతిష్ఠుండై సంస్థానాధిపత్యము వహించి తనకు సాయపడిన పెద్దల సముచిత గౌరవసత్కారములం గొనియాడి కీర్తిగొనుట కవి వర్ణించెను. ప్రౌఢకవిత్వముగా కున్నను నప్పటి చారిత్రక విషయము నున్నదున్నట్లు వివరించినాడు.

ఈ చరిత్రమున మఱొక వలస వృత్తాంతముగల కథాంశము వెలువడుచున్నది. బెజ్జిదేశమున (బస్తరు ప్రాంతమున నీ సరిహద్దులవెంట గలదట. ఇది కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రమనిచే తనముందు ఖడ్గధారియై నడచినవానికి జాగీరుగా

నొసంగబడినది.) గల కమలాపుర గ్రామమునందు శ్రీరామ చంద్రాశ్వారావుగారు శ్రీ భద్రగిరినాథుని కొంతకాలము నిలిపి యుత్సవములు గొఱతవడక జరిపించి తిరిగి భద్రాచల మునకు (క్రీ.శ. 1785 కు సరియగు) శోభకృతు సం॥ మార్గశిర శుద్ధ సప్తమి సోమవారమునాడు తోడ్కొని వచ్చి పునః ప్రతిష్ఠ యొనర్చిరట.

సీ॥ బెజ్జిదేశములోన పేరు విఖ్యాతిగా
　　రహినొప్పు గమలాపురంబునందు
మున్ను తారుంచి సమ్మోదంబు నిండార
　　పరమోత్సవంబు లేర్పరనొనర్చు
కతన నచ్చోటికి కదలిపోవలెనంచు
　　వెలయనర్చకులును వీరభటులు
వలనొప్పమంత్రులు వాహానసముదాయ
　　మార్యసంఘంబు లాచార్యవరులు
గీ. భూసుతాధిపు వెంచేపు చేసికొనుచు
రాగలందులకును వెంట దూగినడువ
భూరిసంతోష వైభవస్ఫురణ మెరయ
రామచంద్రావనీంద్రుండు రమణవచ్చె.

శ్రీ రామచంద్రాశ్వారావుగారు కమలాపురమునకు వైభవోపేతులై యేగి శ్రీ స్వామివారిముందు తాము పాద చారులై యఖండ ప్రాభవముతో భద్రగిరికి వచ్చుట కవి వర్ణించెను. మఱియు

చ. అరయగ శాలివాహన శకాబ్దములన్ క్రతుపుష్క రాద్రిభం
　వరులను గల్గు శోభకృతువత్సర మార్గశిర ప్రశుద్ధమం

దిరవగు సప్తమిం దనరు నిందు నివాసరమందు రాఘవే
శ్వరు దగ నశ్వరాయ నృపవర్యు డొనర్చెను సుప్రతిష్ఠయున్.

అను పద్యమువలన వలస ప్రారంభ మెప్పుడోగాని పునః ప్రతిష్ఠ మాత్రము శా. శ. 1706 కు సరియగు 1784 శోభకృతువత్సర మార్గశిర శుద్ధ సప్తమీ సోమవారమున జరిపించిరని వ్రాసినారు. ఇది 1725 లోని శోభకృత్తనుకొనవీలుండదు. అప్పటికి మొదటి నైజామే సుస్థిరుడు కాలేదు. ప్రాంతము లెల్లను జమీందారుల హస్తగతములై నిరంకుశపరిపాలన నుండుటచే వలస కవసరము కనుపించదు. ఇక 1845 లోని శోభకృత్తనుట కుదురనివిషయము. నాల్గవ నైజాము కాలము, ప్రశాంతవాతావరణము, కష్టకాలము లెట్టివైనను క్రీ.శ. 1740–1790 వఱకే కన్పించుచున్నవి. మాటిమాటికి మార్పులు కన్పటు టప్పటికి పరిపాటి యయినది. క్రీ.శ. 1775 లో నిచ్చట పోలవరమునుండి తిరిగి వచ్చిన వెనుక 'ధంసా' వలననో మఱియే యితర కారణమువలననో భయావహస్థితి వాటిల్లినప్పుడు బెజ్జి దేశములో నించుక స్థిరత్వము తలదాచుకొనుటయం దేర్పడి అశ్వారావు లీ రామసేవల విడువనొల్లక కమలాపురమునకు రప్పించుకొని 'ధంసా' యస్తమించి శాంతి చేకుఱి తమ సంస్థానము దాము పొందగల్గుటచే గ్రమ్మఱి క్రీ. శ. 1785 లో భద్రగిరిని పునః పతిష్ఠింప జేసి రామానుగ్రహ మొందుట భావింపవలసి వచ్చుచున్నది. యే యాధారములేక యిట్టివి కవి కల్పించడుగదా !

అసలు అశ్వారావుల పుట్టు పూర్వోత్తర మిట్లు వ్రాసెను :

సీ. అలరంగ శాలివాహన శకాబ్దంబులు
సామజాంభోరాశి శరమృగాంకసు
అనగల్గు రాక్షసాహ్వాయవత్సరంబున
సర్వాశ్వరాయ భూపాగ్ర విభుడు
పఱగంగ హాస్సనబాద శంకరగిరి
మనసబు వైకొని ఘనతమీఱ
తనరాజధానికి తగిన పట్నంబని
వలనొప్పగా పాలవంచపురము
నందు భూదుర్గ మొనరించి యఖిలజనులు
ప్రీతిగావింప సద్గుణోపేతు డగుచు
తత్పురంబున నివసించి ధాత్రియేలె
భూరిరవమైన నౌబత్తు బోరుకలగ.

శ్రీ సర్వాశ్వారాయ బహద్దరువారు ప్రప్రథమమున శా.శ. 1548 కి సరియగు క్రీ.శ. 1626 రాక్షస సంవత్సరమున హాస్సనాబాదు శంకరగిరి ప్రాంతమును మనసబు వైకొని పాలవంచ ముఖ్యపట్టణముగ నేర్పఱచికొని కోటగట్టుకొని పాలనవ్యవస్థ స్థిరీకరించుకొనిరని దెలుపబడుచున్నది.

శకములనుబట్టి చూడగా 1626 క్రోధన యగుచున్నది. రాక్షస సరిగా 10 సం. క్రింద వచ్చుచున్నది. యీ పొరపా టెట్లు వచ్చెనో తెలియరాకున్నది. వారి వ్రాత కాధారము తెలిసియున్నచో కొంతవఱ కాలోచింప సహాయపడియుండె

డీవి. ఎట్లయినను నా కాలముమాత్రము తానీషాకు పూర్వ్వ మగు క్రీ.శ. 1611 నుంచి గోలకొండను పాలించిన 'అబ్దుల్లా' నవాబు పరిపాలనములోనిది. తొలిసారిగా నాతడే వారి కీ ప్రాంతము నొసంగి "సన్నై అశ్వారావు" బిరుదము నొసం గెనో! సన్నై అశ్వారావు బిరుదు 125 ఆశ్వికదళము నుంచ వలయునను నిర్ణయమును దెలుపును. ఆ తరువాత కాలముల యందు సైన జేర్కొనబడిన శ్రీరామచంద్రశ్వారావులే గాక క్రీ.శ. 1859 లో శ్రీ సీతారామచంద్రస్వామి అశ్వా రావు బహద్దరువారికి సంక్రమించునంతకు ననేక పర్యాయ ములు నిరోధము లేర్పడి మార్పులు చెందినట్లు స్పష్టమగు చున్నది. కనుకనే తానీషా నవాబు శ్రీ రామదాసుగారి కొసంగుటయు, నదియు నిలువనప్పుడు శ్రీ చందులాలు మంత్రిశిఖామణి శ్రీ రాజా తూము లక్ష్మీనరసింహదాసుగారి కొసంగుటయు జరిగిపోయినవి.

ఇవి యిట్లుండ మరొక వృత్తాంతము సన్నిహిత వర్గం బుల ననుశ్రుతమై ప్రసిద్ధముగ నున్నది. ఒకపరి మహోపద్రవ కరమగు నరాజక పరిస్థితి యేర్పడిన, నర్చకస్వాము లొక యుపాయంబు పన్నిరట. ఉత్సవమూర్తుల మువ్వురిని గోదా వరీ గర్భమున డాచి తాము నక్కడక్కడ దాగియుండిరట. ప్రమాదము తీరిన వెనుక వెదుకగా శ్రీరామలక్ష్మణమూర్తులు మాత్రమే లభ్యములై శ్రీ సీతాస్వరూప మగుపడ లేదట. భక్తులు వాపోవుచుండ నొకరి స్వప్నమున యతాచార్యరూప

మున దర్శన మొసంగి, పృథ్విననంటిన సీతాసతి మఱల రానేర
దనియు, ఇట్టి మూర్తియే ఫణిగిరిలో నున్నదనియు నానతిచ్చి
రట. వెంటనే కొంద రుద్యమించి నల్లగొండజిల్లాలోని ఫణి
గిరి కరిగి రామాలయమునకు యాత్రికులవలె ప్రవేశించి
యచటి రహస్యముల దెలిసికొని యొకనాటి రేయి సీతా
విగ్రహమును దొంగతనముగ దెచ్చిరట. వెనుదఱుముకొని
యచ్చటి యాలయాధికారులు వచ్చువర కిచ్చట ప్రతిష్ఠ
జరుగుటయేగాక ఆకస్మికముగ గోదావరి పొంగి వచ్చుట
వలన రాసాధ్యముగాక వెనుకకు మఱలిరట. జనప్రసిద్ధిగల
ఇటీవలి వృత్తాంత మగుట నమ్మబడుచున్నది. ఇట్లెన్నియో
గడ్డురోజులు గడచినవి. కాని యుపాయాంతరములచే విజ్ఞు
లప్రమత్తులై యుండి తప్పించుటంజేసి, భద్రాద్రిరామ స్థితికి
భద్రము తప్పలేదు.

నిజామలీఖాను 1803 లో మరణించెను. మీర్ సికం
దర్ జాహా సింహాసనస్థుడై 1829 వఱకును, తరువాత నాస
రుద్దౌలా 1857 వఱకును, అఫ్జలుద్దౌలా 1869 వఱకును,
మహబూబలీఖాను 1911 వఱకును, క్రమముగ బరిపాలించి
హైదరాబాదు నవాబు లీ దేవాయతనముపై ప్రత్యేకాభి
మాన ముంచిరి. తరువాత నవాబు "మీర్ ఉస్మానలీఖాను"
పేరుగల నేటి రాజప్రముఖుని యాజ్ఞా ప్రకారము హైదరా
బాదు ప్రభుత్వముచే నిది నిర్వహింపబడుచున్నది.

భద్రగిరి వరద రామదాసు
తూము లక్ష్మీనరసింహదాసు

రామదాసు ననంతరము దేశమంతట మహాప్రఖ్యాతి గడించిన ఈ మహాక్షేత్ర సందర్శనాభిలాషులై ప్రయాణ వ్యయప్రశ్రమల నాలోచింపక నలుమూలలనుండి యాత్రికులు మహాప్రవాహముగ శ్రీ సీతారామచంద్ర కల్యాణోత్సవముల కేటేట వచ్చుచుండిరి. ముద్రితములు కాకున్నను అప్పుడే యానోట నానోట నల్లుకొనిపోయిన "రామదాసు కైమ కీర్తనలు" బ్రహ్మానందముగ బాడువారును, వినువారును, నృత్య మొనర్చువారును, రామదాసు దుఃఖములో లీనమై దుఃఖించువారును, యిచ్చోట మన శక్తికొలదిగనే వస్తు వాహనము లొసంగి రామదాసు కైంకర్యములకు ప్రక్క ప్రక్కలుగ నిలుపుకొను భాగ్యము కలిగించుకొనజాలుదు మని పరిపరివిధముల దలంచువారును, యిక్కడనే గడునవల సిన జీవితకాలమును గడుపుకొందుముగాక యని నిశ్చయించి యుండిపోవువారును, భాగవతసేవ సులభాతిసులభమగు మోక్షసాధన మని తలంచి వచ్చిపోయెడి యాత్రికులకు బరి చర్య లొనర్చువారును, భద్రాచలమున గలుగుచుండిరి. అట్టివారిలో మహాభాగవత శిఖామణులగు నాగెండ్ల వరద రామదాసు, తూము లక్ష్మీనరసింహదాసు అను వారిరువురు నీ దేవస్థలము నుద్ధరించిన మహాత్ములై చిరస్మరణీయులైరి.

పందొమ్మిదవ శతాబ్దమున దొలి రెండవ దశకములో జెన్నపట్టణమునుండి వరదరామదాసుగారును, గుంటూరు పట్టణమునుండి లక్ష్మీనరసింహ దాసుగారును నేపేట దప్పని సరిగ కల్యాణోత్సవ సందర్శనాగతులై యొకచో గలిసి కొనుచు, నర్మధర్మ సంభాషణముల బ్రొద్దుపుచ్చుకొనుచుం డెడివారు. ప్రస్తావవశమున భద్రాచల శ్రీరామాలయ పరిస్థితుల ముచ్చటించుకొనుచు దగిన యాజమాన్యము లేకపోవుటచే నానాటికి క్షీణదశ నొందుచుండుట గమనించి యాలోచించెడి వారు. రామదాసుగారొసంగిన వృత్తులు మాన్యములు మొదలైన వంతరించి యాయన నిల్పిన సేవా ప్రకరణములు గూడ తగ్గిపోవుటచే భీతి యుదయించినది. ఉపాయాంతరము లన్వేషింప నారంభించిరి. లక్ష్మీనరసింహ దాసుడు భక్తుడు, వక్త, కవి, వ్యవహారనిపుణుడు, లౌక్యతంత్రముల నెఱింగిన నయశాలి, శ్రీరామమంత్ర జపధ్యాన పరాయణుడు, ఆర్థికపరిస్థితి లేనివాడు. వరదరామదాసుగారు భాగవతధర్మము లెఱింగిన ప్రసన్నశిరోమణి, విశేషధన సంపత్తికల మహాసీయుడు, త్యాగరతుడు, నిరంతర వ్యాధి పీడితుడు. సుమారు పది సంవత్సరము లీరీతి గడచిన పిదప పరిస్థితులు మరింత జెడుచుండుటజూచి, యిరువురి మైత్రిచే నేదైన మార్గము ద్రొక్కవచ్చునియు ఈ క్షేత్రమును రామదాసువై పునర్వ్యవస్థీకరించుటకు నీవు దక్షుడవనియు నృసింహ దాసుగారు వరదరామదాసుగారి నుద్బోధించిరి. తనవలన

కాదగినది ద్రవ్యసహాయ మొకటే గనుక నందుకు సంసిద్ధుడ ననియు, నై భారమంతయు దమదేననియు నృసింహదాసున కాయనబదులాడి యూరకుండెను. అంత నత్యంత సంతోషిత స్వాంతుండై నృసింహదాసు వరదరామదాసు నుద్దేశించి "నీమనంబునందలి సందియం జేనెరింగితి. క్షీణబలుడవయిన నీ యసువులెప్పుడెప్పూటబాయునో, పట్టినపని తుదముట్ట దేమో యనుబాధ నొందుచుంటిని. కాని రామకార్యమున కష్టతగులునట్టి దేదియు లేదని నానమ్మకము; నాపై విశ్వాస ముంచిన నేడే కార్యదీక్షితుడనై యిలువెడలి నవాబు సన్నిధానమున కరిగి తగినయాజ్ఞాపత్రికను నీ పేర దెత్తునుగాని విడుతునా" యనియు , "నీయసువులకు నా యసువులు ముడి నైతు" ననియు "మనమైత్రి రామసుగ్రీవమైత్రియై వర్ధిల్లు గాక" యనియు యిందుకు నే దప్పననియు బాసజేసెను. వరదరామదాసు పరమానందమున దనమిత్రుని గవుగలించు కొని యిదే చెన్నపురమునుండి తరలివత్తుననియు, నేనిక భద్రగిరివరదరామదాసు పేఱ బఱగెదననియు తనసర్వస్వము శ్రీరామునిదే యనియు వాక్రుచ్చెను. అట్లిరువురు పరమ మైత్రి నవలంబించి రామసాన్నిధ్యమునకరిగి ప్రణమిల్లి తమ్ము గృతకృత్యులం జేయవలయునని, సగద్గదికముగ బ్రార్థించి, వేడుకొని, యొకరు చెన్నపురికిని, మఱియొకరు హైదరాబాదు నకును పయనముగట్టిరి.

భద్రగిరి వరద రామదాసుగారు చెన్నపురమునుండి

తరలివచ్చిరి. భార్య, ఆలయ సమ్మార్జనము, నిత్యనవీనరంగ వల్లీవిరచనము, నవవికచసుమదామ సమలంకారము, భాగవత జన సమాదరణా ద్యనేకవిధ కైంకర్యము లొనర్చుచుండెను. యోగిజన కల్పుండగు ననల్పత్యాగశీలుడు వరదరామ దాసు తన గేహమునం గల సర్వాభరణములు రామార్పణ మొనరించి యుచితరీతిని స్వామికి సేవజేయుచు కాలము బుచ్చుచుండెను.

అట హైదరాబాదున కేగిన తూము లక్ష్మీనరసింహ దాసు, నవాబు సందర్శన మెట్లగును? అమాత్యశేఖరు లెవరు? ఎట్లు సందర్శింప గలుగుదునని విచారింప నారంభించెను. నవాబు నాసరుద్దౌలా యనియు, గుణవంతుడనియు, ముఖ్య మంత్రి శ్రీ చందూలాలు బహద్దరనియు, అత్యంత త్యాగ వినయ శోభితుడనియు దెలిసికొనెను. సుమారొక మాసము వఱకు శ్రమించి ఎట్టకేలకు సచివాగ్రణి మందిరమునకు ప్రవే శము గల్పించుకొనెను. భద్రాచల నివాసుడననియు, ఒకా నొక రామకార్యార్థినై వచ్చితిననియు దాసుగారు తెల్పగనే యమాత్యగ్రామణి చిరపరిచితునింబోలె నాహ్వానించి, యభ్యంతర గృహంబునకు దోడ్కొనిపోయి, మజ్జన భోజన నవీన వస్త్రాద్యలంకారముల సంప్రీతుం జేసి, యర్హమగు వసతిగృహమున నుండ నియమించెను. దినములు క్రమించు చున్నను సెలవీయలేదు సరిగదా, వచ్చినకార్యమైనను దెలిసి కొనక పోయెగదాయని నృసింహదాసు విచారించెను. కాని

తన యిష్టదైవమంతకుముందే యీ కార్యము సాధించె నని యప్పటి కెఱుంగడయ్యె. చందూలాలీ భాగవతోత్తముని గురువుగా నంగీకరించి రామమంత్రానుష్ఠానము లీతనిచే దెలుపంబడినవాడై, యొకనాటిరాత్రి దినచర్యలు ముగించి విశ్రమించుతరి మృదుమధుర సంభాషణము లొనర్చుచు భద్రాద్రినుండి యేతెంచు భక్తుని వాంఛలీడేర్పవలయునని రామాజ్ఞ యిదివఱకే యైనదనియు, తనగృహము పావనం బగుగాక యని యిన్నాళ్ళూరకుంటి ననియు, యికతడయుట యుచితముగా కన్పట్టదనియు, తమ మనోగత మెఱింగింప వలయునని దాసుగారి నర్థించెను. లక్ష్మీనరసింహదాసుగారా లయ పరిస్థితుల దైన్యదశను విన్నవింపగా చందూలాలిక ముందట్లు జరుగకుండుగాక యనియు రామదాసుగారి కైం కర్యముల వరుసకు భిన్నము గారాదనియు, నట్టివెల్ల దెల్పుచు నొక నివేదిక నొసంగు మనియు దెల్పెను. మరియు దన గురు డగుట దగిన గౌరవప్రపత్తులు గలుగవలెనని, 'శ్రీరాజా' యను బిరుదనామ మనుగ్రహించెను. రామదాసు కైంకర్య ముల బునరుజ్జీవింప జేయుచున్నాడు గనుక రామదాస నామ మునుగూడ తన్నామమునకు జతపఱచవలయునని కోరెను. ఈ తీరున "శ్రీ రాజా తూము లక్ష్మీనరసింహ రామదాసు" గా నాడే మాఱిపోయెను. రాజు దలంచిన నేది యాగును. భద్రాద్రి శ్రీరామాలయ నిర్వహణమేగాక దాసుగారి తూ దేశముపై భద్రగిరివరదరామదాసుగారి సంతకముతో

శ్రీరామచంద్రమహాప్రభువువారి మొహరుతో నీ పాలవంచ ప్రాంతమెల్ల నడిపించుట కధికారమీాయబడెను. శ్రీదాసుగారు ఖరసంవత్సర ఆషాఢ బహుళ ౧౨ నాటికి భద్రగిరికి విచ్చేసి సవిస్తరము వరదరామదాసుగారికిం దెల్పిన వారును శిరసావహించి కార్యభారము నంగీకరించిరి. కేపటినుండి జరుగవలయు రీతులెల్ల సమగ్రముగ నాజ్ఞాపించుచు ఖర నామ సంవత్సర కార్తీక శుద్ధ నవమీా భానువారమున పెద్దయర్చకుల పేర నొక హుకుము వ్రాసి ఇచ్చిరి. ఆ కాగిత మిప్పటికిని వారివంశీయుల చెంత భద్రముగనున్నది. పైనగల మొహరు, చివరి సంతకము ఫోటో ప్రతులిందు చూడనగును.

నందన సంవత్సర చైత్రశుద్ధ భానువారమున క్రీ. శ 1832 నేత ద్వ్రషయములెల్ల సవిస్తరముగా నుల్లేఖించుచు, రామలక్షణులను పేర రెండు పొడవైన శిలాఫలకములపై నలువైపుల శాసనములు జెక్కించి భద్రుని కభిముఖముగ బ్రతిష్ఠించిరి. నృశింహదాసుగారు తమ భావ మసదృశభక్తి భావతరంగితమై యూగిసలాడ ననేక గద్య పద్య గేయ చూర్ణికాదుల విరచించి ఆయా సమయముల దగిన భక్తశిఖామణులచే బాడించి నత్యోత్సవముల శతాధికరంజనముల నొనర్చి కృతప్రతిజ్ఞు డయ్యెను. నేడు జరుపబడు నుత్సవము లెల్ల వారిచే బునరుద్ధరింపబడినవే. ప్రభుత్వోత్సవమున భక్తిభావ మినుమడించునట్లు కంకంటి పాపరాజు గారి యుత్తరరామాయణము లోని రాముని కొలువుకూటము

వర్ణింపబడిన పద్యముల జతగూర్చెను. ఇట్లే రసవంతములగు రామదాస త్యాగరాజ జయదేవ కృష్ణతరంగ కీర్తనల నాల పింప జేసెను. దాసుగారానాడు మిగుల జనరంజకము లొనర్చిన ప్రభుత్వోత్సవ పవళింపుసేవ లీనాటికినీ ప్రాముఖ్యత గాంచి యొప్పుచున్నవి.

ఈ మహనీయుల పరిపాలనమున ప్రజలు నిజధర్మకర్మపరులై దైవభక్తి పెంపొంద మిక్కిలి సుఖించిరి. వాహనాద్యలంకారములు పురసేవల ప్రకరణములు హెచ్చింపబడెను. గోదావరీ యొడ్డున నిర్మింపబడిన పునర్వసు మండపము వరదరామదాసుగారి దే.

ఇట్లుండ నప్పుడే నందన కఱువని చారిత్రక విఖ్యాతి గన్న మహాక్షామ మత్యంత భీకరముగ నలముకొని జనసందోహమును సంక్షోభింపజేసెను. ఈమహాభక్తయుగళ మించుకేనియు వెనుదీయక పలుచోట్ల పాకశాలలు నిర్మింపజేసి "అన్నమోరామచంద్రా" యని వచ్చువారల కెల్లరకు రామచంద్రు డన్నముపెట్టినా డన్నట్లు సంతృప్తి పఱచిరి. ఆ యన్నము పులుసుకుండము లిప్పటికిని నచ్చటచ్చట గనపట్టును. పలుతావులనుండి కేవలమన్నాతురులై గుంపులు గుంపులుగ వచ్చి యిచ్చోట గొంతకాలముండిరని జెప్పబడుచున్నది.

ఇప్పటి కీ దాసద్వయము సీతాపతి కైంకర్యము లొక రెండు సంవత్సరములే జరిపిరి. ఇంతలో కాలము సర్వ

కృతి నొందినది. వరదరామదాసుగారి రుగ్మత అప్పటి కప్పుడే ప్రబలమై శ్రీరామనామస్మరణముతో సాయుజ్యము నొందెను. నరసింహదాసు విశేషముగ దుఃఖించి ధైర్యమవ లంబించి కార్యనిశ్చయుడయ్యెను. మిత్రుని కొసగిన బాస తప్పరాదని భావించి విజయసంవత్సర భాద్రపద కృష్ణ చతుర్థి సౌమ్యవార మగు నానాడు వైకుంఠప్రయాణమున తోడు రాదలచినవారు రావచ్చునని యూరివారల కెఱింగిం చెను. అనేకులు దాసుగారిని వెంబడించి కొందఱు మన స్ఫూర్తిగను మఱి కొందరు మొగమాటమునకును నీవైకుంఠ యాత్రికులలో జేరిరి. గోదావరి మొన్నలొత్తుకొని పాఱుచు న్నది. వరదరామదాసుగారి శవమునకు విశేషాలంకారము లెన్నియో జేసిరి. భక్తులెల్లరు నూతన వస్త్రములు ధరించి యూర్ధ్వత్రిపుండ్రధారు లగుచు తంబురా చిరుతాళములు చేత ధ్వనింప హరిగానములు చేయుచుండిరి. నృసింహదాసు గారంతకుముందే బెస్తవారల బిలిపించి జాగరూకులై యుండ వలసినదనియు, ఆర్తుడై యఱచినవాని, నొడ్డుకు జేర నాయాస పడువాని తక్షణరక్షణకై సుశిక్షితులైనవా రుండవలయు నని యాజ్ఞాపించిరి. శవమునకు ముందు వెనుక లత్యుత్సాహముతో బెండ్లికిం బోవువారివలె నృశింహదాసు తదనుచరులును శ్రీ రామదాసు పరమపది కీర్తన "తక్లిపోతాము చాలదయ యుంచండి మళ్ళీ జన్మములు లేవు మఱచి పోకండి" యను

దానితోపాటు * "పోయెదమయ్యా వైకుంఠమునకు" అను నరసింహదాసుకీర్తన బాడుచు సెలవు గైకొని, గోదావరి దరికేగి, లతాపుష్పమాలాలంకృతమగు నొక్క పెద్దపడవపై వరదరామదాసుగారి శవమునుంచి చుట్టు నెల్లరు నధిరోహించిరి.

నృసింహదాసుగారెంత జెప్పినను వినక యింకను దనకాయుఃప్రమాణము మిగిలియున్నదని బోధించినను గైకొనక యార్తింగూడి యెడబాటు సైపజాలక తత్సతీమణియు వెంబడించెను. పడవ నడిపింపబడెను.

నదీమధ్యమున ముందుగా వరదరామదాసుగారి శవ

---

* కీర్తన పూర్తిగా నిచట జదువరు లెరుంగ వలెనని వ్రాయబడుచున్నది.

'పోయెదమయ్యా వైకుంఠమునకు బోవుచునున్నాము
శ్రియఃపతిని దలచి భక్తశ్రేణులకు దండములు బెట్టి —॥ పోయెద॥
కాళ్ళకు గజ్జెలు గట్టి కరమున తంబుర బట్టి
మళ్ళీ జన్మము లేనియట్టి మార్గమున రాముని కడకు —॥పోయెద॥
మోదము గోదావరి నాధారముగా జేసికొని
సాధుజనుల వెంబడి మేము సరగునను శ్రీరామునిజూడ —॥పోయెద॥
వాసిగాను వరదరామ దాసు వెంబడి మే
మీ సంసార వాంఛల కోసివేసి సాక్షాద్రాముని జేర —॥పోయెద।
కూరిమి రాముడిచ్చిన భూరి సంపద్వాసితమెల్ల
కోరికలార గ్రమ్మర శ్రీరాముని సన్నిధి జేర్చి —॥పోయెద।
కోరి యీ శరీరముల శౌరి కర్పణము సేయ
శ్రీరామ భక్తులను నారసింహదాసుడు నేనును —॥పోయెద॥

మును బడద్రోసి, నృసింహదాసుగారు తాము ను గుభిల్లున దుమికిరి. వెనువెంట నొకరొకరుగా నందరు నట్లె యొనరించిరి. ఇట్లు నదీగర్భగతులగు పదునెనమండుగురు భక్తులలో దాస యుగళము మరి యైదుగురి శవములు కనుపించలేదట. మిగి లినవారు రక్షింపబడిరట. అట్లు పరమపదమందినవారి వంశీ యుడు శ్రీరంగం శేషావతార మిప్పటికిని స్వామి సన్నిధిలో హరిదాసులలో నొకరుగ నున్నారు. శ్రీనరసింహదాసుగారి భార్య ముమ్మారొడ్డుకు వచ్చి మరల నదిలో ప్రవేశించియు, చివరకు చెట్టునకుం జిక్కుకొనియుండి పతిననుసరింప జాలక పోయెనట. మరికొంతకాలము జీవించి యొక కుమారు దత్తునిగా గొనిరి. తద్వంశీయులీ పురమున గాపురమున్నారు. తూము సీతారామదాసుగా రొక కవియు భక్తుడునై యిచట పేరొందెను. భద్రాచలక్షేత్ర మహాత్మ్యముతో బాటు ననేక కృతులు రచించెను.

భక్తకవిగా పరిగణింపబడిన నీ భద్రగిరివరదరామ దాసుగారే తొలుదొల్త రామదాసు చరిత్రమును రూపొం దించిన మహాశయుడు. రామదాసు కైదుకీర్తనలని ప్రజలలో వ్యాప్తింగన్న వెల్ల గైకొని స్వీయ గద్య పద్య ద్విపదలను తోహర రగడ మొదలగునవి కూర్చి హరికథాగానమున కనుకూలముగ జరిత్రమును వ్రాసెను. మరికొంతకాల మిట జీవించి యుండెనేని భద్రాచలమున ప్రతివ్యక్తియు తత్క థనమున నేర్పరియై వంశానుపూర్వికగా భాగవతు లిట వెలసి

యుండును. ఆ రచన యించుమించు నశిగిపోయి దేశవ్యాప్తము కాలేదు. కాని అందలి కథాంశముల నందికొని కొన్ని మార్పులు కూర్పులు యథోచితముగ నొనరించి, సింగరిదాసను నొక కవి నేటి వాడుకలోనున్న రామదాసచరిత్రము వ్రాసెను.

'రామదాసు కథ వరదరామదాసు
రచించెను సూచనగ,
ప్రేమతోడ సింగరిదా సీకథ
ప్రకటన పరచెను బాగ.'

యని తన గ్రంథాంతమున వ్రాసెను. హరిభజన సింగరిదాసని పేరు వహించిన సీత డీకృతను స్వయముగా పాడి కీర్తిగడించెను. వరదరామదాసుగారి తరువాత సీతడు కొలది కాలముననే జన్మించి యుండునని యూహింపవలసియున్నది.

భాగవత పండితోత్తముడై వెలసి, గులాబిపూవువలె తన భక్తిప్రవృత్తి విలాససౌరభ మొకటిరెండు క్షణములు మాత్రమే యిచట వ్యాపింపజేసి, పరమపదయాత్ర నొనరించిన శ్రీ తూము లక్ష్మీనరసింహదాసు నైనను, బకాయి శిస్తులకు భయపడి ఆత్మహత్య చేసికొనిరని ప్రచార మొనరించిన వారలును గలరట. ఆత్మహత్య లరికట్టగలుగు ప్రభుత్వాధికారు లెటకేగిరో, మహాక్షామము దాపురించిన నొకే సంవత్సరమున విరివిగ నన్నదానము జేసిన యతడు బాకీ యెట్లు పడెనో, ప్రభుత్వమునుండి హుకుములు పొందిన మఱునటి

సంవత్సరపు శిస్తునే బాకీపడుట రాజకీతిజ్ఞున కెట్లు సంభవనో, కల్పవృక్ష మనదగిన మిత్రుకుండ నతనికి లేమి యెక్కడిదో, అటులేమైన యా బాకీని రాబట్టుకొనక ప్రభుత్వమీ దేవస్థానమును నడిపింప మార్గాంతరముల కేలదిగినో, తోడివారందరే యాపదల మునిగి వఱదలపాలైరో పూర్వాపరముల యోజింపరైరి. రాముడొసగిన 'భూరి సంపద్వాంఛిత మెల్ల' రామునికే యొసంగి చనుచున్నామని పాడుకొనుటయు గమనింపరైరి. నిర్హేతుకములగు నిట్టి యారోపణలవల్ల తమ స్వకపోలకల్పితములగుటం బట్టి క్రొత్తదన మాపాదించితి మని సంతోషించిరేమో కాని, నిజము వెలువడినప్పుడపాస్తమగునని తెలియరు కాబోలు.

భారతదేశ పుణ్యక్షేత్రము లన్నిటిం గాలినడకను సంచారమొనర్చుపట్ల శ్రీ నరసింహదాసుగారు దక్షిణదేశమున త్యాగరాజను జగద్విఖ్యాత భక్తకవిని క్రీ. శ. 1822 సంవత్సరమున దర్శించి యిచ్చటి విశేషములం దెల్ప నతండును నొకపరి యిచ్చటకువచ్చి శ్రీరామ సందర్శనానంద పరవశుడై "మోహన రామ, ముఖజిత సోమ" యను కీర్తనను మోహనరాగమున బాడి గుమిగూడిన జనంబులను ముగ్ధుల నొనరించెనని నేటికిని జెప్పికొనుచుందురు.

తూము లక్ష్మీనరసింహదాసు, వరదరామదాసుగార్ల లిఖిత పటములుగాని ఛాయా ప్రతిబింబములుగాని లభ్యము కాజాలకపోవుట శోచనీయము. ఇట వారి స్వల్పజీవితమే

కారణము. ఛాయాగ్రాహక యంత్రరీతులు మారుమూలల నప్పటికి వ్యాపింపలేదు. శ్రీ నృసింహదాసుగారి యీ చరిత్రమైనను వారి సోదరుని మనుమడు శ్రీ సీతారామదాసుగారు (కొడుకుకొడుకు) ద్విపదలో వ్రాసినదానినిబట్టి తెలిసిన విషయములను, వినుకలిచే వృద్ధజనంబు లెరింగించిన విషయములను గూర్చి వ్రాసితిని. శ్రీ నరశింహదాసుగారు క్రీ.శ. 1790 లో జన్మించిరని వారు వ్రాశిరి. వరదరామదాసుగారు మురికినాటి వైదిక బ్రాహ్మణుడని వారు వ్రాసిరి. నృసింహదాసుగారు పరాశర గోత్రజులగు గోలకొండ వ్యాపారులు. సముద్రపుటుప్పును అడవియుసిరికయు నొకచో గూడినట్లిచట భక్తిభావమున వీ రాత్మీయులైరి. వరద రామదాసుగారి భార్య శేషమ్మయు దల్లియు వైకుంఠ యాత్రలో బోయిరి. అప్పటి కారుమాసముల కొడుకు గలుగుటచే పోషింపవలసినదని యాదేశించుటయు పదంపడి నృసింహదాసుగారిభార్య లక్ష్మీదేవమ్మ యా కుమారునిం బెంపనచిరకాలముననే దివంగతుడగుటయు దటస్థించెను. నృసింహదాసుగారికి సంతతిలేమి తత్సతీమణి జ్ఞాతిసుతుని రామదాసును దత్తుగాగొని చాలకాలము జీవించెను. నృసింహదాసుగారి యనంతరము జందూలాలు అయిదూళ్ళు మాత్రము భార్యాత్తుల పోషణకై యొసంగెను. ఈ మహాత్ము లిట నిత్యము సంస్మరింపబడుటచే నమరజీవులైరి.

శ్రీ రాజా చందూలాల్

హైదరాబాదులోని హైందవకుటుంబములలో మహో న్నత గౌరవభాజనమై, రాచమర్యాదల పేరెన్నికగన్నది శ్రీ చందూలాలు వంశము. ఈ వంశమువారెల్ల నైజాం పరిపాలకుల మన్ననలనొంది మిక్కిలి సన్నిహిత సంబంధము కలిగియుండెడివారు. కొలదికాలము క్రిందనే ప్రధానమంత్రి పదవినుండి విరమించి కీర్తిశేషులైన శ్రీ "కిషన్ ప్రసాదు" వీరి దౌహిత్రులును, దానధర్మముల నిడుతేని కీర్తి గన్న వారు, రాజ్యతంత్రజ్ఞులు, విద్యాధికులు, సిరిసంపదలతో తుల దూగిన జాగీరుదార్లు. వీరు మార్గమున బోవునప్పుడిరుప్రక్కల పేదసాదలకు రూకలం బంచిపెట్టుచు యీవిలో నానంద పడుట ఆబాలగోపాల మెఱుంగుదురు.

రెండవ నైజాముగు నిజామలీఖాన్ (క్రీ. శ. 1763–1803) పరిపాలనమునందీ శ్రీరామ దేవస్థానమునకు పరగణాకు బదులీయవలసిన మొత్తము నలువదివేలుగ నిర్ణయింపబడె నని ఒక ప్రభుత్వ విచారణాధికారి 1264 ఫసలీ (క్రీ.శ. 1854) లో వివరించి యుదాహరించి యుండెను. శ్రీ నరసింహ దాసుగారితో జందూలాలు చర్చించి నిర్ణయించుట రెండవ మార్గముం ద్రొక్కినది. ఇది నాల్గవ నైజాము నాసరుద్దౌలా పరిపాలనకాలము నాటి విషయము (1830 ప్రాంతము). పాల వంచ తాలూకా మొత్తము నొసంగుచు పై నలువదివేలలో

100 సిపాయీలను ఒకతోపు రక్షణకుగాను నియమించి అందుకు రు. 8000/- సంవత్సరపు వేతనముగాను, ఆఫీసు సిబ్బంది వ్యయములకు సాలుకు 12500/- రూపాయలున్ను దేవాలయము ఖర్చులకు రు. 18,500/- న్ను నిర్ణయించి రు. 32,000/- ప్రభుత్వమునకు కప్పముగను విధించెను. ఈ విధముగా తాలూకాపై నిర్ణయింపబడిన రు. 71,000/- మొత్తమును వ్యయపెట్టవలసినదని యాజ్ఞాపించెను. శాసనమున నిదే చూడదగును. మరియు నీ దేవస్థానమున కనుబంధముగానున్న నా తాలూకాలోని యితర దేవాలయార్చకుల భృతు లిందే నిరూపించెను. అవి యేవన, నీ గ్రామములోని గోవిందరాజస్వామి, రంగనాయకస్వామి, నృసింహాస్వామి యాలయములుగాక (1) యిప్పటి కాశీవిశ్వనాథస్వామి ఆలయము, (2) పర్ణశాల శ్రీ సీతారామాలయము, (3) మోతె గడ్డపై వీరభద్రస్వామి, (4) విరివెండిలోని వేణుగోపాలస్వామి, (5) రామానుజవరంలోని గోపాలస్వామి, (6) బయ్యావరంలోని శివాలయము, (7) మల్లూరులోని లక్ష్మీనరసింహస్వామి, (8) అందలిదే శివాలయము, (9) మంగపేటలోని శివాలయము, (10) నాగుపల్లిలోని లక్ష్మీనారాయణస్వామి, (11) పాలవంచలోని వెంకటేశ్వరస్వామి, (11) దమ్మపేటలోని వేణుగోపాలస్వామివారి ఆలయములు. ఈ విధముగా శ్రీరామాలయమునకు రు 13400/-అనిన్ని, ఇతరాలయములకు రు 5100/-అనిన్ని స్పష్టీకరించెను. మరియు కల్యాణోత్స

వమునకు తలబ్రాలముత్యములు పట్టుదుకూలములు శాలువలు మొహిరీలు తాను సకాలమున కతి శ్రద్ధాభక్తులతో నంపుచుండెను.

కాని యచిరకాలముననే దాసద్వయ మస్తమింప నీ దేవళము నిర్వహింపగల సమర్థులు తనకు గన్పట్టనందున చందూలాలు తానే యీ బాధ్యత వహించి యర్చకస్వాములనట బిలుపించుకొని యీ నిర్ణీత ద్రవ్యము రు 18,500/– లకు మాత్రము శ్రీ స్వామివారి పేర సనదు వ్రాయించి యిచ్చెను. రసీదు వ్రాయించి యిచ్చి ఖజానాలో నీ ద్రవ్యము పొందుటకును, యిది పాలవంచ లెక్కలలోనుండి అమలు కావలెననియు నాజ్ఞాపించెను. ప్రతి సంవత్సరము కల్యాణసామాగ్రి తానంపుచు గొనిపోవువారిని మార్గమందు తనిఖీనిమిత్తమై యే యుద్యోగస్తులు నిలువరాదని వేఱుగా నాజ్ఞాపత్ర మొసగ, దెచ్చుకొనుచు దేవాలయార్చకస్వాములు దీనిని నిర్వహించిరి. శ్రీ రామచంద్రస్వామి పేర నీ సనదు శ్రీ చందూలాలుచే 1250 హిజ్రీ (1244 ఫసలీకి సరియగు క్రీ. శ. 1835) లో వ్రాయించి యీయబడెను. ఇది ఫారసీ భాషలోగలదు. ఇందు "దర్ ఇవజ్ పర్గణె హాసనాబాద్ ఉరుఫ్ పాల్వంచ సర్కారు ఖమ్మంమెట్" అని కలదు. అనగా ఖమ్మంమెట్టు సర్కారులోని పాల్వంచ యను నామాంతరము గల హాసనాబాదు పరగణాకు ప్రతిబద్ధముగా నని యర్థము. కడపట నిది ఆ పరగణా ఆదాయమున జమా

ఖర్చు చేయబడవలెనని కలదు. దీనిం బట్టి యిది వెనుకటి గాధను స్థిరీకరించియే యీయబడినదని దృష్టాంతర మగు పట్టును. ఈయన వెనుక ప్రభుత్వము వారు 1855 లో నేమి తరువాత క్రీ. శ. 1908 లో నేమి యీయబడుచున్న యీ పెద్ద మొత్తమునకు కారణాంతరము లేమని విచారింప, వారి కెల్ల బరిస్థితు లర్థము జేసికొన్నపిదప దానీషా మొదలుకొని నేటివరకు జరిగిన జరిత్రాంశము లొప్పుకొనక తప్పినదికాదు. అందువల్ల ప్రభుత్వ మేటేట యిచ్చు నీ ద్రవ్యమున కంత రాయ మేర్పడినదికాదు.

ఈ విధముగ 'సనదు' నొసంగి దేవస్థానమును బోషించుచున్నను దీని రక్షణసమస్య ప్రభుత్వముపై నున్నందున చందూలా లేదేని యొక సుస్థిరపద్ధతి నేర్పరుప నాలోచించు చుండెను. కాని కొంతకాల మిట్లే జరిగిపోయెను. తరువాత 1275 హిజ్రీ (1268 ఫసలీ 1859 సం॥న) శ్రీరామచంద్ర అశ్వారావు బహద్దరు గారికి శాశ్వతకవులు పద్ధతిపై నీయబడెను. అదియే పాలవంచ సంస్థానపు సృష్టి. అందు భద్రాచలమునకు నిర్ణయించబడిన మొత్తముపై వారి బాధ్యత స్పష్టీకరింపబడెను. అప్పటికి దమ్మపేటలోని వేణుగోపాల స్వామి యాలయమునకొక రు 500/-లు నిర్ణయించబడుటయు మఱొక రు 340/- కలియుటయు దటస్థించెను. అమరావతీ దేవాలయమున కొక వేయి రూప్యము లీయ నేర్పరచెను. ఇంతియేగాక కల్యాణ సామగ్రులు ఒంటెలపైన ఏనుగులపైన

రావలసియుండి యొకొకప్పుడాలస్యమై సకాలమున కందజాల కుండుట గమనింపబడెను. 1845 లో నిది వెలగట్టి రు 125/- గా తేల్చబడి పై మొత్తమునకు జేర్పబడెను. ఈ విధముగా దేవస్థానమునకు నీయదగిన సంవత్సరపు మొత్తం రు. 19,465/- నైజాము చలామణీ రూపాయలుగ నిర్ణీతమయ్యెను.

పాలవంచ సంస్థానాధీశ్వరులు తమ సంస్థానములోని యీ మహాక్షేత్రమును మిగుల భక్తిశ్రద్ధలతో బోషించుచూ వచ్చిరి. నిర్ణీత ధనముకన్న నెక్కువ వెచ్చించిరి. అనేక వస్తు వాహనములు సమర్పించి వైభవము నినుమడింపజేసిరి. చాల కాలమువఱకు శ్రీరామచంద్రమహాప్రభువువారి ముద్రనే తమ కార్యాలయము లందుపయోగించిరి. కాని కొంత కాలమైన వెనుక సంస్థానోద్యోగులు దేవాలయార్చకసంఘము మధ్య నెట్టి వైషమ్యము లేర్పడెనోగాని ప్రభుత్వమువారి దృష్టికి తేబడినందున ప్రభుత్వమే క్రీ. శ. 1870 సం॥లో దీని నిర్వాహ ణము నందుకొనెను. తదాది పాల్వంచ లెక్కలలో నిది పూర్వోక్త ప్రకారము వ్రాసికొనబడవలసి యున్నను, నిర్ణీత ధనము ద్వాదశభాగములుగా ప్రతిమాసాంతమందు దేవస్థాన మున కొసంగుచు హైద్రాబాదు ప్రభుత్వము స్వీయ పర్య వేక్షణములో బూర్వపు మర్యాదలను నిరభ్యంతరముగ కొన సాగించు చున్నది.

చారిత్రికముగ జూడ క్రీ.శ. 1766 సం॥ లో కంపెనీవా రుత్తరసర్కారులను కవ్రులుకు తీసికొని ప్రవేశించి నప్పటి

నుండి కవులు మొత్తముల లెక్క నొసంగుటయేగాని యెన్నడును మరల నీ జిల్లాలను నైజామధీనము నొసర్చినట్టు కనుపించదు. అయినను శ్రీరామాలయ నిర్వాహణము మాత్రము నాటినుండి నేటివఱకు అవిచ్ఛిన్నముగ నిజాం ప్రభుత్వము పరముగనే నడచినది. 1860 సం. డిశంబరు 26 వ తేదీన బ్రిటిష్ ప్రభుత్వమునకును నైజామువారికిని జరిగిన యొక యొడంబడిక వలన గోదావరి కావల నున్న సర్కారుజిల్లాలు బ్రిటీషువారి కప్పగింపబడినవని తెలియుచున్నది. తరువాత గూడ నీ దేవాలయవిధులు పూర్వపు గౌరవమర్యాదలు వీసర పోవక, హైదరాబాదు ప్రభుత్వమునందే నిలిచి క్రమముగ నడుపబడుచున్నవి. షుమారు 45 సంవత్సరముల క్రిందట రక్షణక్రమభారము (పోలీసు బందోబస్తు) మాత్రము బ్రిటీషు వారియందే నడచి హైదరాబాదు సంబంధము నిలిపివేయబడెను.

అనంతరభక్తులు - దాతలు

మహాభక్తులెందరు నిగూఢముగ వెలయుచుందురో గణింపనలవియుండదు. ఐనను కొన్ని కారణాంతరములవలన కొందరి విషయములు బయట పడుచుండును. క్రీ. శ. 1880 ప్రాంతమున నిచ్చటికి నెల్లూరు ప్రాంతీయులు శ్రీ వెగదీండ్ల రంగారావుగారు తహశీల్దారుగా వచ్చిరట. స్వామికి రవ్వల

దాపిన వైరముడి సమర్పింప నుద్యమించి సిద్ధము చేయించి రట. కాని నడిమిపచ్చ లభ్యముగాక పని నిలిచిపోయెను. కల్యాణోత్సవదినము సమీపించెను. దృఢప్రతిజ్ఞుడై యాయన కల్యాణమునకు రాదలచ లేదట. ఇంతలో మదరాసునుండి యొక వేశ్య వచ్చి తన ప్రేలి యుంగరమును దీసి యిది తమ కీయవలసినదని రామాజ్ఞయైనదని పలికి యీయగా నందలి పచ్చ వైరముడికి సరిపోయెనట. ఆ వైరముడి స్వామి సన్నిధి నలంకారు చున్నది.

ఇట్టే స్వాప్నికదర్శనములు మొదలగు దృష్టాంతములు లెక్కకు మిక్కిలి కలవు. బర్మా పచ్చలహారమనునది, శ్రీ గూడూరు లక్ష్మణరాయ సమర్పిత స్వర్ణపాత్రాదికము, లింకె న్నెన్నియో యిట్టి సంఘటనలచే సంపాదితములు. శ్రీ సోమ రాజు పురుషోత్తమదాసుగారు ముక్కోటి యుత్సవాదులకై యొక పెద్దభూదాన మొనర్చిరి. భక్తులచ్చటచ్చట సమర్పిం చిన భూఖండములు గలవు.

హైదరాబాదులోని జాగీరుదారులగు శ్రీ వరవర నరసింగరావుగారు 1882 సం॥న రాజదర్బారునుబోలిన యొక పెద్ద కట్టడమును 'చిత్రకూటమంటప' మనుపేర గట్టించి యొసంగిరి. వెండివాహనములుగూడ సమర్పించిరి. శ్రీస్వామి వారి చిత్రవిచిత్రాభరణములు వాహనములు తానీషా, అక్కన్న, మాదన్న, రామదాసు మొదలగువారల చిత్రపట ములకు నిది శోభనాలయమై సార్థకనామ మగుచున్నది.

వారి మనుమలు శ్రీ నరిసింగరావు రేటేటా కానుకలు కల్యాణమున కంపుకొనుచుందురు.

శ్రీ నిష్కల ప్రకాశదాసు మహిమాన్వితుడై వెలసెనట. ఈయన భక్తికీర్తనలు తఱచు నిట బాడుచుందురు. శ్రీమాన్ గొట్టుపుళ్ళ శ్రీనివాసాచార్యులు పండితప్రకాండులై ముక్తిని గరతలామలక మొనరించుకొన్న వ్యక్తియని నుడువుదురు. శ్రీమాన్ గొట్టుపుళ్ళ సీతారామానుజాచార్యులు శ్రీ స్వామి వారి ముఖ్యార్చకులలో నొకరై తమ శేముషీవిశేషముచే నశేషభక్తజనులచే గొనియాడబడి యనేక నిర్మాణవిశేషము లం బొందించి యాలయ శోభనాభిలాషియగు మృదుభాషియై ఖ్యాతిశేషు డయ్యెను.

గుంటూరు మండలమున పెదరావూరు వాస్తవ్యులు రంగావఝుల వెంకటసుబ్బయ్యగారను హరిభక్తశిఖామణి కృష్ణాజిల్లా దివికోడూరు గ్రామమున శ్రీ రామదాస హరికథాగాన మొనర్చుచు ప్రజోత్పత్తి సం॥ర, శ్రావణ శుద్ధైకాదశీ సోమవారమునాడు సప్తాహమంటపమున కథామధ్యమున 'రామప్రభో' యని యాలపించి నిశ్చేష్టుడయి యసువులం బాసిరి.

విశ్వదాతయగు శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుపంతులుగారు శ్రీ స్వామివారిని దర్శించినంతమాత్రమున నాథునికి యంత్రజ్యోతి లేకుండుట లోపముగాదోప దామిచ్చుటనే యుండి యంత్రపరికరములం దెప్పించి యాలయావరణాంతర

మెల్ల విద్యుత్కాంతిమంతంబొనరించి ప్రజోపకార మొనర్చి ధన్యులైరి.

జటప్రోలు సంస్థానపురాణీగా రిట కేతెంచినప్పుడు నీటి యిక్కట్టులం జూచి యంత్ర సహాయమున బావినీరు నడిపించు నేర్పాట్ల బూర్తిజేయించిరి. ఉత్సవదినములలో నుపయుక్తమగు చున్నది.

కర్నూలు వాస్తవ్యులు శ్రీ శ్రీనివాసరావుగారు తమ స్థిరచరాస్తులన్నియు నేరికేమియు నీయక మరణశాసనమున ప్రభువునకు దఖలుపఱచిరి. వారిభార్యకు దేవస్థానమువారు రు 15/–లు మాసభృతికారుణ్య మిచ్చుచున్నారు.

7–8 సంవత్సరముల క్రిందట నొక యంధుడు స్వప్నదర్శన ప్రేరితుడై జననీజనకులతో నిటవచ్చి గోదావరిలో మజ్జనమాడి శ్రీ స్వామి దర్శనమున తనకు నేత్రలాభ మొదవి నంతనే గ్రామమెల్ల సంతోషముతో దెరుగుట ప్రతికాముఖమున నందఱెఱింగినదే.

దీర్ఘరోగియగు నొకపోలీసుఉద్యోగి కుమారుడు స్వామి యాజ్ఞయైనదని యిచటవచ్చి ఒకరేయి నిద్రించినంత ఆరోగ్యవంతుడై తిరిగి యిప్పటికినీ సుఖముగనున్నాడు.

అసాధ్యరోగపీడితుడై ఒక యుద్యోగి కుటుంబయుక్తముగ వచ్చి రెండు పర్యాయములు రెండుమండలము లిట తీర్థప్రసాదముల స్వీకరించి సుఖియై తిరిగివెళ్ళి రెండు సంవత్స

రము లగుచున్నది. ఇక్లే భక్తులెందఱో తమ యాపదలను రామసేవనమున బాపుకొనిరి.

పర్వతప్రదేశ మగుట జలాభావమున బాలుచు నిచ్చోట పుష్పములు తులసి కొరతలేకుండ జేయ సంకల్పించి శ్రీ చుండూరు వెంకటరెడ్డిగారు విజయవాడలోని సుప్రసిద్ధ వదాన్యశిరోమణి స్వామివారి తోటలో నధికవ్యయముచే బావిని పునరుద్ధరించినారు. అచిరకాలమున నందనవన ప్రారంభము జరుగగలదు. వీరి యభిమాన మీ క్షేత్రమునందు బాయనిదై యుండగలదు.

వెలమ రామదాసను నొక మహనీయుడు చాలకాలము వటకిట గొప్ప భక్తుడై నివసించి ఆళ్వారు సన్నిధులు ఆండాళ్ళు కోవెలల ప్రతిష్ఠలం జేయించెను. దర్శన సౌలభ్యాతిశయములం బట్టి పలువు రిచ్చోట రామసేవాభిలాషులై కాపుర ముండుచుండుట యనుభవ ప్రసిద్ధము. వేయేల యిచ్చట అర్చకులాది కించిత్సేవకులవరకును అత్యల్ప వేతనము లంగీకరించి శ్రీరామ సేవావిధులలో నుండుట తరతరములనుండి శ్రీరామ సేవకుల మనిపించుకొను భాగ్యము కొఱకే గాని కేవలముదరపోషణకొఱకు గాదని తెలిసినవారికి దోపక పోదు. పరిచారకా గణమెల్ల నొక మహాకుటుంబము వలె నిత్యసంతృప్తులై యానంద మనుభవింతురు.

పర్ణశాల

శ్రీరాముడు స్వయముగా వెలయిచ్చి తెచ్చుకొన్న ఈ సర్వాగ్రహారమునకు శ్రీ రామదాసుగారు నిర్వాహక ముద్ర ధరించి భద్రగిరికి విచ్చేయుట దెలిసికొంటిమి. అటుపై నిచ్చటి యుత్సవ విశేషములనెల్ల క్రమబద్ధ మొనరించుటే కాక వారు తమ యధికార ప్రాంతమున గల కొన్ని ముఖ్య దేవ స్థలములగూడ బెంపొందించిరి. ఒకే విశాలవటవృక్షమున కచ్చటచ్చట దిగిన యూడలవలె భాసిల్లుచు నివి యిచటి మర్యాదలనే యనుకరించు చున్నవి. ఇందు ప్రాధాన్యత వహించినది 'పర్ణశాల' క్షేత్రము.

భద్రాచలమునకు నుత్తరముగ నిరువది రెండు మైళ్లలో 'పర్ణశాల' కలదు. వర్షాకాలమున గోదావరిలో లాంచీల వలననూ, తక్కిన సమయములందు మోటారు సౌకర్యముల వలననూ, పయనించవచ్చును. పర్ణశాలలో నివసించుటం జేసి కదా శ్రీరాముడు పలుమారు లీ భద్రగిరికి రాగలిగెనని యూహించి, భద్రాచల యాత్రాగతులెల్ల మహిమోన్నత మగు పర్ణశాలకు గూడ తరలి యచటి విశేషముల దర్శించి పులకాంకితు లగుచుందురు.

శ్రీ సీతారామలక్ష్మణుల పర్ణశాలా ప్రవేశవృత్తాంతము శ్రీ మద్రామాయణము (వాల్మీకము) అరణ్యకాండ మున 13–14–15 సర్గలలో జెప్పబడి యున్నది. శ్రీవాసు

దాసస్వామివారు (వావిలకొలను సుబ్బారావుగారు) తమ ఆంధ్రవాల్మీకి రామాయణమున యథానువాద మొనరించిన పద్యముల నేనిచట నుదహరింతును. శ్రీరాముడు తనయరణ్య వాసమున గడపటి వర్షమున దండకాటవి నగస్త్య మహర్షిం గాంచి "మహాత్మా! మేమిక నెటువెళ్ళవలయు" నని యడిగి నప్పుడు, పంచవటికిం బొనొప్పునని పలుకుచు, నగస్త్యుడు

రామా! యయ్యది శ్లాఘనీయము, గడున్ రమ్యంబు, గోదావరీ
శ్రీమన్నిమ్నగ దాపు, పండ్లు సుమనో బృందంబు కొల్లల్, ఖగ
స్తోమంబుల్ మృగముల్ మహాద్భుతము గూర్పన్ నిచ్చలే కాంత నిం
తేమోదంబు ఘటించు సీత, కిట కెంతేదూరముం గాదు నూ!

అని శ్లాఘించెను. వారును, దక్షిణముగ నడచి, జటాయువును సందర్శించిరి. పక్షిరాజు తన వంశక్రమమెల్ల నుడివి, దశరథునితో తనకుగల మైత్రి నుగ్గడించి, శ్రీ సీతా రాముల నాప్రాంతమం దుండగోరెను. మఱియు, నిట్లనెను —

కాంతారము దుర్గము దు
ర్దాంతము రక్షోన్వితంబు రామా! మృగయా
స్వాంతమున మీరు చననే
కాంతంబుగనున్న సీత గడిమిం గాంతున్.

శ్రీ సీతారామలక్ష్మణు లాతని ప్రేమకు సంతసించి, కొంతవడి నడచి మనోహరమగు పంచవటీ ప్రదేశమును గన్గొనిరి. శ్రీరాము డిట్లనెను :

సురుచిర పుష్పితతరువై
వరసారస హంసచక్రవాకాన్వితమై

పరమర్షి యోనిఁ గోదా
వరి యిదె కదా రమ్యమగుచు వఱలెడి గంటే!"

ఇప్పటికీ పర్ణశాలవద్ద గోదావరి చూడ ముచ్చటగా నుండును. ఇక పరిసరములు :—

సుందర కందరంబులను, సొంపగు నింపు రహింప, గేకికా
బృంద మమందనాదమున నెల్లెడ నల్లన బాడి కాచి యా
నందము కందళింపఁ, ఘనంబులు భూమిరుహంబు లొప్పగా
దంపడి పర్వతంబులివె దవ్వుగ దాపుగఁ గాక యుండెడిన్.

పెక్కుతావుల బైడియు వెండి గాని
ధాతువుల చేతనొప్పు గాత్రీతలములు
వల్లెల నలంకరించిన వారణముల
చెన్ను రహియించుచున్నవో యన్న! కంటె!

అక్కడక్కడ రంగురంగుల నొప్పుచున్న పిల్లగుట్టలు, అలంకరింపబడిన యేనుగుగున్నలవలె నున్నవని శ్రీరాముడు పల్కెను. చూచువారి కది యిప్పటికిని నిజమే.

గిరులుగ్రహించె నీ తలము గీర్తిమున్ జన్మ పక్షిలోక సుం
దరమును బుణ్యదంబు నిదె దమ్ముడ! పక్షివిభుండు బాసటై
పరగ వసింతమన్న విని పర్ణకుటీరము సద్విలాసమున్
ఖరకరవంశవర్ధనుడు గట్టె సుమిత్రతనూజు డన్నకై.

స్నేహితుడగు జటాయు వండగ నుండ, నిచ్చటనే వసింతమని రాముడు పలికినంతనే, లక్ష్మణుండును పర్ణకుటి నిర్మించెను.

వేల బునాది ద్రవ్వి కదు నేటుగ గోడలు వెట్టి, బొంగురం
బాలను నిల్పి వానిపయి బ్రక్క వెదుళ్ళనుబర్చి, జమ్మివా

సాలుఁ గుదిర్చి నారలను జక్కఁ బిగించియు, బోద ఱెల్లునం
జాలఁగఁ గప్పి దిమ్మెసను సారెకు దంచి సపాటుగా మహిన్.

గోదావరికి బోయి గ్రుంకి సత్వరుఁడయి,
పండ్లు బూవులు దెచ్చి బలియొనర్చి
శాంతి కార్యంబులు సాంతమున్ గావించి
యన్నకు గాన్పించె నాశ్రమంబు.

లక్ష్మణుఁడు వాసయోగ్యముగ నిర్మించి పర్ణశాలను జూపెట్టగా శ్రీ సీతారాము లందు బ్రవేశించిరి. అంత నచిర కాలముననే సీతాపహరణము జరిగెను.

ఈ పర్ణశాల నిర్మింపబడిన స్థలమును, పర్ణశాలనుండి వెలుపలికి వచ్చినప్పటి సీత పాదముల గుర్తులను, యిపుడు జూపెదరు. ఈ ప్రదేశము నలువైపుల గట్టి గోడలచే భద్రము గావింపబడినది. దీని ప్రక్కనే ఆలయము నిర్మింపబడినది. క్రమముగా నొక పల్లె యేర్పడి వృద్ధినొంది 'పర్ణశాల' యను పేరుననే విలసిల్లుచున్నది.

ఆలయమున శ్రీరామలక్ష్మణుల మూర్తులు భూషణ రహితంబులై, జడలు, నారవస్త్రములతో నలరారుచు, నాటి వనవాస దీక్షారూపములఁ దోఁపింపజేయుచున్నవి. సీత గొనిపోబడిన దిక్కగుటనో యేమో దేవులు దక్షిణాభిముఖులై కన్పట్టుచున్నారు. సమీపమున గోదావరియు దక్షిణ వాహిని. ఆగమవిధి ననుసరించి క్షేత్రాధిదైవత మేదిక్కును జూచునో, దానిని తూర్పుగా పరిగణింతురు. అది

'దేవప్రాచి' యనబడు. పూజాదికములెల్ల నీ నియమానుసారమే ప్రవర్తించును. కావున దైవనిరీక్షణ మేవైపుననున్నను ప్రత్యవాయములేదు. ఇచట రాముని శోకరాము డందురు. శోక నివారకుడగుట నట్లు ప్రసిద్ధమైనది. ఆర్తులీ రామునిం బూజించి తమయార్తిం బాపుకొందురు. సీతాపహరణము సూచించుటకు గాబోలు నిట సీతా విగ్రహము వేరుగ జాల చిన్నదిగ నున్నది.

ఈ ప్రదేశమునకు దాపుననే శ్రీ సీతారాముల జల విహార స్థలము కలదు. గోదావరిలో నీరు బురదగ నుండినపు డిచట స్నాన మాడుచుండెడివారట. వారు కూరుచుండిన పెద్ద శిలాస్థలములు మంచి యాసనములుగ శోభిల్లుచు నింపుగ నున్నవి. క్రిందనే నీరు లోతుగ నుండి యొక మడుగువలె నుండును. శ్రీ రామాయణమున నీ మడుగు పద్మసరస్సుగ నభివర్ణింపబడినది. దీనిం గని శ్రీరాముడు,—

'అదిగో ఆదిత్య సంకాశమైన సురభి
గంధి పద్మాళి గొమరయి బంధురముగ
బద్మ సేవితమైనట్టి పద్మ సరసి
దాపునందున్న యది సుమిత్రా తనూజ!'

అని లక్ష్మణునితో పర్ణశాలకు నిర్దిష్టమైన స్థలమును వర్ణించుచు బలికెను. రామాయణకాలము నాటి పంపాసరస్సు తుంగభద్రయై ప్రవహించినట్లు, ఈ పద్మసరస్సు ఒక వాగుగ బాఱుచు గోదావరిం గలియుచు 'సీతవాగు' అని

చెప్పబడుచున్నది. ఈ స్నానఘట్టపు టొడ్డుననే విశాలము లగు చాపు బండలు గలవు. ఇవి విచిత్రమగు గావిరంగు లతో జూచువారికి చీర లారవేసినట్లు గన్పించును. అందుచే నివి 'సీతమ్మవారి చీర' లందురు. ఇచటనే శ్రీ చూర్ణము, పసుపు, కుంకుమ రాళ్లు కలవు. చిన్నచిన్న రాళ్లు వ్రేళ్ళతో మెదిపినంతనే చూర్ణమై ఆయా రంగుల నొసంగును. ఈ చోటు దప్పించిన అట్టివి ఆవాగుననే యికలభింపవు. యాత్రికు లివి మూటగట్టుకొని పోవుచుందురు. శ్రీరాము డిట బహు విధ వృక్షజాతు లున్నట్లు వర్ణించెను. ఇప్ప, మద్ది వృక్షము లెక్కువగ నిప్పుడు కలవు. సీతవాగు వొడ్డున గల మద్దిచె ట్టొకటి చుప్పనాతి సమీపించిన వృక్షమట. దీనిపై రాళ్లు రువ్వుదురు. ఇట్టి రాళ్లు గుట్టవలె పడియున్నవి.

పరిసరారణ్యమున విరివిగ నున్న జింకలు, లేళ్లు నీ సమీపమున నొకటియు గానరాకుండుట మహర్షుల శాప ఫలిత మని జెప్పుకొందురు.

పర్ణశాల కెదురుగ గోదావరి యావలి యొడ్డున 'రథపు గుట్ట' కలదు. దీనిపై రథమును నిలిపి రావణు డిటు లంఘించి పర్ణశాలకు వచ్చె నందురు. ఈ గుట్టపై ఏటవాలుగ నొక మార్గమున రథము నడిపింపబడినట్లు చారలు గన్పించుచు దూరమునుండి భక్తులకు దర్శనీయములుగ నున్నవి. పర్ణశా లకు నాలుగుమైళ్లలో 'దుమ్ముగూడె'మను గ్రామము కలదు. శ్రీరాముడు ఖరాదులగు పదునాల్గువేల రక్కసుల నొక్కడే

యుక్కడిగించుట ఇక్కడనే జరిగెననియు, యుద్ధపు దుమ్మున గట్టబడినదగుటచే దుమ్ముగూడెమయ్యె ననియు జనవాక్యము కలదు. కొంచెము దూరముగ 'లక్ష్మణగుట్ట' యున్నది. ఇందు సీత నుంచి లక్ష్మణుడు జాగరూకత వహించి యుద్ధమును గనజేసెనట. శ్రీ వాసుదాసస్వామివారు ధూమగూడెము దుమ్ముగూడె మయ్యెననియు, జటాయువును శ్రీరాముడు సంస్కార మొనరించిన స్థలమయి యుండవచ్చుననియు 'మందరము'న వ్రాసిరి. ఈ ప్రదేశమునకు మఱికొంత దక్షిణమున 'జటాయుగుట్ట' కలదు. జటాయువు నివసించు పాక 'జటాయుపాక'యే 'ఎటపాక' యను పేరు నొంది గ్రామమయ్యెనని యానుపూర్విగ ప్రసిద్ధమైయున్నది.

రామాయణమునాటి పంచవటి 'నాసిక' వద్దనే కలదని శ్రీ నవీనచంద్రదాసు ఎం. ఏ. గారు వ్రాసిన దానిని విపులముగ విమర్శించి శ్రీ వాసుదాస స్వామివారు తమ యారణ్యకాండ 'మందరము' వ్యాఖ్యానమున ఖండించిరి. వాల్మీకి మహర్షి శ్రీరాముడు 'తపతీ', 'నర్మదా' నదులను గాని, వింధ్యపర్వతములనుగాని దాటినట్లు వ్రాయకపోవుటచే 'నాసిక' వాదము నిరాధార మగుచున్నదనియు, రామాయణమునందలి వర్ణనములంబట్టి గోదావరి యిట దక్షిణముగ ప్రవహించుటయు, సీతారాములు లయోధ్యకు విమానయానమున జనినప్పుడు చూపబడుట కిది యనువుగ నుండుటయు నుదహరించి పర్ణశాల యిచ్చటిదే యని నిరూపించిరి.

అయితే, గోదావరి నిచ్చట దాటినట్లులందు జెప్పబడకుం డుటచే, 'రథపుగుట్ట' సమీపమున నావలియొడ్డుననే పంచ వటి యుండవచ్చుననియు, సమీపమున పెద్ద కొలనుండు టయు వారందు జేర్కొనిరి. గోదావరి యొడ్డు కోసికొని రాగారాగా నచటివారికైపు రాగలుగుటయు నూహ్యామే. ఇప్పటికిగూడ నీ యూరింకను గోదావరి కోతకు పాలగు చున్నది.

స్థల విశేషములు

క్షేత్రాధిదైవతము నింతుక ప్రశంసించి స్థలవిశేషముల బిమ్మట నెఱింగించెదను. సత్యనిరతి, పితృవాక్యపాలనము, ఏకపత్నీవ్రతము, భయత్రాణము, భూతదయ, సజ్జనమైత్రి, సర్వమానవ సౌభ్రాతృత్వము మొదలుగా గల విశ్వజనీన గుణముల నిక్కచ్చిగా ననుష్ఠింప గలిగిన మానవుడు దేవుని వలె బూజింపబడు ననుటకు శ్రీరామచంద్రుడే ప్రథమ నిద ర్శనము. అయిన రాముడన్ననో, నరరూప నారాయణుడు. మానవశాస్త్రజ్ఞు లాదర్శపురుషునిగ గొనియాడినను, మా నవాతీతుడగు పరబ్రహ్మస్వరూపుడు శ్రీరాముడు. ఋక్సామ వేదములలో నతనిందెలుపు ఋక్కులు గలవు. వేదమూర్తి యగు భగవానుడే భూమినవతరింప, వేదములు రామాయణ ముగ ప్రవర్తిల్లినవి. సూర్యవంశమున నవతరింపగల పరమా త్ముని భజించుటకై వసిష్ఠు డిక్ష్వాకుల కంకిత మొనర్చుకొనెను.

యజ్ఞరక్షణము నెపమున శ్రీరామలక్ష్మణుల జెంతజేర్చుకొని ధనుర్వేదాచార్యుడై విశ్వామిత్రుడు లోకకల్యాణకరులకు కల్యాణసంధాయకుడై చరితార్థుడయ్యెను. పరశురాముడు విష్ణు తేజమును సమర్పించుకొనెను. అగస్త్యుడు విష్ణుదేవతాకము లగు చాపఖడ్గాదు లొసంగి కృతార్థుడనైతి ననెను. శ్రీరామ దర్శనమున కంగలార్చుచుకొని యుండి శరభంగాది తపో ధనులు దండకారణ్యమున వసించి, దర్శించి ధన్యులైరి. అన సూయ పసిచెడని యంగరాగముల సీతమ్మ కొసంగెను. రామ కార్యార్థులకు స్వయంప్రభ మహోపకార మొనరించెను. శబరి యాతిథ్యమిచ్చి దేవునారాధించెను. బ్రహ్మవరమున సత్య వాక్ విలసితుడై వాల్మీకిమహర్షి రామాయణ రచన సాగింప విశ్వామిత్రాగస్త్యాది ఋషు లెల్లరు దలకొక రామగాథం జిత్రించి లోకోపకార మొనరించిరి. పరబ్రహ్మ తత్త్వవేత్త యగు పరమశివు డంబికకు రామతత్త్వ ముపదేశించెను. శివ సాయుజ్యులగు శంకరులు ప్రజలకు గర్ణామృతముగ శ్రీరామతత్త్వ మును వేనోళ్ళ నుగ్గడించిరి. తేజోనిధులు, జ్ఞాననిధులు, ననా దిగ నర్చించి సన్నుతించి సేవించి జపించి ముక్తులగుటకుం ద్రోవలు దీర్చుటంజేసి శ్రీరాముడు భారతీయుల చిత్తముల నొత్తుగ హత్తుకొని యున్నాడు. నలువది కోట్ల భారతీయులా రామరాజ్యమునకై కదా నడుములు కట్టుకొని యహరహము శ్రమించుచున్నారు. మేధావులీ బృహత్కథను భాషాంతర ముల దేశాంతర ఖండాంతరములందుగూడ వ్యాప్తినొందించి

జగత్కథగ జేయుచున్నారు. కలముబట్టిన ప్రతి నేర్పరియు నినకుల తిలకుని కులికించక పోలేదు.

హరిహర మంత్రములనుండి మూలికాక్షరముల గ్రహించి జతపఱచి వశిష్టుడు రామనామమును సృష్టించెను. రామ శబ్దము సప్తసంఖ్యా సాంజ్ఞికము (2+5). అర్షసంప్రదాయమున సప్తసంఖ్యకొక విశిష్టస్థానమున్నది. సప్తమ (వైవస్వత) మన్వంతరమున శ్రీ మహావిష్ణువు తన సప్తమావతారమున శ్రీరాముడై సప్తవర్ణకరుడగు సప్తాశ్వుని (సూర్య) వంశమున సప్తమ నక్షత్రము (పునర్వసు) న జన్మించెను. (పంచమ త్రేతాయుగమున చతుర్థపాదమున ముప్పదివేలగుచుండ విళంబిసంవత్సర చైత్రశుక్లనవమీ బుధవారం పునర్వసున శ్రీరామజననము). రవ్యాది సప్తగ్రహముల పేరులం బఱగు దినములతో కాలచక్రము నిర్విరామముగ దిరుగుచున్నది. సప్తజిహ్వుని (అగ్ని) చే సన్నుతింప బడిన సీతను, సప్తతాళ భంజనమున మహావీరుడుగ నెఱుంగబడిన శ్రీరాముని గీర్తించు శ్రీమద్రామాయణము సప్తకాండాంత్మకము. సప్తమహా వీరులు (రామలక్ష్మణ సుగ్రీవ హనుమంత విభీషణ రావణ కుంభకర్ణులు) సప్తదివసములు యుద్ధమొనరించిరి. శ్రీమద్రామాయణ సుందరకాండమును సప్తసర్గపారాయణ మొనరించుట నిహాపరసాధకముగ నెన్నబడుచున్నది. శ్రీరాముడు వనవాసాంతరమున ధాతు సంవత్సర చైత్ర శుద్ధ సప్తమిని పట్టాభిషిక్తుడయ్యెను. ఇంకనూ సప్తఋషులు, సప్తకులపర్వ

తములు, సప్త ద్వీపములు, సప్త సముద్రములు, సప్త ఊర్ధ్వ లోకములు, సప్త అధోలోకములు, సప్త పుణ్యనదులు, సప్త పుణ్యనగరములు, సప్తచిరంజీవులు, సప్త మేఘములు, సప్త మండలములు, సప్త సంతానములు, సప్త జన్మలు, సప్త ధాతువులు, సప్త సభాంగలక్షణములు, సప్త రాజ్యాంగ ములు సప్తవ్యాహృతులు, సప్త ఆవరణలు, సప్త జ్ఞానభూమి కలు, సప్తమాయావస్థలు, సప్తచైతన్యములు, సప్తప్రాణా యామములు, సప్తస్వభావములు, సప్తవ్యసనములు, సప్తస్వర ములు, సప్తశ్రుతులు, సప్తతాళములు నిట్లెన్నియున్నవో పెద్దలకే యెఱుక! గీర్వాణాంధ్ర భాషలు సప్త విభక్తుల నొప్పారుచున్నవి. అనంత మహిమాస్పదమైన నీ రామ నామము తారకనామమై నిరంతరము పల్లీ పట్టణ వీథుల, గాన, మనన, స్మరణా, లేఖన, జప, సంకీర్తనాది గరిష్టతల నొంది వరిష్ట మగుచున్నది.

శ్రీరాముడు నారాయణస్వరూపుడై వెలయుట భద్రాచలమున దప్ప మఱొకచోట లేదని చెప్పుదురు. ఇచట బశ్చిమాభిముఖులై వేంచేసియున్నారు. గోదావరియెదుటనే దక్షిణవాహినియై యనతిదూరమున దూర్పుకు మరలుచున్నది. ఆలయమున మంగళగీతికా సముచిత ప్రబోధోత్సవమున, నుషఃకాలమున మేలుకొలిపి ఉత్సవక్రమముల నారాధింతురు. రాత్రి శయనోత్సవమువఱ కిట్టివి దశవిధారాధనోత్సవములు జరుగును. అనంతరము దేవతలంగాపు వెట్టి సందడిసేయు

వలదని హెచ్చరించి మఱలుదురు. ఇక ప్రవేశమున కెవరి కిని అనుమతి లభింపదు. ఉదయమున జరుగు స్నపనోత్సవ మును పలువురానందించుటయేకాక భక్తులు తమపక్షమున జరిపించుకొందురు. దీనినే అభిషేకోత్సవమందురు. గండకీ నదినుండి శ్రీరామదాసుగారు 54 సాలగ్రామములను గొని వచ్చి రెండు నక్షత్రహారములుగ సంతరించిరి. ఇవి శ్రీరామ లక్ష్మణుల కలంకరించి అభిషేకమొనరింతురు. నిశాముఖమున జరిపింపబడు ప్రభుత్వోత్సవము (దర్బారుసేవ) ను, చివరి పర్యంకోత్సవమును నీ యాలయ ప్రత్యేకతలు. ప్రతి శుక్ర వారమున ప్రభుత్వోత్సవముతో బాటు శృంగార సేవ (బంతులాట) జరుపుదురు. పలువురు స్త్రీలీ సేవం దిలకింప వత్తురు. ఏకాదశి పూర్ణిమా పునర్వసులందు బురసేవలును, ద్వాదశీ అమావాస్య సంక్రమణములందు కోవెలచుట్టు సేవ లును జరుగును.

ఇట్టి పురసేవలలో నుత్సవమూర్తులు ముప్పురను జలువ చప్పరమను నొక సులభ వాహనమున నలంకరించి తిరు వీధి నూరేగింతురు. శంఖచక్ర ఛత్రచామరభేరి మృదంగ పటహా కాహళాది బహుముఖ మంగళ వాద్యములతో డను, వందిమాగధ సంస్తవములతోడను, భూసుర స్వస్తి వాచక పురస్సరముగ నుత్సవ మాలయమునుండి బయలు వెడలి కించిద్దూరమున గల విశ్రాంతి మంటపముం బ్రవేశిం చును. ఇట జక్రవర్తి తనూజుడలసి విశ్రమించుట భావింప

బడును. క్రమ్మఱ బయలుదేఱి వీధిచివర గల గోవిందరాజ స్వామి యాలయము బ్రవేశించును. శ్రీరాముడు తన కాల మున గోవిందరాజస్వామిని గొలుచుటం జేసి యీ దేవుని తాతగారనియు, ప్రజలా కోవెలను తాతగారికోవెల యనియు నందురు. ఈ రెండుస్థలము లందును ఆలయమున దర్శింపజా లని ప్రజలకు శీఘ్రముగ శ్రీరామదర్శన ప్రసాదములు లభించు చున్నవి. మఱలి యాలయమునకు జనునప్పుడు రయమున బోవుటయు భద్రుని కెడమగుట నప్పటికే జాగయ్యె ననియు దలంప బడుచున్నది.

గరుడ, హనుమంత, గజ, అశ్వ, సింహ, హంసవాహ నములు పురసేవకు వెడలునపు డొక యాచారము కలదు. ఇం దొకటి వెడలునపుడు శ్రీరాము డొకడే యధిరోహింప సకల పరిభవము లనుసరించుటయు, సీతాలక్ష్మణు లొక సామాన్య వాహనమున నుపవిష్టులై భక్తులసేవలందికొని మునుముందుగ నడచుటయు, గన్పట్టును. దండకాటవిని లక్ష్మణుడు ముం దుగ దారిసూప, సీతయు నా వెనుక రాముడును చరించుట స్మృతిపథము నంటును. వీరిని దర్శించునప్పుడు తన్మధ్యముగా వెనుకనున్న రామదర్శనమును వెనువెంట నగుచుండును. కానుక సమర్పణములు ముగియును గనుక వాహనస్థిత శ్రీరాముని తడవు దర్శించి స్మరింప ననువగుచున్నది. సార్వభౌమ పరిభవోపేతుడగు రాముని పజ్జనుండ నోల్లక జానకి భక్త

సులభమై ముందు గదలుచున్నదనియు భక్తులు చమత్కరింతురు.

ప్రతి సంవత్సరమును చైత్రమందలి తొలిపక్షమెల్ల శ్రీరామ కల్యాణముమహోత్సవముగ పరిఢవిల్లుచున్నది. అను దినమును రాత్రులందు వివిధ వాహనాలంకారములతోడ తిరువీధిసేవలు గలుగును. పాడ్యమినాడు పంచాంగ శ్రవణము జరుపంబడును. శుద్ధ సప్తమి దివసమున శ్రీ సీతారాముల నవాహ్నిక కల్యాణోత్సవమున కంకురారోపణ జరుగును. మరునాడు ధ్వజారోహణము, నవమినాటి మధ్యాహ్నమున కళ్యాణ మహము ప్రత్యేక మంటపమున నశేషజనసమూహములు జూడ ముచ్చటగ శోభిల్లుచుండును. అసంఖ్యాకముగ వచ్చు తైర్థికకోటికి నది కిరువైపులను వసతులకు బసలు, పందిళ్ళు, మంచినీటిసౌకర్యములు, విద్యుద్దీప్తియు సమకూర్పబడును. శ్రీరామనవమి నాటి ఉదయముననే కళ్యాణమంటపము జనసందోహముచే క్రిక్కిరిసి యుండును. అభిజిన్ముహూర్తమున తలంబ్రాలు వోయుటతో నాటి యుత్సవ ముచ్చట ముగియును. శ్రీరాముడీ నవమినాడే జననమొందెనను, శ్రీరామోత్సవ విధి నియమమునననుసరించి రామునికి జననమునాడే కల్యాణోత్సవము విధింపబడినది. అనంతర దినములందు రథోత్సవము, డోలోత్సవము, తెప్పఉత్సవము దోపు ఉత్సవము, ధ్వజావతరణము, నాకబలి, పుష్పయాగోత్సవము, చక్రతీర్థము మున్నగునవి పాంచరాత్రాగమ సరణి ప్రవర్తిలును.

వైశాఖమున పునర్వసూ నక్షత్రమున చక్రవర్తి తిరుమఘనార్ (శ్రీరాముని) తిరునక్షత్రము, అందే యొక శుభముహూర్తమున పునస్సంధానముజరిగి చైత్రమున నిలిపి వేయబడిన పర్యంకోత్సవ మారంభింపబడును. శుద్ధనవమీ సీతా జయంతి జరుపబడును. ఈ పూర్ణిమకు పంచాహ్నిక విధానమున యెదుట గుట్టపైనున్న నరసింహస్వామికి గల్యాణోత్సవము జరుగును.

జేష్ఠ పూర్ణిమకు సహస్రకలశాభిషేకము త్రయాహ్నికముగ నొనరింతురు. ఆషాఢ పూర్ణిమకు గోవిందరాజస్వామి కల్యాణోత్సవము జరుపుదురు.

శ్రావణ పూర్ణిమకు ముందు శుక్రవారమున లక్ష్మి పూజ జరుగును. స్త్రీలు విశేషముగ పాల్గొందురు. ఆరాత్రి యుత్సవమున దర్శనాగత స్త్రీలకు సీతాదేవి పసపుకుంకుమ వస్త్రాదికము లొసంగును. ఈ పూర్ణిమ అంతముగా పంచాహ్నిక పవిత్రోత్సవము విధివిధానముగ జరుపంబడును. బహుళాష్టమీ రాత్రి శ్రీకృష్ణజన్మోత్సవము సమాచరింపబడును. మరునాడు గోపాలసేవ జరుగును. దీనినే 'ఉట్లసేవ' యందురు. స్వామిసన్నిధి ప్రత్యేకమంటపమున గోపాలురు ఉట్లు గొట్టుదురు. కించిద్దూరమునుండి బాలబాలికలు పంచ రంగుల చిలుకలవలె యలంకరించుకొని సముత్సాహమున జిమ్మడి గొట్టములతో జిటపటధ్వనులతో రంగునీరుగొట్టుచు వినోదింతురు. పురములందుగూడ నిర్దిష్టస్థలముల నిట్లేజరుగును.

ఆశ్వయుజమున దొలిపాడ్యమినుండి శరన్నవ రాత్రో త్సవములు లక్ష్మీపూజలు వైభవముగ జరుగును. మహానవ మినాడివి విశేషముగ జరుగును. విజయదశమినాటి సాయం తనమున శమీపూజ పారువేట జరిపింపబడును. నరక చతు ర్దశీ చంద్రోదయవేళ మంగళస్నపనోత్సవము, నాటి రాత్రి యందు వీథులలో నవనవాలంకృత దీపపంక్తు లుజ్వలములగు చుండ, వివిధ రపరపకార్యములతో బాణసంచాలు ప్రేల్చ బడుచుండ పల్లకీసేవ జరుగును.

కార్తిక శుద్ధ ద్వాదశి క్షీరాబ్ధి మథనద్వాదశి. నాటి రేయి శ్రీరామచంద్రుడు జగన్మోహినిగ నవతరించి. దేవా సురుల కమృతముపంచు విధాన మవలంబింపబడును. దూర దూరములనుండి భక్తులీ క్షీరముల గ్రోలుటకును, నద్వితీయ శోభనాలంకృత గరుడవాహనారూఢుం డగు పగంధాముని జగన్మోహిన్యవతార దర్శనమునకును బజతెంతురు. కృత్తి కతో బజగునేని యీ పూర్ణిమకు కృత్తికా దీపోత్సవ మేకా హ్నికముగ నాచరింతురు. గరుడవాహనాలంకారమున పుర సేవ జరుగును. దీపాలంకార విశేషము లొప్పును. కృత్తిక రానిచో మరుచటి మాసమున జరిగింతురు.

మార్గశిర పుష్యమాసములం దెందు ధనుర్మాసము సంక్రమించునో ధనుర్మాసోత్సవములు ఆండాళ్లు సేవలు జరు గును. అందలి శుద్ధైకాదశి వైకుంఠైకాదశి. తొలి పదిరోజులు దినక్రమమున దశావతారాలంకృతు లొప్పుచుండ అవతా

రక ధనములు, కవిగాయక హరిగాన విశారదుల కదంబకముతో, బహుళోత్సాహముతో నాలయమెల్ల వెల్లివిరియును. శ్రీరామనవమి పిదప నిదియే రెండవ మహోల్లాసోత్సవ కాలము. నదీమార్గమున ననేక నావకోటి సమాజముచే తెంచి యుత్సవముల కానందము సంఘటించును. ఏకాదశి తరువాత రాపత్తు ఉత్సవములు పదిదినములవఱకు పురమున పలుప్రాంతములలో భక్తుల కోరికలపై జరుపంబడును. వైకుంఠైకాదశినాడుషఃకాలమున గరుడవాహనారూఢుండగు పరంధాముని ద్వారదర్శన మైనపిదప నయిదు వాహనములతో గిరిప్రదక్షిణముగ గొప్ప యుత్సవము జరుగును. ఆవల మకరసంక్రమణమునకు తొలిదినమున గోదాకల్యాణమును, సంక్రాంతినాడు రథోత్సవమును జరుగుటయు, సమ్మేళన ద్వారనిరోధ మాచరించుటయు, సమారాధనము లయు బ్రహ్మాంపబడును.

శ్రీరామాలయమున ప్రక్కనే రాజవీధి కావలవైపున శ్రీకాశీవిశ్వనాథునిపేర నొక శివాలయము కలదు. రామదాసుగారు ప్రతిష్ఠించినట్లు జెప్పుదురు. రామలింగేశ్వరుని యభిషేకతీర్థము కానరాకుండ గోదావరిలో గలియును. శివరాత్రికి కళ్యాణోత్సవము జరుగును. దీనికిపైన గుట్టపై శ్రీరంగనాథస్వామి ఆలయ మున్నది. మాఘపూర్ణిమకు పంచాహ్నిక కల్యాణోత్సవ మచ్చట జరుగును. రథసప్తమికి పల్లకిసేవ జరుగును.

ఫాల్గున పూర్ణిమకు శ్రీరామునికి వసంతోత్సవము విశేషవైభవముగ జరిపింపబడును. ఇది ఏకాహ్నికముగ జరుగును. శ్రీరాముడీ దినమున బెండ్లికొడుకగుచుండును. ఈ రేయి మొదలాలయమున నుండక దూరప్రాంతములకు దన పెండ్లికి రావలెనని భక్తుల నాహ్వానించుటకు వెడలునట. ప్రాణాచారముల బడి నిద్రించువారికి స్వప్నముల లక్ష్మణుడట్లు జెప్పెనట ! నేటికిని నట్లే తలంచి ఆపటి మెవరును ప్రాణాచారవిధి నాచరింపరు. ప్రత్యేకమంటపమున డోలాధిరోహణ మొనరించి ఉత్సవమూర్తులకు పెండిలియలంకారము లొనరింతురు. అసలు శ్రీ సీతారాములకు వివాహము జరిగినది సౌమ్యసంవత్సర ఉత్తర ఫల్గునీయుక్త (ఫాల్గుణ) పౌర్ణమినాడే.

ఏర్పడినదైచినట్లు మామూలుగ నున్న నిచ్చోట శ్రీరామనవమి దక్క దక్కిన యుత్సవముల తెలుగు జనానీక మెఱుంగదు. పలువు రిట్లు కోరినందున నింతవట్టు దెలుపవలసి వచ్చినది. శాస్త్రము లెట్లున్నను ఆగమవేత్తల సంప్రదించి తొలుత శ్రీరామదాసుగారు నెలకొల్పిన యుత్సవ విధానములను తూచా తప్పకుండ ననుష్ఠించుట అర్చకులకునూ అనుష్ఠింపజేయుట పాలకవర్గమునకును, విహితమై యొప్పుచు నవిచ్ఛిన్నముగ నాచరింపబడుచున్నవి. చైత్రశుద్ధ మందలి యుత్సవములే యిచ్చటి బ్రహ్మోత్సవములు.

ఆలయమును ప్రదక్షిణించి వచ్చునప్పుడు వెనుకనే భద్రుని కోవెలయు మంటపమును రామదాస నిర్మితములు

కలవు. భద్రమని స్థానమగుట భక్తులు తొలుత నిది దర్శింతురు. అభిముఖముగ శాసన స్తంభములు గలవు. ఆలయ సంస్కృత పండితుడిచ్చో నిత్యము పురాణగోష్ఠి నడుపును. దీనికి వెనుక నే క్రిందుగ నొక రామానుజకూటము గలదు. 'సీతారామ నిరతాన్నదాన సత్ర' మనుపేర భక్తుల ద్రవ్యదానములచే నిట నిరంతర మన్నదానము జరుగుచున్నది. కార్యవర్గమును, లెక్కల తనిఖీలును కలవు. ఆలయముచుట్టు నించుమించు ముప్పది చిన్న దేవళములు విలసిల్లుచున్నవి. లక్ష్మీసన్నిధి యనంబడు తాయారుకోవెల, మంటపములు ప్రసిద్ధములు. పవిత్రోత్సవమంటప మొక భక్తునిచే యిటీవల సరిక్రొత్తగ పునర్నిర్మింప బడినది.

స్థలాంతరమున శ్రీ పమిడిగంటము వెంకటరమణ హరిదాసుగారు నెలకొల్పిన నిరతాన్నదాన సత్రము కలదు. వీ రంబాకృపావిష్టులు. శ్రీ తూము నృసింహదాసుగారి తర్వాత నింతటి మహనీయుడు మరల జన్మింపలేదు. కల్యాణోత్సవమున నజ్ఞాతవ్యక్తు లిరువురే తెంచి భూరిపాక మొనరించి యదృశ్యులగుట నెందఱో యెఱుంగుదురు. అమానుష శక్తికిగాని స్వాధీన పడని యా బలువగు వంటపాత్ర లిప్పుడు కలవు. గణపతి నవరాత్రములు అన్నదానములు భక్తులచే సాగింప బడుచున్నవి.

శ్రీ దేవీభక్తసమాజ మను పేర పట్టణవైశ్యులు కొందఱొకచోట శరన్నవరాత్రములలో దేవీపూజ లత్యంత

భక్త్యుత్సాహములతో వైభవముగ జరుపుదురు. విశ్వబ్రాహ్మణ సంఘమువా రిటీవల నిర్మించిన 'ఈశ్వరీ' ఆలయమున కూడ నిట్టివి జరుగును. ఇవిగాక శ్రీ మందిరమును కుసుమహరనాథాలయము, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, సత్యనారాయణస్వామి ఆలయములు నిచ్చట శోభిల్లుచున్నవి.

నదియొడ్డున కన్యకాపరమేశ్వరీ ధర్మసత్రము గుంటూరు వర్తక సంఘమువారు నిర్మించినది కలదు. యాత్రికులకు బసలకు వసతిగ నుండును. దేవస్థాన సత్రము మరియొకటి, రెండు చిన్న వసతికూటములు నిట గలవు.

భద్రాచలమున కనుబంధ దేవాలయములలో పర్ణశాల తరువాత ముఖ్యస్థలములు, 1. మోతే వీరభద్రస్వామి 2. మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయములు. ఉత్తరముగ నిచటికి మూడుమైళ్ళలో గోదావరీమధ్యమున నొక యెత్తైన గడ్డపై వీరభద్రస్వామి కోవెల యున్నది. మోతే గ్రామమున నుండుటచే నిది మోతెగడ్డ యనంబడును. నదిలో వరద నీరెంతవచ్చినను ఆలయపుమెట్టు నంటదు. ఇది అగస్త్యఋషి ప్రతిష్ఠితమని చెప్పబడును. శివరాత్రికి పెద్ద యుత్సవము జరుగును. ఆటవికు లెక్కువ బాల్గొని మ్రొక్కుబడులు చెల్లింతురు. దీని కింకను నేబదిమైళ్ళుత్తరమున నది కావలనైపున మల్లూరుగ్రామ సమీపమున నొక గుట్టపై లక్ష్మీనరశింహస్వామి ఆలయముకలదు. ఈ గుట్టను హేమాద్రియందురు.

ఆలయమున్న ప్రదేశమున నొకలోయ విశాలమై అడవిమామిడి మొదలగు చెట్లచే మిక్కిలి రమణీయముగను ప్రశాంతముగను శోభిల్లుచు యాత్రికుల ఉత్సవసమయమున నుండుట కనువుగ నుండును. వైశాఖపూర్ణిమకు పదిరోజులిచట కల్యాణోత్సవము జరుపంబడును. ఇచ్చటి బంగారునగలు భద్రాచలముననె భద్రపరుపంబడియుండును. సమయమునకు తగిన వారు కొనితెచ్చి యుత్సవమున నుపయోగింప జేయింతురు. కోవెల చాల పురాతనమైనది. ప్రతాపరుద్రునికాలము నాటి దని చెప్పబడుచున్నది. ఈ లోయలో గుట్టలనుండి యదృశ్యముగ ప్రవహించుచు నొకటిరెండు చోటులమాత్రము ధారగ పడుచు "చింతామణి" యని బిలువంబడు ధారాపాతమే ప్రజలకు జలాధారము. వైశాఖపు టెండకాలమున నియ్యది శరదృతువువలె చల్లదనము గలిగి జనుల కానందము కలిగించును. ఇచట దేనెటీలు ఎక్కువగ నుండును. మధుమక్షికములు నిరంతరాయముగ ప్రవర్తిల్లుచుండును గాని యపరాధములు మాత్రము సైపవు. అవినీతి, అనాచారము, మద్యసేవనము, చింతామణిజలమును నంటువారు దాపట మొదలగు దుష్ప్రవర్తనమేదని గనుపించిన జలమంతర్థానమగుటయేగాక తేనెటీగలు ప్రకోపించి యపరాధుల తుదముట్టించుట గలదు. అందుచే భద్రముగ జాగ్రతగలిగి యుందురు. హెచ్చరికలు చేయడుచుండును. స్వామికి శాంతివిశేషములు గుడపానీయము లొసంగుదురు. ఇచ్చట స్వామివారి

మూలవిగ్రహము ఆరడుగుల యెత్తున ఆకర్షణీయముగ నుం డును. అడవినుండి వెడలి మల్లూరు గ్రామమున పురసేవ జరుపుకొని వచ్చుట యుత్సవదినములందు జరుగును. ఇచటి గుట్టలపై నింకను రమణీయ ప్రదేశములు, బౌద్ధజనమతస్థులు నివసించినగుహలు, గుళ్ళును కలవు.

ఇచటికి మూడుమైళ్ళలో గుండాలవద్ద గోదావరిలో నుష్ణగుండములు కలవు. ఇది యాదిశేషుడు బహుకాలము హోమమొనరించిన స్థలమని బ్రహ్మాండపురాణమున కలదు. భక్తులు నిటవాడి వత్తురు.

ఇంకను నీగ్రామమందేమి, సమీపములందేమి పూర్వ మున మహానుభావు లారాధించిన దేవాలయములు, స్థలములు జ్ఞాతములుగను, నజ్ఞాతములుగను పెక్కు గలవు.

ఏవంవిధ మహిమాన్వితమగు నీభద్రాచల క్షేత్రము నుతిపాత్రమై ఆచంద్రార్కము భక్తజనసేవ్యమై విజయవంత మగు గాత !

శ్రీరామచంద్ర శ్శ్రితపారిజాతః
సమస్త కల్యాణ గుణాభిరామః
సీతా ముఖాంభోరుహ చంచరీకః
నిరంతరం మంగళ మాతనోతు !

శ్రీ భద్రాచల
శ్రీ సీతారామచంద్రస్వామివారి
దేవస్థానమునందలి శిలాశాసనములు

1. రామ స్తంభం

స్వస్తిశ్రీ విజయాభ్యుదయ శాలివాహనశక వర్షంబులు ౧౫౭౪ అగు నేటి వర్తమాన వ్యవహారిక చాంద్రమాన నంద్దననామ సంవత్సర చైత్ర శు ౯ భానువారం శ్రీభద్రాచల సీతారామచంద్ర మహాప్రభువారి సంన్నిధిన శ్రీరామదాసుగారు శ్రీ తానీషాగారి అనుమతం వెంబడిన జరిగించ్చిన దేవబ్రాంహ్మణ వృత్తులు శ్రీవారి సంన్నిధిన జర్గే ఉత్సవ ప్రకరణములు వ్రాశివున్న శాసనం ధంసా ప్రపంచ్చములో శ్రీవారు పోలవరం వలస వెంచ్చేసినప్పుడు వక దుమార్గుడు శాసనం చెక్కివేసి నంద్దున సర్వజనులకు తెలిసి సంత్తోషించ్చేటందుకు లేకపోగా దుర్మార్గుడు పుత్రమిత్ర కళత్రాదుల తోటి నశించ్చిపోయినాడు. తదనంత్తరం శాలివాహనశక వర్షంబ్బులు అగు నేటి ౧౭౫౪ నంద్దననామ సంవత్సర చైత్రశు॥ ౯ ఇందువారం భద్రగిరివర్ద రామదాసు అనె రామదాసుహంశను జన్మించిన భక్త్తుడు కంచ్చి

నగరం నుంచ్చి శ్రీభద్రాద్రికి వచ్చి తనకు తనభార్యాకు గల సకల ఆభరణములు ధనము శ్రీవారికి అర్పణ చెశి ఆయన తల్లి అయిన రంగమ్మ అనె మహా భాగ్యవతి అను మతం వెంబ్బడి ఆత్మకుటుబంత్తో కూడా హరిదాసులై స్త్రీలు సంమ్మార్జన కయింక్కర్యమున్నూ పురుషుడు భజెన మొదలయిన సెవాదులున్నూ జర్గిస్తుండ్డగా శ్రీవారు నాసరుద్దవులా వారి నవాబుగిరిలో చందూలాల్ అనె భగవదంశ సంభూతుడ్కి స్వప్నమంద్దు దర్శనం కృపచెశి వరదరామదాసు రామదాసుగారి హంశ్శ అనిన్ని హసనాబాదు పరగణా శ్రీవారి మొహరుత్తోటి వరదరామదాసు దస్కతుత్తోటి అమలు జరిగించ్చ వలసిందనింన్ని అదివరకు దుర్మాగుణాలు ప్రపంచ్చ పరిపాలన చెసుటచాతను దెవబ్రాహ్మణ వృత్తులు నిరాటంక్కంగా జరుగుటం లెనంద్దున అవి విమర్శగా జరింగిచ్చవలశినదనిన్ని ఆజ్ఞయిచ్చినందున్న చందూలాల్ అనె భగవదంశ సంభూతుడు అతి భక్తియుక్తుడై భగవదాజ్ఞ ప్రకారం దెవబ్రాంహ్మణుల అగ్రహారాలు వృత్తులు రుస్సుంలు నజలుణ మొదలైనవి గ్కా అమాని గ్రామాదులు ౫౯ సరబస్తాలు ౧౧ సాయరున్నూ శివాయ బాపతులత్తో కూడ ౭౧ జెబ్బయివక్క వెయ్యి చలామణీ రూపాయీంల్కు హసనాబాదా పరగణా రకం మొకుపరిశి అంద్కుగా ౩౨ వెలు సర్కారుకు నగదు చెల్లించెలాగున్నను నున్నూ ౧౦౦ జనం శిబ్బంద్దితోపు శ్రీవారి సంన్నిధిలో

తయినాతీ వుండేలాగున్నున్నూ వారికి ౮౦౦౦ వేల రూపాయిలు ప్రతిసంవత్సరం జీతాలు యిచ్చేలాగునను, ౧౮౫౦౦ శ్రీవారికైంకర్యముక్రింద జరిగేటట్టున్ను, ౧౬౫౦౦ సాదరు శిబ్బంది దరబారు వ్రయం నిమిత్తంగాను నిర్ణయం చేశి అమలు వరదరామదాసు పరం చేసినారు. గనుక భగవదనుగ్రహపాత్రుడైనా రాజా తూము లక్ష్మీనరశింహ్వారామదాసున్ను వరదరామదాసున్నూ శ్రీవారి ప్రేరణ వెంబ్బడి హసనాబాదా పరగణాలో వుండ్డె దేవ బ్రాహ్మణ వృత్తులు అగ్రహారములు విమర్శించి సర్వదుంబాలా జగ్గలంద్దుఱకు మొరుపాటు చేశిన వివరం.

శ్రీ వారి అగ్రహారాలు

౧ శ్రీ భద్రాచలం ౧ మల్లూరు ౧ కొత్తగూడెం
౧ నృశింహ్వానగరం ౧ త్రిపుర పంట్ల పేడు

౧ స్థానాచార్లవారు

తిరుమల వెంక్కటరామానుజాచార్లగారు వెంక్కట తాతాచార్లగారు రావిగూడెం ౧ నృశింహ్వాభట్టరు అయ్యావార్లంగారు దండెనము ౧ సర్వజ్ఞభట్టరు అయ్యావార్లంగారు రెగుబిల్లి ౧ కందాళ బంగారురామానుజాచార్లగారు కత్తిగూడెం ౧ అద్దంకి తిరుమల రంగాచార్లగారు పినపల్లి ౧ ధర్మపురి తిరుమల రామానుజాచార్లఅయ్యావార్లంగారు గంద్రగోడ్డంళ్ళపల్లి ౧ తిరుమల వెదాంతాచార్లవారు

విరివెండి ౧ భగవద్భాగవత కయింకర్యపరులు అయ్న అమరవాది చెన్నకృష్ణమాచార్లుగారు దేవరపల్లి ౧ గొట్టి ప్రోళ్ళ బుచ్చయ్యఅచార్లుగారు సింగవరం ౧ శేషం నరసింహాచార్లుగారు రామానుజాచార్లుగారు రామానుజా చార్లుగారు సంగెం ౧ కాండూరి వెంక్కట రామానుజా చార్లుగారు బొర్ర వేముల ౧ శఠగోపం నరశింహాచార్లుగారు కొత్తగూడెం ౧ ముడుంబ నరసయ్యగారు దుమ్ముగూడెం కృష్ణవరం ౧ సామవేదం తిరువెంగళాచార్లుగారు మల్లవరం ౧ అమరవాది రాగయ్యగారు లింగాపురం ౨౧ స్వామి స్వాముల అగ్రహారాలు.

2. బ్రాంహ్మణుల అగ్రహారాలు

౧ అమరావతి అమరేశ్వరస్వామివారికి దత్తేలబోర్న ౧ దుభాష జగ్గయ్య జోశ్శిటికులమేడి కేశవపురం ౧వఝుల సుబ్బయ్యగారు గోగుబాక కృష్ణసాగరము ౧ అంత్రవ్వేది జోగయ్యగారు సీతంమ్మపేట ౧ దేవరకొండ వీరయ్యగారు మడివేరు వీణె నృశింహ్వ దీక్షితులుగారు రామయ్యగారు కొలనుగూడెం ౧ మావిళేటి వెంకటనర్సు మల్లాది సోమన్న అంత్రవేది జోగయ్యగారు నడికుడి ౧ కానూరు లక్ష్మయ్య ముత్తన్నగారు గంగోలు ౧ మావిలేటి యజ్ఞన్నగారు చింతలగూడెం ౧ భీమవరపు రామయ్య సుబ్బయ్యగార్లు సీతారామపురం జగన్నాధపురం ౧ దెహారం పాపయ్యగారు బండారుగూడెం ౧ అనిపెద్ది రామయ్యగారు పట్టెవర్ధనం

సూరయ్యగార్లు పెగళపల్లి తిరుమలాపురం ౧ కొచ్చెను పద్మనాభయోగీశ్వరునిగారు గుళ్ళశింగారం.

3. అవధానపరులు

౧ అవధానుల జగ్గయ్య అన్నవరం బ్రంహ్మచారి మర్రిగూడెం ౧ అల్లం కాళహస్త్రి బ్రాంహ్మణపల్లె ౧ చిలుకూరు శెషయ్య కెశవులు జెములగూడెం కాముని గూడెం తీర్తాల వెంకట్రామన్న మద్దులగూడెం ౧ కొండుభట్ల వెంకటశాస్త్రిలు తోగుగూడెం ౧ శ్రీవారి వకీలు గౌరవరపు నారాయణదాసుకున్నా నారాయణరావుపేట అగ్రహారం నెల ౧కి 30 ముప్పది రూపాయలు పట్టివర్ధనం వెంకటశాస్త్రులు అన్నవరం ౧ మాగంటి సుబ్బయ్య రంగాపురం నరసన్నపాలెం అగ్రహారంలు ౨ గరిమెళ్ళ బాలయ్య మూర్తెయ్య కుమ్మరగూడెం చెవుడుభట్ల గురవయ్య పాముల్లపల్లి చక్రవర్తులు రామానుజాచార్లుగారు ఉప్పుపాక ౧ కేశవపట్నం మల్లాది శెషాచలం సోమయాజి శాయన్న కొయ్యగుట్ట ముగ్గు జోగయ్య రామచంద్రుడు మర్ల సోమన్న మద్దులపల్లి.

4. దేశపాండ్యా గ్రామాలు

భీమవరం సూరవరం గుండాల శెట్టిజేరుపల్లె రఖం ఖ ౧౨॥౦ వరి జొన్నమాన్యాలు రు ౧౦౦కి ౨॥౦ రుస్సుమున్నది శ్రీవారి కైంకర్యార్థం హసనాబాదా పరగణా ***

గ్రామాదులలో పుట్టి యిర్సలు బహుకాలంనుంచి మామూలు జరుగుతూవున్న దేవబ్రాంహ్మణులకు హసనాబాదా పరగణాలో వుండుకున్న యీనాములకు స్న ౧౨౪౧ ఫసలీలో దరియాప్తుచెశి శ్రీవారి మొహరుతోటి స్నదులు యిచ్చివున్న ప్రకారం వరిజొన్న పొలాల యు ఖుం ౧౦౦ ఖండీలు శ్రీవారి కైంకర్యార్థణం సాయరులోను రుస్సులు రు ౧కి ౦౮-అణా చొ॥ అడ్డాదికి మామూలు రు ౧౦౦ – రు ౧౦౦కి ౸ చౌబీనా మామూలు జరుగుతూ వున్నది. బెవారసు అగ్రహారాలు మాన్యాలు శ్రీవారికి చెందవలస్నివి. శ్రీవారి కైంకర్యం నిమిత్తం జగ్రె మాన్యాలు ఖ ౦॥౦ శ్రీ భద్రాచలం తా॥ ౦।౦ రాయినిపేట ౦।౦ చోడవరం ఖం ౧౮౨౫ శీతారామనగరం ఖం ౫౦ బూరగమ్మలపాడు ఖం ౦।౦ శీతారామనగరం ఖం ౦।౦ వెలేరు ఖ ౦౮౨॥ దంత్తెలబోర ఖ॥ ౦॥౦ పాలవంచ తా॥ వరి ఆబి ఖం ౸ పెదనెల్లిపాక తా॥ ఖం ౨॥౦ ఆబివరి ౨॥౦ తాబీ వరి ౨।॥౦ తా॥ రామాంజవరం ఖం ౨ వరి యు ఖుం ఆబితాబి ౦।॥౦ జొన్నమాన్యం ౩ తా॥ మల్లూరు ఖ ౦॥౦ రాజుపేట ౦।౦ తొండిపాక అమరవరం ౦॥౦ తొండిపాక జొన్నపొలం కాజివారిది మొాతే ౧ కాశ్యాం ద్విజానాం సహస్రం భోజయిత్వాతు యత్ఫలం। తత్ఫలం భద్రశిఖరే ద్విజస్యైకస్యభోజనాత్॥ చెన్నపట్నం కాపురస్తుడయ్ని నాగెండ్ల శెషాచెలం అనె పరమభక్తుడి ధర్మం సన్నిధిలో అభివృద్ధి సదా అగుగాక॥

శ్రీ లక్ష్మణ స్తంభం

శ్రీ వారి వుత్సవములు ఆరగింపులు మొదలయినవి యీ క్రింది ప్రకారం భక్తియుక్తంగా పూర్వాక్రమంగా భగవదాజ్ఞ వెంబ్బడి జరిగించ్చ్బనయినది.

౧ ప్రబోధశావ ౨ దంతధావనశావ ౩ తిరుమంజనశావ ౪ కృతకర్మఫలోత్సవశావ ౫ బాలలీలామహోత్సవశావ ౬ జగత్స్వరూపోత్సవశావ ౭ ప్రకాశవుత్సవశావ ౮ ప్రభుత్వాశావ ౯ మహారాజశావ ౧౦ పర్యంకశాన-యివి నిరంత్తర వుత్సవములు.

బాలభోగమునకు దశవిధముల ఆరగింపులు

౧ ఘృతపొంగలి ౨ పెకరపొంగలి ౩ పొంగలి ౪ పులిహోర ౫ దధ్యోదనం ౬ ఖజ్జకాయలు ౭ తిరువసం ౮ దోశలు ౯ తేనెతొలలు ౧౦ ఎర్ర తైరుప్రసాదం ౧౧ పూర్ణ తళిహాక్కుప్రసాదం ఖం ౦౮౩ దధిఘృతసూప సమూప్పతంగా నునూన్న చుట్టుకో వెలలకు అనే మిషచాత అచరకజీవనాధరం రోజు ౧కి ఖ ౦౮౨ బియ్యాం పాళ్లు ౪౦ కి నలుభై యింట్కి రామసత్రములో బ్రాంహ్మణ భోజ్నం నిమిత్తం ఖ ౦౮౧౮ బియ్యాం దానికి దగిన రసవగారాలు నిరంతరం జరుగుతూ వుండే నిర్ణయం హరిదాసులకు అక్షయ పాత్రలకు శేర తొమ్మిది శేలర బియ్యాం.

౯. నిరంత్తర మాసోత్సవములు

౧ పౌర్ణమి గిరిప్రదక్షిణోత్సవం ౨ శుక్రవారం బంతు

లాట వుత్సవం ౩ పునర్వసుమంటప వుత్సవం ౪ యేకాదశి తూర్పుమంటపంలోకి తిరువీధి వేంచేపు ౫ అమావాశ్య కోవెల వుత్సవం ౬ సంక్రమణములు. క్రమంగా సంవత్సరోత్సవములున్నా.

౧ చైత్రమాసంలో తిరు కల్యాణమహోత్సవం బ్రాహ్మణ భోజనం సదావర్తులు ౨ వైశాఖమాసంలో నృశింహస్వామి కల్యాణోత్సవము శ్రీవారి పౌర్ణమిరోజు పురప్రదక్షణంగా వేంచేపు ౩ జ్యేష్టమాసములో జ్యేష్టాభిషేక ఉత్సవము ౪ ఆషాఢశు ౧౫ లు పురప్రదక్షిణంగా రామదాసు మండపం రంగమంట్లపం మీదుగాను ౬ శ్రావణ మాసములో గోకులాష్టమి వుట్ల పండుగ అమ్మవార్ల వారి నోముల శుక్రవారంకు ౧౦౦౦ రవికెలు ౭ ఆశ్వయుజ మాసంలో దసరావుత్సవము ౮ కార్తీకమాసంలో దీపోత్సవం పదిరోజులు జగన్మోహనావతారం పురప్రదక్షిణ ౯ మార్గశిర పుష్యమాసములు ధనుర్మాసం అధ్యయన వుత్సవములు ౧౧ మాఘమాసం సహస్ర ఘటాభిషేక వుత్సవం ౧౨ ఫాల్గుణ మాసంలో డోలోత్సవం సంవత్సరాదికి పెండ్లికుమారుణ్ణి శాయటం యీ ప్రకారం ఉత్సవములు యథావిధిగా జరిగించవలసినది.

అశ్వారావువారు రు ౫౦౦ దేశపాండ్యాలు రు ౧౫౦ హుజూరు చంద్దులాల్‌గారు రు ౨౦౦ వుజాగరు చంద్దుగారు ౩౦౦ రాజేశ్వరరావుగారు ౨౫౦ జరిగించే మరియాదవున్నది

హరిదాసులు శబ్బీలమూలంగా ఆర్జించి తెచ్చి సమర్పించుట కలదు. ఇంకా భగవదానుగ్రహంగలవారు సమర్పించడం గలదు. యిది అంతా చయిత్రమాసంలో అన్నదానం సదావర్తి వినియోగం కాయవలసినది. వుత్సవములో శ్రీవారి సన్నిధిని వచ్చే పాదకానుకలు ఆవరణములో యేమి వచ్చినా అర్చకులు నలుగైపాళ్ళువారిదిగాని స్వామి కైంకర్యంలోకి తేవలసిన పనిలేదు. శ్రీవారి సంన్నిధిలో యావద్వ్యవహారములకు అర్చకుల హరిదాసుల స్వతంత్రంగాని దేశముఖి దేశపాండ్యాలకు యెంతమాత్రం స్వతంత్రంలేదు. శేవకు కైంకర్యమునకు అందరు స్వతంత్రులుగాన తెలిసేది. ఖజానా కాపాడేటి దేవస్తలముకు నాలుగు భాగములా పహారాలు వుండవలసినది. సన్నిధి అయిదుగురు వెండిబెత్తాలవారుండేది. సవారి బయలు తెరిసినప్పుడు యెక్కడెక్కడ పహారాలు వుంచవలసినది. సదా జాగ్రతగా వుండవలసిన స్తళంగనక యెమరశి వుండకూడదు. భద్రగిరి వరదరామదాసుకు తూము లక్ష్మీనరసింహ వరదరామదాసుగారి నాటి మామూలు వెంబడి స్వామి ఆజ్ఞ వెంబడి స్తలానికి కయింకర్యవుద్ధారకులు అయినందున్ను అర్చకభాగమున్నూ పెద్ద అర్చకత్వము కృప చేశినారు. వీరి పరంపరదాససంతతి జర్గగలదు. శ్రీవారి దివ్యాభరణములు దివ్యాలంకారంలు భవ్యాలంకారం నవ్యాలంకారంకుగాని నియమించి వున్నవి గనక యిందులో ద్రవ్యం హరించినవారు వంశనాశనం కాగలరు. యీ శాసనంలో

వ్రాశివున్న ప్రకారము దేవబ్రాంహ్మణ వృత్తులున్నూ
వుత్సవాదులున్నూ శ్రద్ధగా జరిగించినవారికి

అపత్యం ద్రవిణం దారాహార హర్మ్య హయా గజాః।
సుఖాని స్వర్గమోక్షౌచ నహూరె రామభక్తితః॥

శ్రీవారి సంన్నిధిలోవుండే గుఱ్రాలు ౫ యేనుగులు ౨ దర్శన
ధేనువ ౧ సత్రపుయగ్లు ౨ పుష్పాలతోటలు ౫ కలవు.
యీ స్తళంలో నిర్ణయంగ్గా ఉండ్డే పరిచారకజనం —

౧ నవుబతుఖానా, ౧ జయరాంభేరి, ౧ తాషామర్ఫ
౧ అలుగోజాలు ౧ ఢంకా ౧ నగారా ౪ హరిదాసులు,
౫ గుమాస్తాలు ౧ హైదరాబాదు వకీలు ౬ హధ్యాపకులు
౬ తీర్తస్వయంపాకులు ౨ తిరుపణియారములు చేశేవారు
౧ పిండి రుబ్బేవారు ౪ సీతారామసత్రములో వంట్లబ్రా
హ్మలు సిళ్లబ్రాహ్మలు ౧౫ తోమాలలుకట్టే చాతానులు
౧ కుంభార్తికట్టే చాతాని ౧౬ కుంచుతాలవారు ౧౦ బిళ్లల
వారు ౨ తెలగబంట్రోతులు ౪ వెలంవారు ౩ కొత్వాళ్లు
౪ ఘడియార్పీలు ౧ పాలుకాచేవారు ౨ చోఫుదార్లు
౨ సమ్మార్జనపరులు ౫ కీర్తనలుపాడేవారు ౨ చవ్వరిలు
వెశేవారు ౨ సుతారులు ౨ వడ్లవాండ్లు ౪ యేనుగులమావం
తులు ౯ కమాటీలు గుజ్జాలసఫయి ౯ వంటసామానుకో
ట్వాలు ౩ భోగంమేళం ౪ వోడకారీలు ౮ భోయీలు
౧ తిరుచునార్ణాలు పట్టేవారు ౧ కనార్ణబిలు ౨ హరణలాలు

౮ గలందాజులు ౨ ఫరాషులు ౨ తప్పేలాలుతోమె ౨ సత్రప్పు దాసీలు ౨ టప్పాజవానులు ౮ మషాల్చీలు. గల్లా జీతాల వారికి సాలు ౧కి ౧౨౦ ఖండీలు ౬౦౦ నగదు రూపాయిలు యీ మట్టుకు సన్నిధి అర్చకుల భాగాలు ౮౦.

శ్రీమదఖిలాండకోటిబ్రహ్మాండనాయకులయిన శ్రీభద్రాచల సీతారామచంద్ర మహాప్రభువ్వారికి ఆజ్ఞాధారులయిన రాజా తూము లక్ష్మీనృశింహ్వారామదాసు నిరాచ్ఛేదంగా దేవబ్రాంహ్మణ వృత్తులు పునరోద్ధారం చేసి తామలక్షణులు అనే స్తంభములమీద శాసనములుగా వ్రాయించిరి. సర్వజనులు ధర్మం యందు దృష్టివుంచి తెలుసుకొన వలశినది యీ ధర్మం జరిగించ్చినవారు.

శతపూర్వేషాం శతాపరేషాం పురుషాణా మనంత కల్పకోటి విష్ణులోక ప్రాప్తిన్ని శాశ్వితయశస్సున్నూ పొంద గలరు. బందగాని ఆలినారి ఆలి దరబారు క్షేమంకోరె ముసలుమానులు యిందుకు విరోధం శాయబోరు హింద్దూ కులస్తులు దేవబ్రాంహ్మణుల యంద్దున అతిశయభక్తి జర్పి వంశాభివృద్ధిని పొందగలరు. హసనాబాదా పరాగణాలో వున్న దేవబ్రాంహ్మణ అగ్రహారములు యీనాములు అంచనా చూపించినవారు. కంచరగాడిద కడుపున పుట్టగలరని ప్రమాణం పూర్వపుశాసన స్తంభం మీద వున్నది.

గోవులకును బ్రాంహ్మణులకు దేవతలకు - నెల్లప్పొద్దు

తెంపున కీర్తిగావించు పాపమానస మేవిధమున బుట్టకుండయే వాంఛింతును.

యేభూమిపాస్సతత ముజ్వల ధర్మచింత్తాః
మద్వంశజాః పరమపాపతి వంశజావా
మద్ధర్మమేవ సతతం పరిపాలయంతి
తత్పాదుకద్వయ మహం శిరసా వహామి॥

గిరిప్రదక్షిణ ఫలం — భూప్రదక్షిణత్రయ ఫలం
పురప్రదక్షిణ ఫలం — జగత్రయ ప్రదక్షిణ ఫలం
హరిప్రదక్షిణ ఫలం — అమితం.

శ్రీ శ్రీ శ్రీ

ఈ శాసనమున రామదాసుగారు వ్రాయించిన శాసన స్తంభముల కాలము శా.శ. 1574 (క్రీ.శ. 1652) అని యున్నది. రామదాసు తానీషాల కాలము 1652–1687 అని కొందరు భావించిరి. కాని కృష్ణాజిల్లా చరిత్రకారు లేమి, యితరులేమి, తానీషా 1669 లో రాజ్యమునకు వచ్చినట్లు తెలిపి యున్నారు. తానీషాయే రామదాసుగారికీ ప్రాంతాధికార మిచ్చినట్లును రూఢిపరచిరి. కనుక రామదాసుగారి కాలము 1670–1687 అనియే స్థిర పరిచితిని.



రామదాసు ముద్రిక

అనుబంధము — 2.

శ్రీ భక్త రాజా వరదరామదాసుగారి చేవ్రాలు గల హుకుం

శ్రీభద్రాచల
రామచంద్ర
మహాప్రభువు
వారు

శ్రీమదఖిలాండకోటి బ్రహ్మాండనాయకులయిన్న శ్రీ భద్రాచల సీతారామచంద్ర మహాప్రభ్వువారి ఆజ్ఞాధారకులయిన మహారాజశ్రీ రాజా తూము నరసింహ్వా రామదాసుగారి దాసానుదాసుడు భద్రగిరి వరదరామదాసు శ్రీ మహాప్రభ్వువారి సన్నిధిలో పెద్ద అర్చకులయిన్న శ్రీమాన్ అమరవాది చన్నకృష్ణమాచార్యులుగారికి వ్రాయించ్చిన హుకుం.

౧ ప్రబోధశేవకు లోగా బీగముద్రలు తియ్యగానే పెద్ద అర్చకుడు సర్కారు తరఫు దారోగా హరిదాసులు వంతు అర్చకుడు వీరు యేకాంత్త గృహములోకి వెళ్లి శ్రీ మహాప్రభ్వువారి విభవం సేవించి శ్రీ పాదముల యంద్దు వుండ్డే హలకులిశాది రేఖలు వుండ్డ చూచుకోవలసినది. అయిద వారు రాజస్తానం గన్కు యుక్తమయినవారికి శెలవు ప్రకారము సేవ లభింప్ప చేశేది.

౧ ప్రబోధశేవ యధావిధిగా జరుగుతూ వున్నది

సరికదా సేవవేళ్లకు ఛత్రచామరములు శిధముగా వుండవల సినది. యేనుగ పెద్దగుజ్జము కోవెలదగ్గర ఉంచవలసినది. ఢంకా నిమిత్తం లేదు. ప్రబోధసేవలో వకపళ్లెములో దువ్వెన కాటుకకాయ అద్దము యివి వుంచ్చి సన్నిధిలో వుంచ్చ వలసినది.

౧ బాలభోగము యధావిధిగ జరుగుతూయున్నది. సరే ప్రభ్వువారి యత్రతైరుప్రసాదము ఘృతపొంగ్గలి షర్కర పొంగ్గలీ అరసోల–సోల తిరువసందోశెలు యివి ఆరగింప్పు కావలసినది. దోశెలమీాద వెన్నవుంచి వెండిపళ్లెంతోటి ఆర గింప్పు కావలసినది.

౧ మున్నువుంన్న గింన్నెలలో పెద్దగింన్నెగా విచా రించి షర్కర ప్పొంగలి వుంచ్చవలశినది.

౨ పెద్దగిన్నెలు రెంట్టిలో యెత్రతైరుప్రసాదము ఘృత పొంగ్గలి వుంచవలశినది.

౧ నరశింగ్గరావుగారు చేయించ్చవలశిన వెండ్డిగిన్నె చే యించిరా సరే లేదా రు ౮౦ యనభైరూపాయలకు వక గింన్నె జరూరుగా చేయిుచ్చి తిరువీసము వుంచ్చేది.

౧ సత్రములో వుండ్డే వెండిపళ్లెం తెప్పించి దోశెలు వుంచ్చేది.

౪ యీా ప్రకారము జరిగించ్చేది.

౧ నాయకతళిహా తదియ్యారాధన యథావిధి జర్గించ వలసినది.

౧ ప్రకాశోత్సవమువరకున్ను యేకాంత్తమున్ను అమ్మ వారు శేవచేసేకాలము గనుక బాదామిఫలముల పప్పు ఖండ షక్కర తు 3 ఆరగింపు చాయవలశినది. బంగ్గారు గిన్నెల తోటి చామరకైంకర్యము నిశ్శబ్దముగా జరిగించ్చవలశినది వంతు అర్చకున్ను హరిదాసు పెద్దఅర్చకుడు దాసుగా వుండ్డి స్థానాచార్యులు—అధికారి యింక్కా వకరు యవరయినా శేవించ్చతగును.

౧ ప్రభుత్వశేవ యధావిధిగ జరగటములో వెండి కలం దాను బంగ్గారు కలం సిరాబుడ్డి సనేరి కాగిదం బంగ్గారు మొహరు చక్కును యివి సంన్నిధిలో పీట వుంచవలశినది. ఇది నిరంత్తరం మరియాదా.

౧ యేనుగలు గుఱ్ఱాలు రా బనిలేదు కానీ — యేనుగు గుఱ్ఱము సాయంత్తరమందు శేవాకాలము యధావిధిగా మర్యాదవెంబడిని శేవలు జరిగించ్చవలశినది.

౧ యేకాంత్తశేవలు కట్టువెంబడిని శేవచేశి భయం కలిగి బయటికివచ్చి వంత్తు అర్చకుని తాళం వకటి స్వత్ర మర్చ్చకుని మరుతాళం వకటి బీగముద్రలు వేశి సర్కారు తాళం పెద్ద అర్చకునివద్దనయినా దాసుగావద్దనయినా వుంచ్చేది. వుదయాత్పూర్వమే యధావిధిగా వెల్లి హాజరువుండి యధావిధిగా జరిగించేది.

౧ శుక్రవారము యేకాదశులు అమావాస్యలు పౌర్ణవ

ములు మొదలయిన్ని కోవెల వుత్సవములకు పది విలాయిలు వేయించ్చి మూడు ప్రదక్షిణములు — వక ప్రదక్షిణం హరి దాసులు నృత్యం — వక ప్రదక్షిణం భోగమువాండ్ల నృత్యం వక ప్రదక్షిణం సకల విభవములతోటి హెచ్చరికలతోటి మందిరము ప్రవేశించ్చవలశినది.

౧ పునర్వసు వుత్సవము యథావిధిగా జరిగించవలశినది.

౧ తిరునక్షత్రములు మొదలయినవి యథావిధిగా జరిగించవలెను.

౧ అధ్యయనోత్సవములకు గోవిందరాజుల కోవెల దగ్గిర కోటా వేయించేది. పునర్వసు మంటపముదగ్గర కోటా వేయించేది. కోవెలలో కోటా వేయించ్చేది. చుట్టూ మోకాటి యెత్తుగోడ పెట్టించ్చి ద్వాదశి మంటపం మీదినుంచ్చి జన పడకుండా కటకటా కట్టించేది. విస్తారము పందిరి వేయించి మధ్య శింహాసనం వేయించి నాలుగు స్తంభాలు కట్టి శృంగారం చేస్తే ముక్కోటి యేకాదశినాడు వుదయాత్పూర్వం అక్కడికి వేంచేశి బాలభోగము వేళ్ళకు తిరిగి కోవెలలో ప్రవేశించేటట్టు మర్యాదచేశేది. నిరంత్తరం వుదయకాల వుత్సవము పదిరోజులు పునర్వసు మంట్టపములోనే రాత్రి వుత్సవము పదిరోజులు గోవింద్దరాజుల కోవెలలో కాగా నిర్ణయించేది. రేపుమాపు వుత్సవములుగాక కోవెలశేవలు వేరే జాగ్రత చేశేది. యిది వక కటాదిట్టము.

౧ దశెహరా వుత్సవములు యధావిధాగా మామూలు ప్రకారము.

౧ తిరుకల్యాణ వుత్సవము డోలావుత్సవము సహస్ర ఘటాభిషేకము యధావిధిగ జరుగగలందులకు సహస్ర ఘటాభిషేకమునకు గావలశిన యాగద్రవ్యము తప్సీలు వ్రాయించ్చి వుంచ్చేది.

౧ అధ్యయనోత్సవములలో వచ్చిన యావజ్జనానికి సత్రములో అన్నాయదికములు, భోజనము పెట్టించ్చేది. సన్నిధిలో నైదేశికులలో పదిమాన్కాలు యక్కువచేశేది. తళిహ మామూలు ప్రకారము ఏమి విశేషము వుండేదో ఆ ప్రకారము జాగ్రతచేశేది. నాయక తళిహ యిద్దున్నిరస (౧౦౦ శేర్లు) ఆ దినములలోకూడా చేశేది.

౧ తెల్లవస్త్రములు కి నుమాసినవి ధరియింపవద్దు. స్వామివార్లకి కట్టినబట్టలు తిర్గి స్వామివారికి ధరియించవద్దు. జాగ్రత్త.

౧౬ పదహారు నెంబర్లలో వ్రాయించిన పద్ధతులు పూరాగా ఆకలింపులోకి తెచ్చుకొని యేయే కాలములో జర్గే కైంకర్యములు యెడల లోపం రాకుండా జర్గింస్తువుండ్ల వలసినది.

ఖరనామ సంవత్సర కార్తీక శు ౯ ఆదివారం.

(ద)॥ భద్రగిరి వరద రామదాసు - అని వున్నది.

అనుబంధం — 3

కొన్ని ముఖ్య తేదీలు:

1626 — అక్కన్నమాదన్నలు పాలవంచ హసనాబాదు పరగణాలకు మనసబు పొందుట.

1669 — గోలుకొండ నవాబు అబ్దుల్లా మరణింప తానీషా నవాబగుట.

1670 — రామదాసు(గోపన్న) పరగణాఅధికారిగా వచ్చుట.

1674 — రామదాసు ఆలయనిర్మాణముచేసి జైలుకు వెళ్లుట.

1686 — జైలునుంచి రామదాసు విడుదల అగుట.

1687 — తానీషా ఔరంగజేబుచే పట్టుబడుట.

1724 — నిజాముల ముల్కు మొదటి నైజాముగా హైదరాబాదు వచ్చుట.

1748 — నిజాముల ముల్కు మరణించుట, నాసరుజంగు రాజగుట.

1750 — నాసరుజంగు మరణించుట, ముజఫ్ఫరుజంగు రాజగుట.

1751 — ముజఫ్ఫరుజంగు మరణించుట, సలాబతుజంగు రాజగుట.

1763 — నిజామలీ రెండవ నైజాముగా సుస్థిరుడగుట.

1766 — ఇంగ్లీషు కంపెనీవారు ఉత్తర సర్కారులను కవుటకు తీసికొనుట.

1769 — ధంసాపాలన, దురాక్రమణలు.

1769 — భద్రాచలం ఉత్సవ మూర్తులు పోలవరం వలస వేంచేయుట

1775 — పోలవరం వలసనుంచి తిరిగి భద్రాచలం వేంచేయుట

1776 — మరల కమలాపురం (బస్తరులో) వలస వేంచేయుట

1782 — ధంసా మరణించుట.

1785 — శ్రీ స్వామివారిని తిరిగి భద్రాచలమున అర్చా రావులు ప్రతిష్ఠించుట.

1789 — నిజామలీ (దివనవాబు) దేవాలయ భృతి రు 40,000 నలభై వేలుగా నిర్ణయించుట.

1803 — నిజామలీ మరణించి సికిందరుజాః రాజగుట.

1829 — సికిందరుజాః మరణించి నాసరుద్దవులా రాజగుట.

1831 — తూము లక్ష్మీ నరసింహదాసు చందూలాలమంత్రి వద్దనుంచి అధికారమును పొందుట.

1790 తూము నరసింహదాసుగారి జననం.

1822 ,, దక్షిణయాత్ర చేయుచు త్యాగరాజుగారిని కలుసుకొని భద్రాచలమున కాహ్వానించుట.

1832 — శాసన స్తంభముల ప్రతిష్ఠ — నందన కరువు.

1833 — వరద రామదాసు నృసింహదాసు ఆదిగాగల భక్తుల వైకుంఠ యాత్ర. (గోదావరీ ప్రవేశం)

1835 — రాజా చందూలాలు శ్రీ స్వామివారికి సనదు నొసంగుట.

1855 — ప్రభుత్వమువారు విచారించి దేవాలయ భృతిని స్థిరపరచుట.

1859 — శ్రీ అశ్వారావు గారికి పాలవంచను కవులుగా నొసగుట.

1860 — ఇంగ్లీషువారికి ఉత్తర సర్కారులను నైజాం యిచ్చి వేయుట.

1870 — దేవాలయకార్య నిర్వహణమును నైజాం ప్రభుత్వం స్వీకరించుట.

1874 — మధ్యపరగణాల నుంచి భద్రాచలమును వేరుచేసి మదరాసులో కలుపుట.

1908 — పోలీసు బందోబస్తు గోదావరి జిల్లావారు నిర్వహించుట, ఆలయ నిర్వహణమాత్రం నైజాము వారు చేయుట.

1918 — నైజాం సుబేదారు దేవాలయభృతి విచారణచేసి స్థిరపరచుట.

1953 — ఆంధ్రరాష్ట్రావతరణము.

1956 — ఆంధ్ర ప్రదేశావతరణము.